

'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి.
దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 331

మంగళవారం 21-2-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

యాదాద్రిలో మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి - 5లో

దర్గాగా సెమీస్‌కు...

- వివరాలు 14లో▶

సమగ్ర భూచట్టం!

124 భూచట్టాలన్నీ కలిపి రెవెన్యూ కోడ్ తేవాలంటున్న నిపుణులు

- ఇప్పటికే ఈ అంశంపై ముసాయిదా రూపొందించిన నల్సర్ వర్సిటీ
- ఆ సూచనలు, ప్రతిపాదనలపై స్పందించని రాష్ట్ర ప్రభుత్వం
- వాటిని వెంటనే అమలు చేయాలని కోరుతున్న భూ చట్టాల నిపుణులు
- గ్రామాల్లో రెవెన్యూ కోర్టులు పెడితేనే ధరణి సమస్యలకు పరిష్కారం
- కౌలురైతులకు రుణాల కల్పన, పోడు భూములపై హక్కులూ కీలకమే
- భూలావాదేవీ జరిగినప్పుడల్లా సదరు భూమిలో సర్వే చేస్తే ప్రయోజనం
- లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఖ్యను తగినంత పెంచాలి
- పారాలీగల్, కమ్యూనిటీ సర్వేయర్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూముల వివాదాలు, సమస్యలను పరిష్కరించడం కోసం సమగ్ర చట్టాన్ని అమల్లోకి తెచ్చే అంశం మరోమారు తెరపైకి వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో అమల్లో ఉన్న 124 భూ చట్టాలన్నింటినీ కలిపి.. రెవెన్యూ కోడ్ (ఒకే చట్టం)గా రూపొందించాలని భూచట్టాల నిపుణులు, రిటైర్డ్ రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పరిశీలనలో ఉన్న ఈ ప్రతిపాదనపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని.. ఇది అమల్లోకి వస్తేనే రాష్ట్రంలోని భూముల పరిపాలన, హక్కుల కల్పన, వివాదాల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలో రెండేళ్ల క్రితం కొత్త రెవెన్యూ చట్టాన్ని అమల్లోకి తెచ్చినా.. దాన్ని కేవలం ఒక్క భూహక్కుల రికార్డుల చట్టం –1971ని సవరించి తెచ్చుకున్నామని గుర్తు చేస్తున్నారు. దీనితోపాటు ప్రస్తుతం అమల్లో ఉన్న అన్ని భూచట్టాలను కలిపి కొత్తగా సమగ్ర చట్టాన్ని తెస్తేనే ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు.

దేశవ్యాప్తంగా 'కోడ్' ప్రయత్నాలు

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 2016లోనే రెవెన్యూ కోడ్‌ను అమల్లోకి తెచ్చారు. అది దేశంలోనే మార్గదర్శకంగా నిలిచిందని.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర కూడా దాదాపు ఒకే తరహా చట్టంతో రెవెన్యూ పాలన చేస్తున్నాయని భూచట్టాల నిపుణులు, రిటైర్డ్ రెవెన్యూ అధికారులు చెప్తున్నారు. ఒడిశాలోనూ కొత్త సమగ్ర చట్టం కోసం ఇటీవలే మంత్రులు, సీనియర్ అధికారులతో హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారని గుర్తు చేస్తున్నారు. దేశమంతా రెవెన్యూ కోడ్ వైపు ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో.. తెలంగాణలోనూ ఆ దిశలో ప్రయత్నాలు మళ్లీ



ప్రారంభం కావాలని కోరుతున్నారు. ప్రస్తుతమున్న ఆర్ఓఆర్, కౌలుచట్టం, ఇనాముల రద్దు, అసైన్డ్ భూముల చట్టం వంటివన్నీ రద్దు చేసి ఒకే చట్టాన్ని తీసుకుని రావాలని ప్రభుత్వానికి పూర్తి స్థాయి నివేదిక కూడా అందించారు.

రాష్ట్రం ఏర్పాటైన మొదట్లోనే..

వాస్తవానికి తెలంగాణలో సమగ్ర రెవెన్యూ చట్టాన్ని రూపొందించుకునే ప్రయత్నం రాష్ట్రం ఏర్పాటైన కొత్తలోనే మొదలైంది. నాటికి ఉన్న రెవెన్యూ చట్టాలన్నింటినీ సమీక్షించి కొత్త చట్టాన్ని రూపొందించే బాధ్యతను నల్సార్ విశ్వవిద్యాలయానికి అప్పగిస్తూ 2015లోనే రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ జీవో మేరకు రెవెన్యూ చట్టాలను పునఃసమీక్షించిన నల్సార్ వర్సిటీ 30 పేజీలతో కూడిన సమగ్ర భూచట్టాల ముసాయిదాను ప్రభుత్వానికి అందజేసింది. ప్రస్తుతం ఈ ముసాయిదా కూడా అందుబాటులో ఉన్న నేపథ్యంలో.. భూ వివాదాలు తగ్గేలా, పాలన సులభతరం చేసేలా, గందరగోళానికి తావులేకుండా ఉండే సమగ్ర భూచట్టాన్ని రూపొందించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

హక్కుల చిక్కులు తీర్చేదిశగా.. భూచట్టాల నిపుణులు చేస్తున్న సూచనలివీ..

భూసమస్యలు పరిష్కారం కావాలంటే సర్వే తప్పనిసరి. ఒకప్పుడు సర్వేకు ఏళ్లు పట్టేది. కానీ ఇప్పుడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో

మిగతా 2వ పేజీలో ▶

హైదరాబాద్ 'స్థానిక' ఎమ్మెల్సీ అభ్యర్థిగా జాఫ్రీ

- హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ సీటుకు జరుగుతున్న ఎన్నికలో బీఆర్ఎస్ మద్దతుతో బరిలోకి దిగేందుకు ఎంఐఎం సన్నాహాలు చేసుకుంటోంది.

ఆ పార్టీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్సీ సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ మరోమారు పోటీ చేస్తున్నారు. ఈ నెల 23న జాఫ్రీ నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు.
వచ్చే నెల 13న పోలింగ్ జరగనుంది. - వివరాలు 2లో▶

గొప్పగా.. గర్వంగా!

మునుపెన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయం అమలు చేస్తున్నాం: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

18 మంది పేర్లు ఎమ్మెల్సీలుగా ఖరారు.. | **14** మంది బీసీ, ఎస్టీ, ఎస్సీలే



- మిగిలిన 4 సీట్లలో ఒక్కో సామాజిక వర్గానికి ఒక్కొక్కటి
- స్థానిక సంస్థలు, ఎమ్మెల్యే, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులతో సీఎం సమావేశం - వివరాలు 10లో▶

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే -10లో

జీనోమ్ వ్యాలీలో గ్లాండ్ ఫార్మా పెట్టుబడి
రూ. 400 కోట్లు

- మంత్రి కేటీఆర్‌తో గ్లాండ్ ఫార్మా ఎండీ భేటీ
- 500 మందికిపైగా ఉపాధి లభించే అవకాశం - 3లో▶

ఈపీఎస్ కింద ఇక అధిక పెన్షన్!

- ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ సన్నాహాలు
- సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ
- 'వేతనంలో 8.33 శాతం చెల్లింపు' సవరణ అమలు
- క్షేత్రసాయిలో అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు చర్యలు

3లో

6 శాతం వడ్డీ చెల్లించండి

కోవిడ్ సమయంలో ఆపిన వేతనాలు, పింఛన్లపై తీర్పు

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- సుప్రీం తీర్పును పరిగణనలోకి తీసుకుని హైకోర్టు ఆదేశాలు

- వివరాలు 2లో▶



ఉక్రెయిన్‌లో బైడెన్ ఆకస్మిక పర్యటన

- వివరాలు 6లో▶

క్లుప్తంగా...

‘వినోదపన్ను’పై పునర్విచారణ చేయండి
హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచన

సాక్షి, న్యూఢిల్లీ: గౌతమీపుత్ర శాతకర్ణి, రుద్రమదేవి సినిమాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వినోద పన్ను మినహాయింపుపై పునర్విచారణ చేసి మూడు నెలల్లో సమస్య పరిష్కరించాలని తెలంగాణ హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచించింది. ప్రభుత్వం వినోద పన్ను మినహాయింపు ఇచ్చినా నిర్మాతలు టికెట్ల ధరలు తగ్గించలేదంటూ సినీ ప్రేక్షకుల సంఘం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సోమవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పార్డీవాలాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. దీంతో పైవిధంగా హైకోర్టుకు సూచిస్తూ విచారణ ముగించింది.

హాథ్ సే హాథ్ జోడో యాత్రలకు ఇన్‌చార్జులు

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రల సమన్వయం కోసం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జులను నియమించింది. రాష్ట్రంలోని 64 మంది టీపీసీసీ ప్రధాన కార్యదర్శులకు ఈ బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఖదీర్ మృతిపై హోంమంత్రి, ఒవైసీ ఎందుకు మాట్లాడట్లేదు?
టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఖదీర్‌ఖాన్ మెదక్ పోలీసుల దెబ్బలకు తాళలేక చనిపోయాడని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆ కేసును కప్పిపుచ్చుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి ఆరోపించారు. ఖదీర్‌ఖాన్ లాకప్‌డెత్‌పై ప్రభుత్వం ఎందుకు విచారణ కమిటీని నియమించడంలేదని ప్రశ్నించారు. సోమవారం గాంధీభవన్‌లో వినోద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని మైనార్టీల తరఫున మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న హోం మంత్రి మహమూద్‌అలీ, మైనార్టీలకు తానే రక్షణ అని చెప్పుకునే ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీలు ఈ విషయంలో ఎందుకు నోరు మెదపడం లేదని అడిగారు. ఖదీర్ మృతిపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని, బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించడంతో పాటు, మృతికి కారణమైన పోలీసులను అరెస్టు చేయాలని వినోద్‌రెడ్డి డిమాండ్ చేశారు.

తెలంగాణ పోలీస్‌కు యూఎన్ మిషన్ అవార్డు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పోలీస్‌కు యూఎన్ (యునైటెడ్ నేషన్స్) మిషన్ అవార్డు దక్కింది. దక్షిణ సూడాన్‌లో యూఎన్ మిషన్ కోసం విధులు నిర్వర్తిస్తున్న తెలంగాణ డీజీపీ కార్యాలయం ఇన్‌స్పెక్టర్ కొప్పుల నాగేందర్ రావుకు యూఎన్ మిషన్ శాంతి మెడల్ లభించింది. ఈ మేరకు దక్షిణ సూడాన్‌లో భారత అంబాసిడర్ శర్మ.. ఈ అవార్డును నాగేందర్‌కు ఇటీవలే అందించారు. యూఎస్ మిషన్‌లో నాగేందర్‌రావు సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు.

సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్ అరెస్టు



సాక్షి, హైదరాబాద్/రాజేంద్రనగర్: సంధ్య కన్వెన్షన్ మేనేజింగ్ డైరెక్టర్, రియల్టర్ సరనాల శ్రీధర్‌ను సోమ వారం ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. బిగ్ బీ అమితాబ్ బచ్చన్ సమీప బంధువు, ఢిల్లీకి చెందిన వ్యాపారి అవనీష్ చంద్ర ఝా, అనిల్ నందలను మోసం చేసిన కేసులో అక్కడి పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. ఆయనను రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై ఢిల్లీ తరలించారు. రెండేళ్లగా శ్రీధర్‌రావుపై కొందరు బాధితులు ఫిర్యాదులు చేయడం, కేసులు నమోదు కావడంతో అరెస్టు కూడా అయ్యారు. కొన్ని కేసుల్లో బెయిల్ సైతం పొందారు. ఢిల్లీకి చెందిన జేబీపీఎల్ సంస్థ నిర్వాహకులు అవనీష్, అనిల్‌లతో శ్రీధర్ రూ.250 కోట్ల లావాదేవీలు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన తమను మోసం చేశారంటూ బాధితులు ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్‌కు గతేడాది డిసెంబర్ 24న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు ఈ ఏడాది జనవరి 12న శ్రీధర్‌కు నోటీసులు జారీ చేశారు. ఆదివారం నగరానికి వచ్చిన ప్రత్యేక బృందం శ్రీధర్‌ను సోమవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయం వద్ద అరెస్టు చేసింది. వైద్య పరీక్షల అనంతరం ట్రాన్సిట్ వారెంట్‌పై ఢిల్లీ తరలించారు. కోర్టు వద్ద శ్రీధర్ మీడియాతో మాట్లాడుతూ తనపై వచ్చినవి నిరాధార ఆరోపణలన్నారు. శ్రీధర్ తరఫు న్యాయవాది మీడియాతో మాట్లాడుతూ, ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్‌లో నమోదైన కేసుకు, అందులోని ఆరోపణలకు శ్రీధర్‌కు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

‘గంగిగోవు పాలు గరిటెడైనను చాలు.. కడివెడైననేమి ఖరము పాలు’.. అంటూ వేమన అప్పట్లో గాడిదపాలను విలువలేనివిగా భావించి అలా పద్యం రాశాడేమోగానీ వాటి పాల వల్ల కలిగే ఆరోగ్య, ఆర్థిక ప్రయోజనాల గురించి తెలిసుంటే రూ. కోట్లిచ్చును ఖరము పాలు అని రాసేవాడేమో.. ఎందుకిదంతా చెప్పడమంటే.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ యువరైతు రాష్ట్రంలోనే మొదటి గాడిద డెయిరీ ఫాంను ఏర్పాటు చేసుకొని భారీ లాభాలు ఆర్జిస్తున్నాడు మరి! ఆ యువరైతు విజయ ప్రస్థానంపై ‘సాక్షి’ప్రత్యేక కథనం.

గాడిద ‘గుడ్’!



గాడిదల డెయిరీతో లాభాలు ఆర్జిస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా యువరైతు	• ప్రస్తుతం ఫాంలో 80 గాడిదలు.. విదేశాలకు పాల ఎగుమతిపై కసరత్తు
లీటర్ పాలకు రూ. 4-5 వేలు పలుకుతున్న ధర	• ఆయుర్వేద మందులు, కాస్మొటిక్స్ తయారీలో గాడిద పాల వాడకం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వెల్గొండకు చెందిన పులిదండ నగేష్ కుటుంబం వినూత్న వ్యాపార ఆలోచనను ఆచరణలోపెట్టి అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. సంప్రదాయ ఆవు, గేదె పాల డెయిరీలకు పూర్తి భిన్నంగా గాడిద పాల డెయిరీని ఏర్పాటు చేసి విజయవంతంగా నడుపుతోంది. వ్యవసాయ కుటుంబానికి చెందిన నగేష్‌కు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు అఖిల్ డిగ్రీ చేయగా చిన్నకొడుకు వంశీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. నగేష్ తల్లిదండ్రులు నర్సోజీ, లలితమ్మ. వారి కులవృత్తి (మాంసం విక్రయించడం) కూడా చేసేవారు. పలు రకాల పంటల సాగుతోపాటు పలు వ్యాపారాలు చేసినా ఆర్థికంగా ఉన్నతస్థితికి చేరుకోకపోవడంతో ఏదైనా కొత్తగా చేయాలనే ఆలోచనతో అఖిల్ యూట్యూబ్‌లో అన్వేషిస్తుండగా డాంకీ ఫామ్‌పట్ల ఆసక్తి కలిగింది.



ఫ్రాన్స్ నుంచి తెచ్చిన పోటియో రకం గాడిదలు

రాజస్తాన్‌లోని ఎన్ఆర్‌సీలో శిక్షణ..

యూట్యూబ్‌లో సెర్చ్ చేస్తున్న క్రమంలో అఖిల్ రాజస్తాన్‌లోని నేషనల్ రీసెర్చ్ సెంటర్‌లో గుర్రాలు, గాడిదల పెంపకం, పాల ఉత్పత్తుల గురించి శిక్షణ ఇస్తున్నారని తెలుసుకొని అక్కడికి వెళ్లాడు. నెలకు వారం చొప్పున మూడు నెలలు శిక్షణ తీసుకున్నాడు. అనంతరం గుజరాత్‌లోని ఖతియవాడి, హలరీతోపాటు ఫ్రాన్స్ (పోటియో రకం) నుంచి గాడిదలను దిగుమతి చేసుకున్నాడు. ఒక్కోదానికి రూ.50 వేల నుంచి రూ.70 వేలు వెచ్చించి మొత్తం 60 గాడిదలు తెచ్చుకున్నాడు. ఇందులో 57 ఆడ.. మూడు మగవి. ఈ నెలలో మరో 20 గాడిదలను (ఆడ 16, మగ 4)ను తీసుకురావడంతో వాటి సంఖ్య 80కి చేరింది.

లీటర్ రూ. 4- 5 వేలు

రోజుకు ఒక గాడిద గరిష్టంగా లీటర్ వరకు పాలు ఇస్తుంది. ఉదయం, సాయంత్రం రెండుసార్లు పితికితే లీటరున్నర వరకు పాలు వస్తాయి. ఈ పాలను ఎక్కువగా ఆయుర్వేద మందులు, కాస్మొటిక్స్ తయారీకి వినియోగిస్తున్నారు. ఈ మేరకు కంపెనీలు పలు ఏజెన్సీల ద్వారా అంతర్జాతీయంగా కొనుగోలు చేస్తున్నాయి. లీటర్ గాడిద పాలకు రూ. 4 వేల నుంచి రూ. 5 వేల వరకు ధర పలుకుతోంది. పాల ఉత్పత్తి, గాడిదల ఆరోగ్యంపై ఏజెన్సీలు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తుండగా.. ఫామ్ నిర్వాహకులు స్థానిక పశు వైద్యాధికారి సాయంతో రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. పెద్దమొత్తంలో పాలు ఉత్పత్తి అయితే ఇంకా అధిక ధరతో నేరుగా విదేశాలకు ఎగుమతి చేసుకునే అవకాశం ఉంది.



> **మంచి బ్రీడ్, ఏజెన్సీ చూసుకోవాలి**
>
> 
>
> గతేడాది నవంబర్ 13న ఫామ్ అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం 23 గాడిదలు పాలు ఇస్తున్నాయి. పోటియో (ఫ్రాన్స్) గాడిదలు రోజుకు 2 లీటర్ల వరకు పాలు ఇస్తాయి. గాడిద పాలు 6 నెలల వరకు నిల్వ ఉంటాయి. అయితే వాటిని ఫ్రిజ్‌లోనే ఉంచాలి. ఏజెన్సీ వాళ్లు ప్రస్తుతం 15 రోజులకు లేదా నెలకోసారి వచ్చి పాలు తీసుకెళ్తున్నారు. గాడిద పాల వ్యాపారం లాభదాయకమే. అయితే మంచి బ్రీడ్, ఏజెన్సీని ఎంచుకోవాలి.
>
> – పులిదండ నగేష్, గాడిద ఫాం నిర్వాహకుడు



హలరీ గాడిదలు

మొత్తం 20 ఎకరాల్లో..

ఫామ్‌తోపాటు గాడిదలకు దాణా కోసం వివిధ రకాల గడ్డి పెంచేందుకు బిజినేపల్లి మండల కేంద్రంలోని వృద్ధాశ్రమం సమీపంలో దాదాపు 20 ఎకరాలు లీజుకు తీసుకున్నాడు. అందులో ఒక పెద్ద షెడ్ (ఐదు భాగాలు), మరో 3 చిన్న షెడ్‌లు ఏర్పాటు చేసి గాడిదలను వేర్వేరుగా పెట్టాడు. వాటికి కావాల్సిన దాణా కోసం దాదాపు 15 ఎకరాల్లో సీఎస్‌వీ 33 ఎంఎఫ్ (జొన్న రకం), దశరథ గడ్డి, 4జీ బులెట్ (సూపర్ నేపియర్ రకం), మొర్ర గడ్డి తీగ పెంచుతున్నాడు. వీటితోపాటు ఎండు వరి గడ్డి, మక్కసొప్ప, బుడ్డ (పల్లి) పొల్లు, మక్క, గోధుమ, బార్లీ, పిండిని గాడిదలకు ఆహారంగా ఇస్తున్నాడు. గాడిదలను చూసుకునేందుకు రెండు కుటుంబాలను తమిళనాడు నుంచి రప్పించి వారికి వసతి కల్పిస్తున్నాడు.

---

6 శాతం వడ్డీ చెల్లించండి



కోవిడ్ సమయంలో ఆపిన వేతనాలు, పింఛన్లపై తీర్పు

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- 12 శాతం కోరుతూ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల పిటిషన్
- సుప్రీం తీర్పును పరిగణనలోకి తీసుకుని హైకోర్టు ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ సమయంలో ఆపిన ఉద్యోగుల వేతనాలు, విశ్రాంత ఉద్యోగుల పింఛన్ల బకాయిలపై 6 శాతం వడ్డీ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. లాక్‌డౌన్ కాలం కొనసాగే వరకు 50 శాతం వేతనం, పింఛన్లలో కోత విధిస్తూ 2020, మార్చి 30న రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 27ను తీసుకొచ్చింది. తర్వాత దీనిపై ఆర్డినెన్స్ కూడా తెచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టు విశ్రాంత అధికారులు, ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు, తెలంగాణ పింఛనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులతో పాటు మరికొందరు రిట్ పిటిషన్లు, ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది సత్యంరెడ్డి రాసిన లేఖను హైకోర్టు పిల్‌గా స్వీకరించింది. వీటన్నింటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది చిక్కుడు చైతన్య మిత్ర వాదనలు వినిపించారు. కోవిడ్ సమయంలో ఉద్యోగుల వేతనాలతో పాటు పింఛన్లు కూడా ఆపారన్నారు.

మూడు నెలలు ఇబ్బందులు పడ్డారు..

మూడు నెలలపాటు 50 శాతం వేతనాలు, పింఛన్లు నిలిపేయడంతో వారు ఇబ్బందులు పడ్డారని నివేదించారు. మూడు నెలలు ఆపిన మొత్తాన్ని కూడా ఒకేసారి చెల్లించలేదని, వాటిని కూడా విడతల వారీగా చెల్లించారని చెప్పారు. ఈ మొత్తానికి 12 శాతం వడ్డీ చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. కోవిడ్ సమయంలో ఆపిన వేతనాలు, పింఛన్లకు 6 శాతం వడ్డీ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వాదనలు ముగించింది. 2020, మార్చిలో జీవో విడుదల చేసిన తర్వాత మార్చి, ఏప్రిల్, మే నెల వేతనాల్లో కోత విధించారు. వీటిని ఇదే సంవత్సరం నవంబర్, డిసెంబర్, 2021 జనవరి, ఫిబ్రవరిలో విడతలవారీగా చెల్లించారు.

‘విద్యుత్ బకాయిల’పై కేంద్రం వివక్ష

- హైకోర్టులో తెలంగాణ వాదనలు
- విచారణ మార్చి 14కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ బకాయిల చెల్లింపుల అంశంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో వాదనలు వినిపించింది. అందులో భాగంగానే రూ. 6,757 కోట్ల విద్యుత్ బకాయిలను వెంటనే ఏపీకి చెల్లించాలని ఆదేశాలు జారీ చేసిందని పేర్కొంది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ, తెలంగాణ మధ్య విద్యుత్ పంచాయితీ నడుస్తోంది. తెలంగాణ తమకు విద్యుత్ చార్జీలు బకాయి పడిందంటూ ఏపీ ఫిర్యాదు చేయడంతో కేంద్రం గతేడాది కీలక ఉత్తర్వులిచ్చింది. ఏపీ వాదనతో ఏకీభవించిన కేంద్రం అసలు, లేట్ పేమెంట్ సర్ చార్జీ కింద కలిపి మొత్తం రూ.6,757 కోట్లను ఏపీకి చెల్లించాలని తెలంగాణను ఆదేశించింది. 30 రోజుల్లోగా చెల్లింపులు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించింది. కేంద్రం ఆదేశాలపై సీజే ధర్మాసనం గతంలో విచారించి స్టే విధించింది. కాగా, ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం కూడా విచారణ జరిపింది. ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి, తెలంగాణ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపించారు.

రావాల్సిన వాటిని పరిగణనలోకి తీసుకోలేదు

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థల నుంచి తెలంగాణ విద్యుత్ సంస్థలకు రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కేంద్రం పరిగణనలోకి తీసుకోకుండానే ఏపీకి అనుకూలంగా ఆదేశాలు జారీ చేసిందని వైద్యనాథన్ పేర్కొన్నారు. ఒక రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉంటే, మరో రాష్ట్రం 10 ఏళ్ల వరకు సరఫరా చేయాలని ఏపీ పునర్విభజన చట్టంలో ఉందని, అయినా విడిపోయిన తర్వాత తెలంగాణకు ఏపీ విద్యుత్ సరఫరా నిలిపివేసిందని నివేదించారు. దీంతో తెలంగాణ బయటి నుంచి విద్యుత్ కొనుగోలు చేయాల్సి వచ్చిందని, ఈ కారణంగా రాష్ట్రంపై రూ.4,740 కోట్ల భారం పడిందని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను మార్చి 14కు వాయిదా వేసింది.

సమగ్ర భూచట్టం..

▶ మొదటి పేజీ తరువాయి

చాలా తక్కువ సమయంలోనే సర్వే చేయవచ్చు. ఇందుకోసం సర్వే, హద్దుల చట్టం–1923 స్థానంలో కొత్త చట్టం తేవాలి. ఈ సర్వే పూర్తయ్యేలోపు భూలావాదేవీ జరిగిన ప్రతిసారీ సంబంధిత భూమిలో సర్వే జరగాలి. సర్వేయర్ల కొరతను నివారించేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి.. వారికి తగిన శిక్షణ ఇవ్వాలి. గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న కమ్యూనిటీ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలి.

- భూమి హక్కులకు ప్రభుత్వమే భరోసా ఇచ్చే టైటిల్ గ్యారంటీ చట్టాన్ని తేవాలి. కేంద్రం సూచనలకు అనుగుణంగా ఈ కొత్త చట్టం చేయాలి.
- భూసంబంధిత అంశాలన్నిటిపై ఒకే చట్టం ఉండి, అది ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలి. అమలుచేసే వారికీ సులభంగా ఉంటుంది. అన్ని భూచట్టాల్ని కలిపి రెవెన్యూకోడ్‌గా రూపొందించాలి.
- ధరణి పోర్టల్‌లో సమస్యలు పరిష్కారం కావాలంటే ఆ రికార్డులన్నింటినీ కాగితాల్లోకి ఎక్కించాలి. ప్రజల భాగస్వామ్యంతో సర్వే నంబర్ల వారీగా సమస్యలు గుర్తించి.. గ్రామంలోనే రెవెన్యూ కోర్టు పెట్టి వాటిని పరిష్కరించాలి.
- భూవివాదాల పరిష్కార చట్టాన్ని తెచ్చి జిల్లాకో శాశ్వత ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి. రిటైర్డ్ జడ్జి /రెవెన్యూ నిపుణుల నేతృత్వంలో పనిచేయాలి.
- కౌలు రైతుల కోసం చట్టాల్లో మార్పు రావాలి. పోడు సాగు చేస్తున్న గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలి.
- పేదలకు భూసమస్యలు, వివాదాలు వచ్చినప్పుడు వాటిని కోర్టుల్లో పరిష్కరించుకోవడంలో సాయం అందించేందుకు పారాలీగల్, కమ్యూనిటీ సర్వేయర్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- భూమిలేని నిరుపేద కుటుంబాలకు భూములు ఇచ్చే మార్గాలు వెతకాలి. భూవిధానం, వినియోగం ప్రజలకు మేలు కలిగేలా ఉండాలి. ఇందుకోసం భూపరిపాలనను మెరుగుపర్చాలి. భూఅకాడమీ ఏర్పాటు చేసి భూపరిపాలనలో సిబ్బంది కొరత లేకుండా నియామకాలు జరపాలి.
- ఈ అన్ని చర్యలు తీసుకునేందుకు వీలుగా భూకమిషన్‌ను ఏర్పాటు చేయాలి.

రైతులు, సామాన్య ప్రజల డిమాండ్లు ఇవీ..

- → భూములను రీసర్వే చేయాలి. భూరికార్డులను సవరించి అందరికీ అందుబాటులో ఉంచాలి.
- → పేదలకు భూములను పంపిణీ చేయాలి. కౌలుదారులకు రుణ అర్హత కార్డులు ఇవ్వాలి.
- → సాదాబైనామా భూములను క్రమబద్ధీకరించాలి. పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలి.
- → రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న భూవివాదాలను పరిష్కరించి సాగులో ఉన్న వారికి పట్టాలివ్వాలి. ప్రతి గ్రామంలో ఓ రెవెన్యూ అధికారి ఉండాలి. అన్యాక్రాంతమైన గిరిజన, అసైన్డ్ భూముల్ని తిరిగి ఇప్పించాలి. మహిళలకు భూహక్కులు కల్పించాలి. పారాలీగల్ వ్యవస్థను బలోపేతం చేయాలి.

> **ధరణితోపాటు ఇతర సమస్యలూ ఉన్నాయి**
>
> 
>
> ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితి చూస్తుంటే ధరణి పోర్టల్‌ను సరిచేస్తే భూవివాదాలన్నీ సమసిపోతాయనే అభిప్రాయం కనిపిస్తోంది. ధరణి మాత్రమే సర్వరోగ నివారిణి కాదు. దాని చుట్టూనే చర్చ జరగడం సమంజసం కాదు. తెలంగాణ ఏర్పాటవుతున్న సమయంలోనే ‘ల్యాండ్ క్యారవాన్’ పేరుతో రాష్ట్రంలో 3వేల కిలోమీటర్లు ప్రయాణించి పదివేల మందికిపైగా రైతులను, భూయజమానులను కలిసి నివేదిక రూపొందించాం. ప్రస్తుతం అమల్లో ఉన్న రెవెన్యూ చట్టాలన్నింటినీ కలిపి రెవెన్యూ కోడ్‌గా రూపొందించడం, భూముల రీసర్వే, టైటిల్ గ్యారంటీ చట్టాన్ని తీసుకురావడం ఈ నివేదికలో ప్రధానమైనవి. వీటిపై ప్రభుత్వం దృష్టి సారించాలి.
>
> – భూమి సునీల్, భూ చట్టాల నిపుణుడు

తెలంగాణ నుంచి 47 మందికి అవకాశం

- ఏఐసీసీ 85వ ప్లీనరీలో పాల్గొనే సభ్యుల జాబితా విడుదల
- 33 మంది ఎలక్టెడ్, 14 మంది కోఆప్టెడ్ సభ్యులు

సాక్షి, న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఈనెల 24 నుంచి 26 వరకు జరగనున్న ఏఐసీసీ 85వ ప్లీనరీలో పాల్గొనేందుకు తెలంగాణ నుంచి 47 మంది నాయకులకు అవకాశం కల్పించారు. ఇందులో 33 మంది ఎన్నికైన సభ్యులు కాగా, మిగతా 14 మంది కోఆప్టెడ్ సభ్యులు. ఏఐసీసీకి ఎన్నికైన సభ్యులుగా తెలంగాణ నుంచి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీలు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, పొదెం వీరయ్య, సీతక్క, జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ముఖ్య నేతలు జానారెడ్డి, షబ్బీర్ అలీ, వీహెచ్, పొన్నాల లక్ష్మయ్య, దామోదర రాజనర్సింహ, రేణుకాచౌదరి, బలరాం నాయక్, మధు యాష్కీగౌడ్, మహేశ్వర్‌రెడ్డి, చిన్నారెడ్డి, సంపత్ కుమార్, వంశీచంద్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, అంజన్‌కుమార్ యాదవ్, కొండా సురేఖ, మల్లు రవి, గీతారెడ్డి, కోదండరెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, అజారుద్దీన్, మహేశ్‌కుమార్ గౌడ్, సంజీవరెడ్డి, శివసేన రెడ్డి, బల్మూరు వెంకట్ ఉన్నారు. కాగా, ఆర్.దామోదర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేశ్ షెట్కార్, రమేశ్ ముదిరాజ్, హర్కర వేణుగోపాల్, కుసుమ కుమార్, నిరంజన్, టి.కుమార్‌రావు, బెల్లయ్యనాయక్, బూస అనులేఖ, సునీతా రావు, కోట నీలిమలకు ఏఐసీసీ కో ఆప్టెడ్ సభ్యులుగా అవకాశం కల్పించారు. ప్లీనరీలో ఈ ఏడాది జరిగే పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2024 సార్వత్రిక ఎన్నికలకు దేశ వ్యాప్తంగా బీజేపీని ఎదుర్కొనేందుకు పార్టీ ఎలా సిద్ధం కావాలన్న అంశంపై చర్చించనున్నారు. 24వ తేదీన జైరామ్ రమేశ్ నేతృత్వంలోని ముసాయిదా కమిటీ తయారుచేసిన తీర్మానాలను చర్చించి ఖరారు చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

బీజేపీపై పోరు ప్రాంతీయ పార్టీలతోనే సాధ్యం
ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: బీజేపీకి వ్యతిరేకంగా పోరాడేశక్తి ప్రాంతీయ పార్టీలకే ఉందని, పెద్ద ప్రాంతీయ పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌కు పెద్దగా బలం లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేవలం మూడు రాష్ట్రాల్లో మాత్రమే కాంగ్రెస్ సొంతంగా అధికారంలో ఉందని, అందుకే రాహుల్‌గాంధీ తన ప్రత్యర్థిగా ఉండాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. కవిత ఓ ప్రైవేటు చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జాతీయ రాజకీయాలపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. బీజేపీని ఎదుర్కొనే శక్తి కాంగ్రెస్ పార్టీకి లేదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో భావసారుప్యత కలిగిన పార్టీలతో బలమైన కూటమి ఏర్పాటు చేసి బీజేపీని ఎదుర్కోవడమే బీఆర్ఎస్ అంతిమ లక్ష్యమన్నారు. బీఆర్ఎస్ విస్తరణలో భాగంగా ఆయా రాష్ట్రాల్లో భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి పనిచేస్తామని చెప్పారు. తెలంగాణలో బీజేపీకి క్షేత్రస్థాయిలో ప్రజాబలం లేనందున తమకు ప్రధాన ప్రత్యర్థి కాదన్నారు. దుబ్బాకలో స్వల్ప మెజారిటీ, హుజూరాబాద్‌లో ఈటల సొంత బలంతో బీజేపీ గెలిచిందన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ సీఎంలు, కేంద్రమంత్రులు వచ్చి ప్రచారం చేసినా పూర్తి మెజారిటీ సాధించలేదనే విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిపక్ష పార్టీలపై దర్యాప్తు సంస్థలను ప్రయోగించినా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. తప్పు చేయనందున దర్యాప్తు సంస్థల చర్యలకు భయపడబోమన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ పసుపుబోర్డు అంశంపై నాలుగేళ్లుగా టైమ్ పాస్ చేస్తున్నారని కవిత విమర్శించారు.

దేశంలో విద్యుత్ అత్యయిక పరిస్థితి

- విద్యుత్ చట్టంలోని సెక్షన్ 11 కింద ప్రకటించిన కేంద్రం
- ఏప్రిల్‌లో దేశ విద్యుత్ డిమాండ్ 249 గిగావాట్లకు పెరగనుందని అంచనా

సాక్షి, హైదరాబాద్: వేసవిలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరనుందని అంచనాలున్న నేపథ్యంలో విద్యుత్ చట్టం 2003లోని సెక్షన్–11 కింద దేశంలో విద్యుత్ అత్యయిక పరిస్థితిని సోమవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దిగుమతి చేసిన బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలు పూర్తి స్థాయి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి చేసి పవర్ ఎక్స్ఛేంజీలకు సరఫరా చేయాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశించింది. వచ్చే ఏప్రిల్‌లో దేశంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో పెరిగి 249 గిగావాట్స్‌కి చేరనుందని అంచనాలున్నాయని, ఈ మేరకు విద్యుత్ అవసరాలను తీర్చేందుకు దిగుమతి చేసిన బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలు పూర్తి స్థాయి సామర్థ్యంతో నిరంతరం ఉత్పత్తి కొనసాగించాలని కోరింది. అసాధారణ పరిస్థితుల్లో సెక్షన్–11ను ప్రయోగించి తమ సూచనల మేరకు విద్యుదుత్పత్తి జరపాలని విద్యుత్ కేంద్రాలను ఆదేశించే అధికారం కేంద్రానికి ఉంది. గతేడాది వేసవిలో సైతం కేంద్రం సెక్షన్–11ను ప్రయోగించి దిగుమతి చేసిన బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఆదేశాలు జారీ చేసింది.


హైదరాబాద్ ‘స్థానిక’ ఎమ్మెల్సీ అభ్యర్థిగా జాఫ్రీ

బీఆర్ఎస్ మద్దతుతో ఎంఐఎం తరఫున బరిలోకి	• ఈ నెల 23న నామినేషన్ వేసేందుకు సిద్ధం • బీజేపీ పోటీ చేయకుంటే మూడోసారి ఏకగ్రీవమయ్యే చాన్స్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ సీటుకు జరుగుతున్న ఎన్నికలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మద్దతుతో బరిలోకి దిగేందుకు ఎంఐఎం సన్నాహాలు చేసుకుంటోంది. ఆ పార్టీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్సీ సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ మరోమారు పోటీకి సిద్ధమవుతున్నారు. ఈ నెల 16న ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ఈ నెల 23 వరకు కొనసాగనుండగా, వచ్చే నెల 13న పోలింగ్ జరగనుంది. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 23 తుది గడువు కాగా, అదేరోజు జాఫ్రీ నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు. పాత్రికేయుడిగా పనిచేసిన జాఫ్రీ తొలిసారిగా 2010లో స్థానిక సంస్థల కోటాలో హైదరాబాద్ నుంచి ఎంఐఎం తరఫున శాసనమండలిలో అడుగు పెట్టారు. ఆ తర్వాత రెండుసార్లు..2011, 2017లో మండలికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఏడాది మే 1న ఎమ్మెల్సీగా ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకుంటున్న ఆయన వరుసగా నాలుగోసారి ఇదే కోటాలో పోటీ చేసేందుకు ఎంఐఎం అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

హైదరాబాద్ స్థానిక ఓటర్లు 117

హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల కోటాలో మొత్తం 127 మంది ఓటర్లు (పాత ఎంసీహెచ్ పరిధి) ఉండగా, ఇందులో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో 8 మంది సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. గుడిమల్కాపూర్ బీజేపీ కార్పొరేటర్ దేవర కరుణాకర్ ఈ ఏడాది జనవరిలో మరణించడంతో ఓటర్ల సంఖ్య 118గా ఎన్నికల సంఘం నిర్ధారించింది. అయితే ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న రెండురోజుల క్రితం అనారోగ్యంతో మరణించడంతో



ఓటర్ల సంఖ్య 117కు చేరింది. ఇందులో 83 మంది జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు కాగా దివంగత ఎమ్మెల్యే సాయన్నను మినహాయిస్తే మరో 34 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు ఉన్నారు. వీరిలో లోక్‌సభ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ (హైదరాబాద్), జి.కిషన్‌రెడ్డి (సికింద్రాబాద్)తో పాటు ఐదుగురు రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు, దామోదర్‌రావు, సురేష్‌రెడ్డి, సంతోష్‌కుమార్, బండి పార్థసారధి రెడ్డి, మరో 12 మంది ఎమ్మెల్సీలు, 15 మంది ఎమ్మెల్యేలు (నామినేటెడ్ ఎమ్మెల్యేను కూడా కలుపుకొని) శాసనమండలి హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎన్నికలో ఓటు హక్కును కలిగి ఉన్నారు. 117 మంది ఓటర్లలో బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలకు 94 మంది ఓటర్ల బలం ఉంది.

> **బీజేపీ సంఖ్యా బలం 23**
>
> బీజేపీకి ఎక్స్ అఫీషియో సభ్యులు కిషన్‌రెడ్డి (ఎంపీ), రాజాసింగ్ (ఎమ్మెల్యే) ఓట్లు కలుపుకుని హైదరాబాద్ స్థానిక సంస్థల కోటాలో 23 మంది సభ్యుల బలాన్ని కలిగి ఉంది. అయితే ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడం, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ డి.వెంకటేశ్, అడిక్‌మెట్ కార్పొరేటర్ సునీత ప్రకాశ్‌గౌడ్ బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరడంతో ఆయా పార్టీల వాస్తవ బలాబలాల్లో కొంత మార్పు ఉండే అవకాశముంది. ఇదిలా ఉంటే బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీకి భారీగా ఓటర్లు ఉండటంతో హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తుందా లేదా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. బీజేపీ దూరంగా ఉంటే జాఫ్రీ వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యే అవకాశముంది.

ఇదండీ జోక్



ఆ కొబ్బరి చిప్ప ‘డోమ్’లాగా కనిపించిందంట..!?

క్లుప్తంగా...

'మన ఊరు-మన బడి'తో ప్రభుత్వ పాఠశాలకు శోభ

సిరిసిల్ల కుసుమ రామయ్య పాఠశాలపై కేటీఆర్ రీట్వీట్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు-మన బడి' పథకంలో భాగంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అరవై ఏళ్ల ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించడంపై ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు స్పందించారు. 'అరకొర వసతులతో నెట్టుకొచ్చిన సిరిసిల్ల కుసుమ రామయ్య ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు మన ఊరు-మన బడి కింద 12 రకాల మౌలిక వసతులు కల్పించడంతో ఆ బడికి అపూర్వ శోభ వచ్చింది' అని ప్రభుత్వం మన ఊరు-మన బడి ట్విట్టర్ అకౌంట్‌లో పోస్టు చేసింది. కాగా, ఈ పోస్టును కేటీఆర్ రీట్వీట్ చేశారు.

కొడిమ్యాల అటవీ ప్రాంతం చుట్టూ రక్షణ కంచె

కొడిమ్యాల (చొప్పదండి): అటవీశాఖ, గ్రీన్ ఇండియా చాలెంజ్ సంయుక్తంగా కొడిమ్యాల అటవీ పునరుద్ధరణ పనులు చేపట్టనున్నాయి. కొండగట్టు ఆలయానికి ఆనుకుని ఉన్న కొడిమ్యాల అడవిలో సోమవారం పీసీసీఎఫ్ ఆర్ ఎం డోబ్రియాల్ సందర్శించారు. ఈ అటవీ ప్రాంతం పునరుద్ధరణ, అభివృద్ధికి తగు ప్రణాళికలు, సూచనలు చేశారు. ముందుగా అటవీ ప్రాంతం చుట్టూ అవసరమైన చోట్ల రక్షణ కంచె ఏర్పాటు చేయనున్నారు. సుమారు 5 కి.మీ కాలినడక మార్గం (వాకింగ్ ట్రాక్) మట్టితో ఏర్పాటు చేయడం, వెయ్యి ఎకరాలలో ఔషధ, సుగంధ మొక్కల పెంపకం, అందుకోసం అవసరమైన తగిన నర్సరీల ఏర్పాటు, వాచ్ టవర్ నిర్మాణం, భక్తులు సేద తీరేందుకు వీలుగా గజేబో నిర్మాణం తొలి దశలో చేపట్టనున్నారు. కొండగట్టు ఆంజనేయ స్వామి గుడి, పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశాల మేరకు పీసీసీఎఫ్ కొండగట్టులో పర్యటించారు.

1.33 టీఎంసీలను విడుదల చేయండి

తుంగభద్ర బోర్డుకు తెలంగాణ లేఖ

సాక్షి, హైదరాబాద్: యాసంగి పంటలతో పాటు తాగునీటి అవసరాల కోసం కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి 1.339 టీఎంసీల జలాలను రాజోలిబండ మళ్లింపు పథకానికి(ఆర్డీఎస్) విడుదల చేయాలని తుంగభద్ర బోర్డుకు తెలంగాణ నీటిపారుదల శాఖ తాజాగా లేఖ రాసింది. ఈ ఏడాది 5.773 టీఎంసీలను తెలంగాణకు కేటాయించగా, ఇప్పటి వరకు నాలుగు విడతల్లో 2.186 టీఎంసీలను రాష్ట్రం వాడుకుంది. తాజాగా మహబూబ్‌నగర్ జిల్లా అవసరాలకు మరో 1.339 టీఎంసీలకు ఇండెంట్ పెట్టింది.

'సమ్మక్క'పై ఛత్తీస్‌గఢ్‌ను ఒప్పించండి

సీడబ్ల్యూసీకి తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: గోదావరి నదిపై ములుగు జిల్లాలో చేపట్టిన సమ్మక్క(తుపాకులగూడెం) బ్యారేజీని పరిశీలించడానికి రావాలని పలుమార్లు ఆహ్వానించినా ఛత్తీస్‌గఢ్ నుంచి స్పందన కరువైందని తెలంగాణ పేర్కొంది. ప్రాజెక్టు పరిశీలనకు ఛత్తీస్‌గఢ్ ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర నీటిపారుదల శాఖ తాజాగా కేంద్ర జల సంఘానికి (సీడబ్ల్యూసీ) లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్‌లో అనుమతుల కోసం ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించగా, అందులోని కొన్ని విభాగాలు సాంకేతిక క్లియరెన్స్‌లు సైతం ఇచ్చాయి. ఆలోగా ప్రాజెక్టుపై ఛత్తీస్‌గఢ్ సర్కార్ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో సీడబ్ల్యూసీ, డీపీఆర్‌ను ఆ రాష్ట్రానికి పంపించింది. సీడబ్ల్యూసీ సూచనల మేరకు ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలపై రాష్ట్ర ప్రభుత్వం వివరణలు పంపించింది. అభ్యంతరాలు పరిష్కారమైన తర్వాత ఆ రాష్ట్రం నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాలని సీడబ్ల్యూసీ కోరింది. అయితే ఛత్తీస్‌గఢ్ నుంచి స్పందన లేకపోవడంతో అనుమతుల్లో పురోగతి లేకుండా పోయింది. రూ.9,257 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టగా, ఇప్పటికే 95 శాతం పనులు పూర్తయ్యాయి. సమ్మక్క బ్యారేజీ బ్యాక్‌వాటర్‌ను ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలకు తరలించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

పసుపే..

పోచమ్మ తల్లి..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



కర్మభూమిగా పేరున్న భారత ఉపఖండంలో పసుపును ఎంతో పవిత్రమైనదిగా భావిస్తుంటారు. శుభకార్యాల నుంచి పూజల దాకా అన్నింటా పసుపును ప్రత్యేకంగా వినియోగిస్తారు. మరి అలాంటి పసుపు పంటను పండించే రైతులు కూడా ఎంతో నియమ నిష్టలతో ఉంటారు. పసుపు పంటను పోచమ్మ తల్లిగా భావిస్తూ కచ్చితమైన పద్ధతులు, జాగ్రత్తలను పాటిస్తారు. ఉదయమైనా, సాయంత్రమైనా స్నానం చేశాకే పంట చేనులోకి వెళతారు. చెప్పులను కూడా చేను బయటే వదిలేస్తారు. అంటు, ముట్టు వంటివి పాటించే సమయంలో సదరు రైతు కుటుంబాల వారు చేనులోకి అడుగు కూడా పెట్టరు. నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ తదితర జిల్లాల్లో తరతరాలుగా ఇలా పసుపును సాగు చేస్తున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఆశించిన లాభాలు రాకున్నా 'పోచమ్మ తల్లి'పంటగా భావిస్తూ సంప్రదాయంగా సాగు చేస్తున్నవారు చాలా మంది ఉన్నారు.

తరాలుగా పసుపునే సాగు చేస్తున్న రైతు కుటుంబాలు.. పంటను దేవతగా భావిస్తూ జాగ్రత్తలు

స్నానం చేశాకే, చెప్పులు లేకుండా పొలంలోకి..

అంటు, ముట్టు ఉన్నప్పుడు పసుపు పంటకు దూరం

నియమ నిష్టల మధ్య తొమ్మిది నెలల పాటు సాగు

రాష్ట్రంలో సుమారు 2లక్షల ఎకరాల్లో పసుపు పంట..

అత్యధికంగా నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లో సాగు

నిజామాబాద్ మార్కెట్‌కు ఏటా 10 లక్షల క్వింటాళ్ల పసుపు



తాతముత్తాతల నాటి నుంచీ పండిస్తున్నాం..



మేం తాతముత్తాతల నాటి నుంచీ పసుపు పంట సాగు చేస్తున్నాం. పసుపు మా తల్లి పంట. పుట్టి పసుపు (రెండు క్వింటాళ్లు) అమ్మితే తులం బంగారం వచ్చేదని మా తాతలు చెప్పేవారు. ఇప్పటికీ ఇతర పంటల ఆదాయం ఖర్చులకు పోయినా పసుపుపై మిగులు ఉంటుందనే నమ్మకంతో సాగు చేస్తుంటాం. ధర లేకపోవడంతో ఈ సాగు కొంత తగ్గించాం. కానీ అసలు సాగు చేయకుండా మాత్రం ఉండలేం. తల్లి పంట కావడంతో ఒకసారి లాభం రాకున్నా మరోసారి వస్తుంది.

–గడ్డం కళావతి, మహిళా రైతు, రెంజర్ల, ముప్కాల్ మండలం, నిజామాబాద్ జిల్లా

రాష్ట్రంలో పెద్ద పసుపు మార్కెట్ ఇక్కడే..



నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు రాష్ట్రంలోనే అత్యధికంగా పసుపు వస్తుంది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా ప్రతి సీజన్‌లో భారీగానే పసుపు వస్తోంది. డిమాండ్‌కు అనుగుణంగా ధర లభిస్తోంది.

– వెంకటేశం, మార్కెటింగ్ శాఖ ఉప సంచాలకుడు

పోచమ్మ తల్లిగా భావిస్తాం..



పసుపు పంటను పోచమ్మ తల్లిగా భావిస్తాం. ఈ పంట ఉంటేనే మిగతా వ్యవసాయం కలిసి వస్తుందనేది మా నమ్మకం. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి పసుపు సాగు చేయని ఏడాది లేదు. అంటు ముట్టు ఉన్నప్పుడు పసుపు తోటలోకి వెళ్లం.

– కాశారం లత, మహిళా రైతు, మెండోరా

మార్కెట్‌కు అనుగుణంగా సాగు చేస్తున్నా..



ఎనిమిదేళ్లుగా కొత్త వంగడాల పసుపు సాగు చేస్తున్నా. మార్కెట్ డిమాండ్‌కు తగినట్టుగా కర్క్యుమిన్ శాతం అధికంగా 4–5 శాతం ఉండే రాజేంద్ర సోనియా, ఏసీసీ–79, ప్రగతి, పీతాంబర్, రాజేంద్ర సోనాల, రాజపురి, బీఎస్సార్–2 రకాలను వేస్తున్నా. తెగుళ్ల సోకకుండా ఎత్తు మడుల పద్ధతి పాటిస్తున్నా.

– నలిమెల చిన్నారెడ్డి, యువరైతు, మగ్గిడి, ఆర్మూర్ మండలం



నిజామాబాద్ మార్కెట్‌కు ఏటా 10 లక్షల క్వింటాళ్లు

రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ఏటా సుమారు 10 లక్షల క్వింటాళ్ల వరకు పసుపు పంట వస్తుంది. ఇక రాష్ట్రంలో మొత్తంగా సుమారు రెండు లక్షల ఎకరాల్లో పసుపు సాగవుతోంది. ఇందులో అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 35 వేల ఎకరాలు, జగిత్యాలలో 25,000, నిర్మల్‌లో 20,000, వరంగల్‌లో 6,000, మహబూబాబాద్ 4,500, వికారాబాద్‌లో 3,500, హన్మకొండ 2,800, భూపాలపల్లి 1,200 ఎకరాల్లోనూ, ఆదిలాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో ఓ మోస్తరుగా పసుపు సాగవుతోంది. సాధారణంగా ఎకరానికి 120 నుంచి 140 క్వింటాళ్ల పచ్చి పసుపు దిగుబడి వస్తుంది. దానిని ఉడకబెట్టి పాలిష్ చేస్తే 22–25 క్వింటాళ్లు అవుతుంది. రాష్ట్రంలో సాధారణంగా పండించే పసుపులో 3% వరకు 'కర్క్యుమిన్' (ఔషధ లక్షణాలున్న రసాయనం) ఉంటోంది. వైఎస్ సీఎంగా ఉన్న సమయంలో బాల్కొండ నియోజకవర్గంలోని కమ్మర్‌పల్లిలో 30 ఎకరాల్లో వ్యవసాయ వర్సిటీకి అనుబంధంగా పసుపు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయించారు. ఆ పరిశోధన కేంద్రంలో 4% 'కర్క్యుమిన్'వచ్చే దుగ్గిరాల ఎరుపు, పీసీటీ పసుపు వంగడాలను అభివృద్ధి చేశారు.



తారకరత్న భౌతికకాయం వద్ద రోదిస్తున్న తండ్రి మోహనకృష్ణ. చిత్రంలో బాలకృష్ణ, విజయసాయిరెడ్డి తదితరులు



తారకరత్న భౌతికకాయం వద్ద విషణ్ణ వదనంతో భార్య, పిల్లలు

తారకరత్నకు కన్నీటి వీడ్కోలు

మహాప్రస్థానంలో ముగిసిన అంత్యక్రియలు

రాయదుర్గం, బంజారాహిల్స్: సినీనటుడు నందమూరి తారకరత్నకు కన్నీటి వీడ్కోలు పలికారు. రాయదుర్గంలోని వైకుంఠ మహాప్రస్థానంలో అంత్యక్రియలను సోమవారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. అంతకుముందు ఫిలించాంబర్ నుంచి మహాప్రస్థానం వరకు ప్రత్యేక వాహనంలో తారకరత్న భౌతిక కాయాన్ని తీసుకొచ్చారు. పెద్ద సంఖ్యలో కుటుంబసభ్యులు, సినీప్రముఖులు, రాజకీయ నాయకులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. మహాప్రస్థానానికి చేరుకున్న తర్వాత పాడెపైకి తారకరత్న పార్థివదేహాన్ని చేర్చగానే సినీ హీరో బాలకృష్ణ ఆయన సోదరుడు రామకృష్ణతోపాటు బంధువులు, సన్నిహితులు పాడెమోస్తూ చితి వద్దకు తీసుకొచ్చారు. చితికి తండ్రి మోహనకృష్ణ నిప్పు అంటించారు. ఈ సమయంలో తారకరత్న అమర్‌రహే నినాదాలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంపీ విజయసాయిరెడ్డి, సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు నారాలోకేశ్, మాగంటిబాబు, జవహర్, నారాయణ, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితోపాటు నందమూరి కుటుంబసభ్యులు, సినీ ప్రముఖులు, రాజకీయనాయకులు పాల్గొన్నారు.

ఫిలిం చాంబర్‌లో నివాళులు

తొలుత అభిమానులు, ప్రముఖుల సందర్శనార్థం ఉదయం 9 గంటలకు తారకరత్న భౌతికకాయాన్ని ఫిలించాంబర్‌కు తీసుకొచ్చి సాయంత్రం 3 గంటల వరకు ఇక్కడే ఉంచారు. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సినీనటులు దగ్గుబాటి వెంకటేష్, తరుణ్, అశోక్ కుమార్, శివాజీ, కేంద్ర మాజీ మంత్రి పురందరేశ్వరి, కేఏ పాల్ తదితరులు తారకరత్న భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. పెద్దసంఖ్యలో అభిమానులు తరలివచ్చారు.

జీనోమ్ వ్యాలీలో గ్లాండ్ ఫార్మా పెట్టుబడి రూ.400 కోట్లు

మంత్రి కేటీఆర్‌తో సంస్థ ఎండీ భేటీ

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ ఔషధ తయారీ కంపెనీ గ్లాండ్ ఫార్మా రాష్ట్రంలోని జీనోమ్ వ్యాలీలో మరో రూ.400 కోట్ల పెట్టుబడితో కార్యకలాపాలు విస్తరించాలని నిర్ణయించింది. జీనోమ్ వ్యాలీలో బయోలాజికల్స్, బయో సిమిలర్, యాంటీబాడీస్, రీకాంబినెంట్ ఇన్సులిన్ తయారీకి ఇప్పటికే ఉన్న సామర్థ్యాన్ని ప్రస్తుత పెట్టుబడితో గ్లాండ్ ఫార్మా విస్తరిస్తుంది. తద్వారా స్థానికంగా అర్హత, నైపుణ్యం కలిగిన 500 మందికిపైగా యువతకు ఉపాధి కల్పిస్తుంది. గ్లాండ్ ఫార్మా ఎండీ, సీఈఓ శ్రీనివాస్ సదు సోమవారం మంత్రి కేటీ రామారావుతో భేటీ సందర్భంగా గ్లాండ్ ఫార్మా కార్యకలాపాల విస్తరణకు రూ.400 కోట్లు పెట్టుబడిగా పెడుతున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా వ్యాక్సిన్లు, బయోలాజికల్స్, బయోసిమిలార్, యాంటీబాడీస్ తదితర అధునాతన రంగాల్లో ఔషధాల తయారీకి 2022లో రూ.300 కోట్లతో జీనోమ్ వ్యాలీలో గ్లాండ్ ఫార్మా బయో ఫార్మాసూటికల్ సదుపాయాన్ని ఏర్పాటు చేసింది. దీనిద్వారా 200 మందికి ఉద్యోగాలు కల్పించింది. కాగా గ్లాండ్ ఫార్మా తాజా పెట్టుబడిపై రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు ట్విట్టర్ వేదికగా స్పందించారు. జీనోమ్ వ్యాలీలో గ్లాండ్ ఫార్మా తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తున్నట్లు ప్రకటించడం తనకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ భేటీలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ విభాగం సీఈవో శక్తి నాగప్పన్ పాల్గొన్నారు.



కేటీఆర్‌తో భేటీ అయిన శ్రీనివాస్ సదు. చిత్రంలో జయేశ్ రంజన్, శక్తి నాగప్పన్

మరో 295 మెడికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

- ఇప్పటికే నోటిఫికేషన్ జారీచేసిన 1,147 పోస్టులతో కలిపి భర్తీ
- దీంతో మొత్తం 1,442 పోస్టులను భర్తీ చేయనున్న ప్రభుత్వం
- వైద్య, ఆరోగ్య సేవల నియామక సంస్థ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో కొత్తగా 295 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి వైద్య, ఆరోగ్య సేవల నియామక సంస్థ (ఎంహెచ్ఎస్ఆర్‌బీ) సభ్య కార్యదర్శి గోపికాంత్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. గత డిసెంబర్ ఆరో తేదీన 1,147 అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. ఆయా పోస్టులకు 2,900 మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతోంది. అనంతరం మెరిట్ జాబితా విడుదల చేసి నియామక ఉత్తర్వులు ఇస్తారు. ఈ నేపథ్యంలో తాజాగా వాటికి అదనంగా మరో 295 పోస్టులను కలుపుతారు. తాజాగా పోస్టుల అనుమతితో కలిపి మొత్తం 1,442 పోస్టులను భర్తీ చేసేందుకు బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. ఆయా ఉద్యోగస్తుల వేతన స్కేల్ రూ. 68,900 నుంచి రూ. 2,05,500గా ఖరారైంది. ప్రస్తుతం ప్రకటించిన పోస్టుల్లో 45 గైనకాలజీ, 33 జనరల్ మెడిసిన్, 32 జనరల్ సర్జరీ, 22 అనెస్థీషియా, 11 అనాటమీ, 11 బయో కెమిస్ట్రీ, 17 కమ్యూనిటీ మెడిసిన్ (ఎస్‌పీఎం), 10 ఆస్పత్రి అడ్మిన్, 11 మైక్రోబయోలజీ, 10 ఆర్థోపెడిక్స్, 17 పీడియాట్రిక్స్, 17 పాథాలజీ, 11 ఫిజియోలజీ, 10 రేడియో డయాగ్నొసిస్ తదితరాలు ఉన్నాయి. అన్ని పోస్టులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మహిళా అభ్యర్థులకు అన్ని కేటగిరీల్లో 33.3 శాతం చొప్పున రిజర్వేషన్ ఉంటుంది.

ఈపీఎస్ కింద ఇక అధిక పెన్షన్!

- ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ సన్నాహాలు
- సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ
- 'వేతనంలో 8.33 శాతం చెల్లింపు' సవరణ అమలు
- క్షేత్రస్థాయిలో అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు చర్యలు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల పెన్షన్ పథకం (ఈపీఎస్) కింద అధిక పెన్షన్ అమలుకు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఉపక్రమించింది. ఈపీఎఫ్ చందాదారులు పదవీ విరమణ తర్వాత ఇప్పటివరకు అత్యంత పరిమితంగానే నెలవారీ పెన్షన్ పొందుతున్నారు. తాజాగా ఉద్యోగి పదవీ విరమణ నాటికి ఉన్న వేతనంలో 8.33 శాతాన్ని పెన్షన్ రూపంలో చెల్లించేందుకు చేసిన సవరణ అమలు కానుంది. 2014 నాటి సవరణ ప్రకారం పెన్షన్ రూ.6,500 నుంచి రూ.15 వేల మధ్యలో పొందేందుకు అవకాశం కల్పించారు. అయితే ఈ పెంపును వేతన పరిమితి ఆధారంగా నిర్ణయించేలా గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు లోబడి వర్తింపజేసేందుకు ఈపీఎఫ్ఓ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే సోమవారం ఈపీఎఫ్ఓ జోనల్ కార్యాలయాల్లోని అదనపు చీఫ్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్లు, ఈపీఎఫ్ఓ ప్రాంతీయ కార్యాలయాల్లోని రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్లకు సర్క్యులర్ చేసింది.

సేవా విభాగం ఏర్పాటుకు ఆదేశం

ఉద్యోగులు, యాజమాన్యాలు ఉమ్మడి ఆప్షన్ దరఖాస్తును ఈపీఎఫ్ఓ క్షేత్ర కార్యాలయాలకు సమర్పించాలని సంస్థ ఆదేశించింది. ఉద్యోగుల అవగాహనకు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్లు ప్రకటనను నోటీసుబోర్డులో ఉంచాలని, అధిక పెన్షన్ కోసం సేవావిభాగాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ప్రతి జాయింట్ ఆప్షన్ అప్లికేషన్‌ను రిజిస్టర్ చేసి, డిజిటల్‌గా లాగ్‌ఇన్ చేసి, రసీదు సంఖ్యను ఉద్యోగికి అందించాలని సూచించింది. సీలింగ్ కన్నా ఎక్కువ వేతనమున్న ఉద్యోగులు అధిక పింఛన్ కోసం సమర్పించే దరఖాస్తును ప్రాంతీయ పీఎఫ్‌వో అధికారులు పరిశీలించి, నిర్ణయాన్ని పోస్టు ద్వారా, ఈమెయిల్, ఎస్ఎంఎస్ ద్వారా పంపాలి.

ప్రాంతీయ కమిషనర్లకు దరఖాస్తు చేసుకోవాలి

ఈపీఎస్ అధిక పెన్షన్‌కు అర్హులైన ఉద్యోగులంతా సంబంధిత ప్రాంతీయ కమిషనర్లకు దరఖాస్తు చేసుకోవాలి. జాయింట్ ఆప్షన్ దరఖాస్తు విధానం, వివరాలు, గడువు తేదీని సంబంధిత ఆర్‌పీఎఫ్‌సీ వెల్లడిస్తారు. అధిక పింఛనుకు ఉమ్మడి ఆప్షన్ ఇచ్చిన తరువాత ఉద్యోగుల భవిష్యనిధి నుంచి పింఛను నిధికి అవసరమైన నగదు సర్దుబాటు, అదనపు నిధి డిపాజిట్ విషయమై ఉమ్మడి ఆప్షన్ ఫారంలో ఉద్యోగి అంగీకారం కచ్చితంగా వెల్లడించాలి. అధిక పెన్షన్ అమలుపై యాజమాన్యాలకు అవగాహన కల్పించడం, సమస్యలను పరిష్కరించడం, సందేహాల నివృత్తిరి ఈపీఎఫ్‌వో కార్యాలయ అధికారులు అందుబాటులో ఉంటారు.

మోటార్లకు మీటర్లు పెడతామన్నది మీరే కదా?

కేసీఆర్‌పై ధ్వజమెత్తిన బండి సంజయ్



కమలాపూర్: 'బీజేపీని గెలిపిస్తే మోటార్లకు మీటర్లు పెడతారని అసత్య ప్రచారాలు చేస్తున్నారు. మేం ఎక్కడ కూడా అలా చెప్పలేదు. తెలంగాణలో మోటార్లకు మీటర్లు పెడతాం, మాకు లోన్ ఇవ్వండని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసిందా? రాయలేదా?'స్పష్టంగా చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వానికి సవాల్ విసిరారు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లోని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది క్రితం కేంద్ర ప్రభుత్వ నూతన పాలసీని తాను చదివి వినిపిస్తే ఇప్పటిదాకా మౌనంగా ఉండి, మళ్లీ ఇప్పుడు దాని గురించి దుష్ప్రచారం మొదలుపెట్టారన్నారు. కేసీఆర్ హామీ లపై చర్చకు రమ్మని అనేక సార్లు సవాల్ విసిరితే స్పందించలేదని, వాళ్లు చేసిన సవాల్‌ను తాము స్వీకరించినా స్పందించడంలేదని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ సింగరేణిని ప్రైవేటీకరిస్తారని అసత్య ప్రచారం చేస్తున్నారని, ఆ సంస్థలో రాష్ట్రానిది 50 శాతం, కేంద్రానికి 49 శాతం వాటాలున్నాయని, తక్కువ శాతం వాటా ఉన్నోళ్లకు ప్రైవేటీకరణ చేయడం సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నన్ని రోజులు బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ రాదన్నారు.

ఇంకా 2 నెలలు కావాలి!

- విచారణను వాయిదా వేయండి
- పోలవరం ముంపుపై సుప్రీంకోర్టుకు జలశక్తి శాఖ విజ్ఞప్తి
- సీఎంలతో భేటీ నిర్వహించాల్సి ఉంది
- ఆ తర్వాతే నివేదికకు తుది రూపు ఇస్తాం
- అందుకే కేసును వాయిదా వేయాలని వినతి
- ఈ నెల 15న సీఎంలతో సమావేశానికి జలశక్తి శాఖ ప్రతిపాదన
- సాధ్యం కాకపోవడంతో మరో కొత్త తేదీని ప్రకటించే అవకాశం
- ఉమ్మడి సర్వేకి ముందుకు రావాలని ఏపీని కోరిన పీపీఏ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు ముంపు సమస్య పరిష్కారం విషయంలో సుప్రీం కోర్టు సూచన మేరకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల సీఎంలతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ఆ శాఖ తాజాగా సుప్రీంకోర్టుకు నివేదించింది. ఇందుకు మరికొంత సమయం కావాలని, మంగళవారం సుప్రీంకోర్టులో జరగాల్సిన విచారణను రెండు నెలలకు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ అడ్వొకేట్ ఆన్ రికార్డ్ అరవింద్‌కుమార్ శర్మ ఇటీవల సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌కి లేఖ రాశారు.

→ పోలవరం ప్రాజెక్టుతో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో ముంపు ప్రభావం తీవ్రంగా ఉందని, నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ ఆయా రాష్ట్రాలు గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. పోలవరం ముంపు సాంకేతికపరమైన అంశం కావడంతో సంబంధిత రాష్ట్రాలతో సమావేశాలు నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని కేంద్ర జలశక్తి శాఖను ఆదేశిస్తూ గతేడాది నవంబర్ 6న సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా ఆయా రాష్ట్రాల సీఎంలతోఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించి విభేదాలను సైతం పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని సుప్రీం స్పష్టం చేసింది. ఈ మేరకు ఇప్పటికే నాలుగు రాష్ట్రాల అధికారులతో కేంద్ర జలశక్తి శాఖ, సీడబ్ల్యూసీలు మూడు విడతలుగా సమావేశాలు నిర్వహించి సాంకేతికపర అంశాలను ఓ కొలిక్కి తెచ్చాయి. సుప్రీంలో కేసు తదుపరి విచారణకు వచ్చే నాటికి సీఎంలతో కూడా సమావేశం నిర్వహించేందుకు కేంద్ర జలశక్తి శాఖ ప్రయత్నాలు చేస్తోంది.

15న సాధ్యం కాని సీఎంల సమావేశం...

వాస్తవానికి ఈ నెల 15న కేంద్ర జలశక్తి శాఖ మంత్రి అధ్యక్షతన ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహిస్తామని, రాగలరో లేదో తెలిపాలని ..పేర్కొంటూ ఆశాఖ ఈ నెల 8న ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల సీఎంలకు లేఖ పంపించింది. కొన్ని రాష్ట్రాల నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో 15న సమావేశం సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో మరో కొత్త తేదీని ప్రతిపాదిస్తూ ఆయా రాష్ట్రాలకు కేంద్ర జలశక్తి శాఖ మళ్లీ లేఖ రాయనుంది. సంబంధిత రాష్ట్రాల సీఎంలు సానుకూలంగా స్పందిస్తేనే ఈ సమావేశం సాధ్యమయ్యే అవకాశాలున్నాయి.

కొలిక్కి వచ్చిన సాంకేతిక అంశాలు..

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గతేడాది సెప్టెంబర్ 29న 4 రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులతో కేంద్ర జలశక్తి శాఖ తొలి సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు అక్టోబర్ 7న కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) మరో సమావేశాన్ని నిర్వహించి తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి సాంకేతిక అంశాలపై సంప్రదింపులు జరిపింది. ఆ తర్వాత సీడబ్ల్యూసీ సూచన మేరకు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలు తమ అభ్యంతరాలు, డిమాండ్లతో టెక్నికల్ నోట్స్‌ను సమర్పించగా, వీటిని పరిశీలించి సీడబ్ల్యూసీ వివరణలు పంపించింది. ఏపీ నుంచి సైతం వివరణలు తీసుకుంది. సీడబ్ల్యూసీ ఇచ్చిన వివరణలపై మళ్లీ మూడు రాష్ట్రాలు తమ అభిప్రాయాలను పంపించాయి. అన్ని రాష్ట్రాల అభిప్రాయాలపై పరిశీలన అనంతరం పోలవరం ముంపు ప్రభావానికి సంబంధించిన సాంకేతిక అంశాలను కొలిక్కి తెచ్చి ఓ నివేదికను సీడబ్ల్యూసీ సిద్ధం చేసింది. సీఎంలతో సమావేశం అనంతరం ఈ నివేదికకు తుది రూపు ఇచ్చి సుప్రీం కోర్టులో జరిగే తదుపరి విచారణలో సమర్పించనుంది.



ఉమ్మడి సర్వేకి ముందుకు రావాలి.. పీపీఏ లేఖ

గత నెల 25న నాలుగు రాష్ట్రాల అధికారులతో సీడబ్ల్యూసీ నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు తెలంగాణలో పోలవరం ముంపు ప్రభావంపై ఉమ్మడి సర్వేకి ముందుకు రావాలని సూచిస్తూ తాజాగా ఏపీకి పోలవరం ప్రాజెక్టు అథారిటీ లేఖ రాసింది. వానకాలం ప్రారంభానికి ముందే సర్వే నిర్వహించాలని తెలంగాణ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ ఈ మేరకు చర్యలు తీసుకుంది. ఉమ్మడి సర్వేలో తేలిన అంశాల ఆధారంగా ముంపు నివారణకు పోలవరం అథారిటీ/ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సమావేశం మినిట్స్‌లో సీడబ్ల్యూసీ పేర్కొంది.



ఒక మనిషి ఆత్మలోకి చూడాలనీ, ఆ మనిషిని తెలుసుకోవాలనీ అనుకుంటే– అతడు ఎలా నవ్వుతున్నాడో గమనించండి. అతడు మంచిగా నవ్వితే అతడు మంచి మనిషి.

– ఫ్యోదర్ దోస్తోవ్స్కీ

సాక్షి

మంగళవారం, ఫిబ్రవరి, 21

గుర్తింపుపై తొందరేల?!

ఆదమరిచివున్న ఉద్ధవ్ ఠాకరే నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) సర్కారును నిరుడు జూలై మొదటివారంలో పడగొట్టి ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించిన శివసేన చీలిక వర్గం నాయకుడు ఏక్నాథ్ శిందే చివరకు పార్టీని, విల్లు–బాణం చిహ్నాన్ని కూడా సొంతం చేసుకున్నారు. ఆయన వర్గమే అసలు సిసలు శివసేన అని ఎన్నికల సంఘం శనివారం ధ్రువీకరించి ఓ పని పూర్తిచేసింది. సర్కారు పతనమైనప్పుడు జరిగిన రాజకీయ పరిణామాలకు సంబంధించిన వివాదాన్ని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలా లేదా అనే అంశంలో సుప్రీంకోర్టులోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం విచారణ సాగిస్తుండగానే ఎన్నికల సంఘం నిర్ణయం వెలువడింది. దీంతో ముడిపడివున్న ఇతర అంశాలు సుప్రీంకోర్టు తేల్చవలసివున్నందున ఎన్నికల సంఘం నిర్ణయాన్ని వాయిదా వేయాలన్న ఉద్ధవ్ వర్గం వినతి వీగిపోయింది. పార్టీ ఎమ్మెల్యేలు 55 మందిలో 40 మంది...18 మంది ఎంపీల్లో 13 మంది శిందే వర్గంలో ఉన్నందువల్ల ఆ వర్గంవైపే మెజారిటీ ఓటర్లున్నట్టని ఎన్నికల సంఘం అభిప్రాయపడింది. ఉద్ధవ్ ఠాకరే వర్గం కోరినట్టు పార్టీ నియమావళి జోలికి పోనవసరం లేదని నిర్ణయించింది.

అసమ్మతిని సకాలంలో పసిగట్టలేకపోవటం, తిరుగుబాటు ఎమ్మెల్యేల మనోభావాలేమిటో, వారు కోరుకుంటున్నదేమిటో గుర్తించి ప్రభుత్వాన్ని కాపాడుకోలేకపోవటం ఉద్ధవ్ చేతకానితనమే. అయితే రాజకీయాలపై కనీస అవగాహన ఉన్నవారు సైతం ఎన్నికల సంఘం నిర్ణయంలోని మతలబును అర్థం చేసుకోలేరు. శివసేన అధినేత బాల్ ఠాకరే కన్నుమూశాక పార్టీ పగ్గాలు ఉద్ధవ్ చేతికొచ్చాయి. ఆయన నేతృత్వంలోనే 2019 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకుని శివసేన పోటీచేసింది. అనంతర పరిణామాలలో సీఎం పదవిని తొలి దఫాలో తమకు ఇవ్వటానికి నిరాకరించినందుకు ఎన్సీపీ, కాంగ్రెస్లతో చేతులు కలిపి ఎంవీఏ కూటమి సర్కారును ఏర్పాటుచేసింది. ఈ క్రమంలో ఎక్కడా ఏక్నాథ్ శిందే స్వరం వినబడింది లేదు. ఉద్ధవ్ ఆశీస్సులతో ఆయన మంత్రి అయ్యారు. ఇంత స్పష్టంగా కనబడుతుండగా కొంతమంది ఎమ్మెల్యేలనూ, ఎంపీలనూ కూడగట్టుకున్నంత మాత్రాన పార్టీ ఆయనకే దక్కడమేమిటి? అసెంబ్లీలో ఉండే బలాబలాలే ప్రభుత్వ భవితవ్యాన్ని నిర్ణయిస్తాయి. సంఖ్యాబలం ఎవరికి అధికంగా ఉంటే వారిదే ప్రభుత్వం అవుతుంది. అసలు ఎమ్మెల్యేలు ప్రలోభపడి తమ రాజకీయ అభిప్రాయాలనూ, విశ్వాసాన్నీ వీడినంత మాత్రాన ఓటర్లు సైతం ఆ బాటే పట్టారని నిర్ధారణకు రావటం ఏం సబబు? ఇంతక్రితం పార్టీ వేరు...లెజిస్లేచర్ పార్టీ వేరు అనే విభజన ఉండేది. లెజిస్లేచర్ పార్టీలో జరిగే పరిణామాల ప్రభావం పార్టీపై ఉండేది కాదు. 1995లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని హస్తగతం చేసుకున్న చంద్రబాబునాయుడు ఆ తర్వాత కూడా పార్టీనీ, పార్టీ గుర్తునూ కూడా కొల్లగొట్టారు. న్యాయస్థానాలు సైతం చంద్రబాబు నీతిమాలిన చర్యకు వత్తాసు పలకటం అప్పట్లో దేశవ్యాప్తంగా అందరినీ దిగ్భ్రాంతిపరిచింది. 60వ దశకంలో ఇందిరా గాంధీ హయాంలో కాంగ్రెస్లో చీలిక వచ్చినప్పుడు ఏ వర్గం అసలైందో తేల్చటానికి మూడు గీటురాళ్లు నిర్ధారించారు. ఆ మూడూ– పార్టీ నియమావళి ఏం చెబుతుందో చూడటం, పార్టీలో మెజారిటీ పక్షం ఎవరివైపుందో తెలుసు కోవటం, చట్టసభలో అధికసంఖ్యాకులు ఎవరివైపున్నారో నిర్ధారించుకోవటం. 1996లో బాల్ ఠాకరే నాయకత్వంలో పార్టీ ఆమోదించిన నియమావళిపై 1999లో ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేసిందని, కానీ ఉద్ధవ్ 2018లో ఆ నిబంధనలే తిరిగి తెచ్చారని ఎన్నికల సంఘం ఇప్పుడంటున్నది. కొద్దిమంది గుప్పెట్లో అధికారాన్ని కేంద్రీకృతం చేసే ఆ నిబంధనలు అప్రజాస్వామికమని చెబుతోంది. అయితే 2019 ఎన్నికలకు ముందుగానీ, ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పడ్డాకగానీ ఆ విషయంలో ఎన్నికల సంఘం ఎందుకు మౌనంగా ఉందో అర్థం కాదు.

శివసేనలో చీలిక వెనక కేంద్రంలోని ఎన్డీఏ కూటమి సర్కారుకు నాయకత్వంవహిస్తున్న బీజేపీ ఆశీస్సులున్నాయన్నది బహిరంగ రహస్యం. అసమ్మతి చిచ్చు రగిల్చినప్పుడే శిందే తన వర్గం ఎమ్మెల్యేల శిబిరంలో ఈ మాట చెప్పారు. ఇప్పుడు ఎన్నికల సంఘం నిర్ణయం వెలువడ్డాక కూడా ఆ మాటే మరోసారి అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన వెనక కొండలా నిలబడతానని భరోసా ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకున్నారని ఒక కార్యక్రమంలో చెప్పారు. తమనుంచి పార్టీనీ, గుర్తునూ కొల్లగొట్టేందుకు రూ. 2,000 కోట్ల ఒప్పందం జరిగిందన్న శివసేన ఉద్ధవ్ వర్గం నాయకుడు సంజయ్ రౌత్ చేసిన ప్రకటనకు పెద్దగా విలువనివ్వాల్సిన అవసరం లేదు. సాక్ష్యాధారాల్లేకుండా మాట్లాడితే ఎవరూ విశ్వసించరు. ఆ మాటెలావున్నా వివాదానికి సంబంధించిన అనేక అంశాలు సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నాయి గనుక అప్పటివరకూ ఎన్నికల సంఘం తన నిర్ణయాన్ని వాయిదా వేసివుంటే బాగుండేది. బృహన్ ముంబై కార్పొరేషన్ ఎన్నికలు ముంగిట్లో ఉన్నందున విల్లు–బాణం శిందేకు అప్పగించి ఆయనదే నిజమైన శివసేన అనే అభిప్రాయం కలిగించటానికి ఈసీ తహతహలాడిందని ఉద్ధవ్ వర్గం ఆరోపిస్తోంది. అందులో నిజానిజాల మాటెలా వున్నా ఇన్నేళ్ల అనుభవాల్లో ఫిరాయింపుల చట్టం ఎంత లోపభూయిష్టంగా ఉన్నదో తెలుస్తున్నది గనుక దాన్ని సవరించి మరింత సమగ్రమైన చట్టం తీసుకురావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.పాడ్యమి ఉ.11.24 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** శతభిషం ఉ.11.23 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** సా.5.25 నుండి 6.56 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.44 నుండి 9.33 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.44 వరకు, **అమృతఘడియలు:** రా.2.30 నుండి 4.01 వరకు.

సూర్యోదయం : 6.28
సూర్యాస్తమయం: 5.59
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

నివారించలేం, జననష్టం తగ్గించగలం

సుమారు 46,000 మందిని బలిగొన్న టర్కీ భూకంపంలో ఇంతటి భారీ ప్రాణనష్టాన్ని నివారించేందుకు అవకాశం ఉండిందా? దాదాపు టర్కీ మొత్తం భూకంప ప్రమాద పరిధిలోనే ఉన్నప్పటికీ, ప్రభుత్వంలోని విపరీతమైన అవినీతి ఫలితంగా భవన నిర్మాణ నియంత్రణలు అమల్లోకి రాలేదు. భవిష్యత్తులో వచ్చే భూకంపాలను సమర్థంగా ఎదుర్కొనేందుకని 'భూకంప పన్ను' కూడా వసూలు చేశారు. ఆ మొత్తాన్ని ఎలా ఖర్చు పెట్టారన్న విషయంలో అనేక ప్రశ్నలున్నాయి. ఈ మొత్తాన్నీ గమనిస్తే ఒక విషయం స్పష్టమవుతోంది. భూకంప ముప్పును ఎదుర్కొనే విషయంలో టర్కీ వద్ద ఉన్న జ్ఞానానికీ, ఆచరణకూ మధ్య అంతరం ఉంది.



''ఇలాంటి విధ్వంసానికి సన్నద్ధంగా ఉండటం అసంభవం.'' ఫిబ్రవరి ఆరున టర్కీని భారీ భూకంపం తాకిన రెండు రోజులకు అత్యంత దారుణంగా దెబ్బతిన్న ప్రాంతంలో పర్యటించిన తర్వాత ఆ దేశ అధ్యక్షుడు రిజెప్ తాయిప్ ఎర్దోగాన్ చేసిన వ్యాఖ్య ఇది. నిజంగానే ఇంతటి విధ్వంసపు స్థాయి ఇంతకుముందు చూడనిదే. తెలతెల వారుతూండగానే 7.8 తీవ్రతతో భూకంపం రావడం, వేల మందిని బలితీసుకోవడం ఘోరమే. (సుమారు 46,000 మంది చనిపోయారని అంచనా.) అత్యంత హృదయ విదారకమైన ప్రకృతి వైపరీత్యాల్లో ఇదీ ఒకటి. అయితే, ఇంతటి ప్రాణనష్టాన్ని, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అవకాశం ఉండిందా? పూర్తిగా కాకపోయినా పాక్షికంగానైనా తగ్గించే వీలు లేకపోయిందా? అసాధ్యమని ఎవరైనా చెబితే అది రాజకీయ ప్రకటనే అవుతుంది. టర్కీకి భూకంపం ముప్పు ఉందని తెలిసినా అందుకు సన్నద్ధంగా లేకపోవడం కచ్చితంగా ఓ వైరుధ్యమే.

చేజారిన అవకాశాలు

భూకంప ముప్పునకు సంబంధించి టర్కీ ఒక మ్యాపును రూపొందించింది. 2018 లోనే దీన్ని సమీక్షించి, మార్పులు చేర్పులు చేసి ప్రచురించారు కూడా. దాని ప్రకారం దాదాపు దేశం మొత్తానికి భూకంప ప్రమాదం ఉంది. తూర్పు అనతోలియా ఫాల్ట్ జోన్, ఉత్తర అనతోలియా ఫాల్ట్ జోన్ రెండూ దేశాన్ని అల్లుకుని ఉన్నాయి! దాదాపు 1,400 కిలోమీటర్ల పొడవైన ఉత్తర అనతోలియా ఫాల్ట్ జోన్ టర్కీ ఉత్తరార్ధ భాగంలో తూర్పు నుంచి పశ్చిమానికి ఉంది. దేశంలోని ప్రధాన నగరాలైన అంకారా, ఇస్తాంబుల్తో పాటు, పారిశ్రామిక వాడలు కూడా ఈ ఫాల్ట్ జోన్ వెంబడే ఉన్నాయి. మరోవైపు తూర్పు అనతోలియా ఫాల్ట్ జోన్ వెయ్యి కిలోమీటర్ల పొడవుతో దేశ ఆగ్నేయ ప్రాంతం గుండా ప్రయాణిస్తూంటుంది. లక్షల జనాభా ఉన్న చిన్న చిన్న నగరాలు, పల్లెలు ఈ జోన్లోనే ఉన్నాయి. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు టర్కీ ఇప్పటికి చాలా ప్రయత్నాలే చేసింది. 1959లో ఆ దేశ పార్లమెంటు 'డిజాస్టర్ లా 7269'(విపత్తు చట్టం)ను ఆమోదించింది. ప్రకృతి వైపరీత్యాల నష్టాన్ని నివారించేందుకు ప్రణాళికలను రూపొందించాలనీ, జాతీయ స్థాయి నుంచి మున్సిపాలిటీల వరకూ నియమ, నిబంధనలు సిద్ధం చేయాలనీ తీర్మానించారు. ఈ ఏర్పాట్లన్నీ ప్రజల్లో భూకంప విపత్తుపై కొంత అవగాహనైతే పెంచాయి కానీ, 1990లలో గణనీయమైన స్థాయిలో ఉన్న ఐదు భూకంపాలు చోటు చేసుకున్నా మార్పులేమీ కనబడకపోవడంతో ఆ చట్టంపై ఆశలు సన్నగిల్లాయి.

1999లో మార్మరా ప్రాంతంలో వచ్చిన భూకంపాల్లో సుమారు 17 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తరువాత టర్కీ ప్రభుత్వం భూకంపాలను తట్టుకునే భవనాల నిర్మాణానికి, ప్రోత్సాహానికి ఒక కార్యక్రమం చేపట్టింది. అయినాసరే, ప్రభుత్వంలోని విపరీతమైన అవినీతి ఫలితంగా ఈ భవన నిర్మాణ నియంత్రణలు అమల్లోకి రాలేదు. భవిష్యత్తులో భూకంపాలు వస్తే వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకని ప్రభుత్వం 'భూకంప పన్ను' పేరుతో పన్నులు వసూలు చేసింది కూడా. దీనిద్వారా సుమారు 460 కోట్ల అమెరికన్ డాలర్ల మొత్తం జమకూడింది. అయితే ఈ మొత్తాన్ని ఎలా ఖర్చు పెట్టారన్న విషయంలో అనేక ప్రశ్నలు తలెత్తాయి.

2009లో టర్కీ 'నేషనల్ డిజాస్టర్ అండ్ ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ అథారిటీ' (జాతీయ విపత్తు మరియు అత్యవసర పరిస్థితి నిర్వహణ సంస్థ) ఒకదాన్ని ఏర్పాటు చేసింది. విపత్తు నిర్వహణకు సిబ్బందిని సిద్ధం చేయడం, తద్వారా ప్రమాద నష్టాన్ని తగ్గించడం దీని ఉద్దేశం. రాష్ట్ర, మున్సిపాలిటీ స్థాయిల్లో సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, భూకంపాలు వచ్చినప్పుడు ఎలా వ్యవహరించాలో ప్రజలకు వివరించడం దీని పని. 2014లోనూ టర్కీ నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ప్లాన్ (జాతీయ విపత్తు సంసిద్ధతా పథకం) ఒకదాన్ని సిద్ధం చేసింది. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభుత్వ సంస్థలు ఎలాంటి పాత్ర పోషించాలో సూచించిందీ పథకం. పోషకాహారం, అత్యవసర గృహ వసతి, సమాచార వ్యవస్థలు.. ఇలా వేర్వేరు బృందాలను ఏర్పాటు చేసి వాటికి నిర్దిష్ట బాధ్యతలు అప్పగించారు.

2014లోనే సోమా ప్రాంతంలో భూగర్భ గనిలో ఓ అగ్ని ప్రమాదం చోటు చేసుకుని 301 మంది మరణించారు. ఈ ఘటనపై సమీక్షించిన టర్కీ ప్రభుత్వం జాతీయ విపత్తు పథక పునఃసమీక్షకు నిర్ణయించింది. జపాన్, అమెరికా, యూరప్ ప్రతినిధులతో కూడిన సలహా కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సూచించిన మార్పులను జాతీయ విపత్తు పథకంలో చేర్చారు. నిరంతర నిఘా, విపత్తు నిర్వహణ సిబ్బందికి మరింత ఆధునికమైన శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవడం, సంస్థల మధ్య సమన్వయం వంటి మార్పులు చేశారు. అయితే ఈ ప్రణాళికలను 2015 జనవరి నుంచే సైద్ధాంతికంగా అమల్లో పెడుతున్నట్లు నేతలు ప్రకటించారు కానీ, వాస్తవ ఆచరణ ఇప్పటికీ జరగలేదు. నేషనల్ డిజాస్టర్ అండ్ ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ అథారిటీ నాయకత్వాన్ని మార్చడంతో సరిపెట్టింది ప్రభుత్వం. పైగా మంచి శిక్షణ, ఆధునిక సమాచార వ్యవస్థలు కావాలని కోరిన వారిని పదవుల నుంచి తప్పించింది. ఈ మార్పులు స్థానిక ప్రభుత్వాలపై తీవ్ర ప్రభావం చూపాయి.

జపాన్, కాలిఫోర్నియా పాఠాలు...

మార్పులు చేసిన నేషనల్ డిజాస్టర్ ప్లాన్ అమలు చేయకపోవడం ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. భూకంప ముప్పును ఎదుర్కొనే విషయంలో టర్కీ వద్ద ఉన్న జ్ఞానానికీ, ఆచరణకూ మధ్య అంతరం ఉంది. భూకంపాలను ఎలాగూ ఆపలేము. కానీ వాటిని తట్టుకోగల భవనాలను నిర్మించవచ్చు. జపాన్, కాలిఫోర్నియాల్లో ఇదే జరిగింది. భూకంపాలను తట్టుకోగల భవనాలకు సంబంధించిన నియమావళిని టర్కీ రూపొందించింది. దేశంలో 1.50 లక్షల మంది సివిల్ ఇంజినీర్లు ఉన్నారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేలా రోడ్లు, భవనాలు, వంతెనలు ఎలా కట్టాలో వీరికి తెలుసు. అయితే ఇప్పటికే ఉన్న భవనాలను కొత్త ప్రమాణాల ప్రకారం కట్టేందుకు అయ్యే ఖర్చు చాలా ఎక్కువ కావడంతో ఆ కార్యక్రమం చాలా నెమ్మదిగా సాగుతోంది. భవనాల డిజైన్ నియంత్రణలు 2000 సంవత్సరం నుంచే అమల్లో ఉన్నా, వాటి అత్యాధునిక అవసరాలను స్థానిక ఇంజినీర్లు పెద్దగా అర్థం చేసుకోలేకపోయారు. భవన నిర్మాణాన్ని పర్యవేక్షించేందుకూ 2010 నుంచి ఒక కమిటీ ఉంది కానీ దేశంలోని కోటీ అరవై లక్షల భవనాలను పర్యవేక్షించలేకపోతోంది.

భవిష్యత్తు దశ, దిశ

2023 ఫిబ్రవరి ఆరున సంభవించిన భారీ భూకంపంతో టర్కీ పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. స్వల్పకాలికం మాత్రమే కాదు, సుదీర్ఘకాలం పనిచేయగల ప్రణాళికలు అత్యవసరంగా అమలు చేయాల్సిన పరిస్థితిని ఆ దేశం ఎదుర్కొంటోంది. గృహ నిర్మాణాన్ని ఇప్పటిలానే లోపాలతో కొనసాగించడమా, వ్యయప్రయాసలకు ఓర్చి అత్యాధునిక, దృఢమైన, మెరుగైన డిజైన్ కలిగిన భవన నిర్మాణాలను చేపట్టడమా అన్నది నిర్ణయించుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. ఈ కార్యక్రమంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయడం ద్వారా భూకంపాలతో వచ్చే ముప్పును గుర్తించే సమాజాన్ని సిద్ధం చేయాలి. అంతే కాకుండా తగిన ప్రణాళిక, ఆచరణలతో నష్టాన్ని తగ్గించవచ్చునన్న తెలివిడి కూడా వీరికి కలిగించాల్సిన అవసరం ఉంది.

– లూయిస్ కె. కంఫర్ట్, ప్రొఫెసర్, పిట్స్బర్గ్ యూనివర్సిటీ
– పోలాత్ గుల్కన్, ప్రొఫెసర్, బాష్కెంట్ యూనివర్సిటీ
– బుర్చాక్ బాష్బూ ఎర్కాన్
అసోసియేట్ ప్రొఫెసర్, మిడిల్ ఈస్ట్ టెక్నికల్ యూనివర్సిటీ
('ద కాన్వర్సేషన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్సైట్లు ఫేస్బుక్, ట్విట్టర్లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

గట్టి వ్యతిరేకత



క్యూబా, వెనిజులా కన్నా అత్యంత సామ్రాజ్యవాద వ్యతిరేక దేశాలు– ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్, ఇస్లామిక్ ఎమిరేట్ ఆఫ్ అఫ్గానిస్తాన్.

– సమీరా ఖాన్, 'యాంటీ–వోక్' జర్నలిస్ట్

కష్టం చూల్లేదు



మూడేళ్లు ఇండియాలో నివసించిన తర్వాత, నేను గట్టిగా చెప్పగలిగింది ఏమంటే – చాలామంది అమెరికన్లకు కష్టపడి పనిచేయడం అంటే ఏమిటో తెలీదు.

– అమృత్ సింగ్, యూఎస్ ఆంట్రప్రెన్యూర్

తమదాకా వస్తే...



ఎవరైనా అక్రమంగా తుపాకీని కలిగివుంటే పాకిస్తాన్లో వాళ్లను తీవ్రవాదులు అంటారు, అదే వ్యక్తి నియంత్రణ రేఖను దాటి ఇండియాకు వస్తే 'ముజాహిద్' అవుతాడు. రాళ్లు విసిరేవాళ్లు పాకిస్తాన్లో తుంటరి మూక అవుతారు, కానీ జమ్ము కశ్మీర్లో అమాయకుడు అవుతాడు. తుపాకీ వాడటం అనేది జమ్ము కశ్మీర్లో ప్రతిఘటన అవుతుంది, అదే పాకిస్తాన్లో అయితే తీవ్రవాదం అవుతుంది.

– సాజిద్ యూసుఫ్ షా, కశ్మీర్ న్యాయవాది

హృదయంలో భారత్



నా పాస్పోర్టు నేను యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా దాన్నని చెబుతుంది. కానీ నా హృదయం మేడ్ ఇన్ ఇండియా అంటుంది. ఇండియా నిజంగా ప్రపంచంలోని అత్యంత గొప్ప దేశాల్లో ఒకటి. నా జీవితాన్ని మార్చినందుకు నేను ఈ దేశానికి ఎన్ని కృతజ్ఞతలు చెప్పినా తక్కువే.

– రెనీ లిన్, కాలమిస్ట్

భరించలేని పథకం



ప్రభుత్వంలో పని చేయడం అనేది ఎవరూ దేశానికి ఉపకారం చేస్తున్నట్టు కాదు. మీకు ప్రభుత్వోద్యోగపు షరతులు నచ్చకపోతే (ఉదాహరణకు కొత్త పింఛన్ పథకం) దయచేసి దాన్ని వదిలేసి, మరింత మెరుగైన ఉద్యోగం చూసుకోండి. పాత పింఛన్ పథకం అనే పరాన్న భోజనాన్ని ఇండియా భరించలేదు.

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

ఎందుకింత సంక్లిష్టత?



ప్రియమైన రెస్టారెంట్ ఓనర్లు – మీరు బయట తినడం అనే అనుభవాన్ని ఈ క్యూఆర్ కోడ్లతో బరువుగా మార్చేస్తున్నారు. బహుశా ఇలాంటివి జనరేషన్ జెడ్ కోసం ఉద్దేశించినవి. ఇతరుల సంగతేమిటి? అసలు బయట తినడం అనే ఆలోచనే ఈ ఫోన్ వైపు చూడకుండా ఉండే సౌకర్యం కోసం. నా ఫోన్తో పని పడేట్టయితే, నేను స్విగ్గీ వాడుకుంటాను కదా!

– మాహ్రుఖ్ ఇనాయత్, సంపాదకురాలు

నాసిరకం మనుషులు



ఒక ఎమ్మెల్యే కొడుకు, ఇంకా అతడి పెద్ద గ్యాంగు ఒక ఖరీదైన రెస్టారెంటులో భోంచేసి బిల్లు చెల్లించకపోవడం చూశాను. బిల్లు చెల్లించడానికి వాళ్ల దగ్గర డబ్బు లేక కాదు, ఆ సంస్కృతి లేక. ఎన్నికలు వస్తున్నాయి, కచ్చితంగా వాళ్లు అన్నింటికీ కలిపి తగిన మూల్యం చెల్లిస్తారు.

– శిశిర, వ్యాఖ్యాత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇనాం భూములను ఎలా చూడాలి?

అభిప్రాయం



వి. బాలరాజు

ఇనాం భూములపై ఇటీవల తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానం వెలువరించిన తీర్పు కొందరిని సందిగ్ధావస్థలోకి నెడుతోంది. ఇప్పటి వరకు ఇనాంభూములను కొనుగోలు చేసి ఆక్రమణ హక్కుల పత్రం పొంది... ఓఆర్సీ సర్టిఫికెట్ను, రైతు వారీ పట్టా పొందిన వారి పేర్లు రెవిన్యూ రికార్డులలో నమోదు అయ్యి ఉన్నాయి. ఇప్పుడు ఈ తీర్పుతో వారు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

నమ్మకమైన సేవకులకూ, సైనికులకూ, కవులకూ, కళాకారులకూ కొన్ని వందల ఎకరాలు రాజరిక కాలంలో రాజు ఇచ్చేవాడు. అలాగే దేవాలయాల, మసీదుల నిర్వహణకూ; కొన్ని ధార్మిక సంస్థలకు కూడా భూములు ఇచ్చేవారు. గ్రామాలలో చేతి వృత్తులు చేసుకునే వారికి కూడా వేల ఎకరాలు దానంగా ఇచ్చారు.

ఇనాములుగా పొందిన భూములను కౌలుకు ఇచ్చారు. కొందరు స్వయంగా సాగు చేసుకున్నారు. ఇనాం భూములను సాగు చేస్తున్న వారు భూయజమానికి కొంత పన్ను చెల్లించే వారు, కొంత మంది రైతుల దగ్గర వసూలు చేసిన పన్నులు ప్రభుత్వాలకు చెల్లించేవారు కాదు. ఈ విషయాన్ని గ్రహించిన బ్రిటిష్ ప్రభుత్వం ఇనాందారీ వ్యవస్థను రద్దు చేసింది. నిజాం పాలన తదనంతరం మన ఉమ్మడి రాష్ట్రంలో ఈ ఇనాములకు 'ఏపీ ఏరియా ఇనాంల రద్దు చట్టం 1955' తెచ్చారు. కానీ 1985లో అన్ని రకాల ఇనాములను రద్దు చేశారు. తెలంగాణ ఏర్పడ్డాక, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన రాష్ట్రానికి అన్వయించుకొని 'తెలంగాణ ఇనాం రద్దు చట్టం 1955'గా నామకరణం చేసింది.

ఇనాందారులకు, కౌలుదారులకు ఉన్న సంబంధం పూర్తిగా రద్దు అయినందున, తన ఆక్రమణలో ఉన్నవారు రక్షిత కౌలుదారులైతే తెలంగాణలో భూ గరిష్ఠ పరిమితికి లోబడి, టెనెన్సీ చట్టం ద్వారా కొంతమందికి 38ఈ సర్టిఫికేట్లు జారీ చేశారు. ఒక సారి దేవాలయ భూములు అని రెవెన్యూ రికార్డులలో నమోదు అయినాక అవి ఎప్పటికీ దేవుని భూములే, వాటిపై ఏ రకమైన లావాదేవీలు చెల్లవు.

సేవలకు గాను ఇనాములుగా పొందిన భూములు ఉభయ రాష్ట్రాలలో కలిపి కొన్ని లక్షల ఎకరాలు ఉన్నాయి. వీటిని కొందరు ఇతరులకు అమ్ముకున్నారు. కొన్ని సార్లు ఒక తెల్ల కాగితంపై రాసుకుని, ఖబ్జాలోకి వెళ్ళి సాగు చేసుకుంటు న్నారు. ఇటువంటివారు తాము సాగు చేస్తున్న భూమిని సొంత భూమిగానే భావిస్తూ వ్యవసాయం చేసుకుంటున్నారు. భూముల విలు వలు పెరిగే కొద్ది కొన్నవారికి సమస్యలు మొదలయ్యాయి. భూమి అమ్మిన వారు తక్కువ ధరకు అమ్మామనీ, తమ తల్లిదండ్రులు తెలియక అమ్మారనీ, డబ్బులు తిరిగి ఇస్తాం, మా ఇనాం భూమి మాకు ఇచ్చేయమనీ పేచీలు పెట్టసాగారు. దీంతో కొనుగోలు చేసిన వారు సంబంధిత అధికారి దగ్గర పట్టా చేయించుకోవడం కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఆ భూములకు సంబంధించి సేత్వార్, ఖాస్రా, కొన్ని పహాణి కాపీలు, నక్షాతో పాటు 11.1.1973 (క్రూసియల్ డేట్) నిర్ధారణ తేదీ నాటికి తను సాగులో ఉన్నదీ, లేనిదీ విచారించి రిపోర్టు తయారు చేశారు తహసీల్దారులు. రిపోర్టు ఆధారంగా అమ్మిన వ్యక్తినీ, కొనుగోలు చేసిన వ్యక్తినీ పిలిపించి తన ముందు అమ్మకందారు నుంచి రాత పూర్వక హామీని తీసుకుని, అభ్యంతరాలు లేని పక్షంలో, ఎక్కడ కూడా ఇనాంల రద్దు చట్టాన్ని అతిక్రమించకుండా కొనుగోలుదారుకు తెలంగాణలో ఓఆర్సీ (ఆక్యుపెన్సీ రైట్సు సర్టిఫి కేటు) జారీ చేశారు. ఆదే ఆంధ్రప్రదేశ్లో అయితే రైత్వారీ పట్టా ఇవ్వటం జరిగింది.



ఇలా తెలంగాణలో ఎనిమిది లక్షల ఎకరాలకుగాను, ఆరు లక్షలకు పైచిలుకు ఎకరాలకు అన్ని ధృవీకరణ పత్రాలు వచ్చాయి. మిగిలినవి ఒక్కో స్థాయిలో పెండింగులో ఉండిపోయాయి. తొంబై శాతం భూముల వరకు అన్ని రకాల లావాదేవీలు జరిగి కొనుగోలు చేసిన వారు ఇత రులకు అమ్మారు కూడా, ఇలా రెండు మూడు చేతులు కూడా మారాయి. హైదరా బాద్, రంగారెడ్డి, వరంగల్, నిజామాబాద్ జిల్లా చుట్టు ప్రక్కల ఉన్న అన్నింటికీ ఓఆర్సీలు వచ్చాయి, చాలా చోట్ల రియల్ ఎస్టేట్స్ వచ్చాయి. ఇక అయిదు నుండి పది శాతం మిగిలిన భూములకు గాను తెలంగాణ అత్యు న్నత న్యాయస్థానం తీర్పు మేరకు ఇనాందారుకు నిజమైన వారసులు మాత్రమే ఓఆర్సీకి దరఖాస్తు చేసుకోవడానికి హక్కులు ఇవ్వటం జరిగింది. ఎట్టి పరిస్థితులలో కొనుగోలు చేసిన వ్యక్తికి టైటిల్ ట్రాన్స్ఫర్ చేయకూడదు.

గతంలో ఇచ్చిన కోర్టు తీర్పులన్నీ కొనుగోలుదారుకు పట్టా సర్టిఫికెట్ ఇవ్వటం సమంజసమే అని చెప్పాయి. ప్రస్తుతం ఇచ్చిన తీర్పులో ఇనాందారుల వారసులు మాత్రమే అర్హులు అని చెప్పింది, వీరు ఓఆర్సీకి అప్లికేషన్ పెట్టుకోవచ్చు అనింది. దీనితో ఇరవై, ముప్పై ఏండ్ల కింద భూములను కొని వ్యవసాయం చేసుకుంటున్న వారు సందిగ్ధంలో పడి ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా, ఇదివరకే జరిగిపోయిన లావాదేవీల ప్రస్తావనలకు ఒక స్పష్టత ఇవ్వడం జరగ లేదు. ఎన్నో రకాల ఇనాం భూములకు సంబంధించిన సంక్లిష్టతలను పరిగణనలోకి తీసుకుని ఉంటే ఈ భయాలకు, సందిగ్ధతకు కొంత ఉపశమనం ఉండేది.

వ్యాసకర్త రిటైర్డ్ తహసీల్దారు । 94409 39160

భక్తిశ్రద్ధల బుధవారం

భస్మ బుధవారం క్రైస్తవులకు పవిత్రమైన రోజు. వీరు ఆచరించే 'లెంట్' కాలం భస్మ బుధవారంతో మొదలవుతుంది. ఈస్టర్కు ముందున్న నలభై ఆరు దినాలలో ఆదివారాలు మినహాయించగా మిగిలిన నలబది దినాలను 'లెంట్ దినాలు' అంటారు. లెంట్ అనగా లేచుట, చిగుర్చుట అని అర్థం. ఆంగ్లోశాక్సన్ పదం లెంక్టన్ నుండి లెంట్ అనే పదం వచ్చింది. లెంట్ దినాలను శ్రమల దినాలనీ, ఉపవాస దినాలనీ కూడా పిలుస్తారు. భస్మ బుధవారాన్ని లెంట్ బుధవారం అని కూడా కొందరు అంటారు.

భస్మ బుధవారం తేదీలు ప్రతి సంవత్సరం మారుతూ ఉంటాయి. సాధారణంగా ఫిబ్రవరి నాల్గవ తేదీ నుండి మార్చి పది మధ్య ఎప్పుడైనా భస్మ బుధవారం రావచ్చు. ఈ సంవత్సరం అనగా 2023లో భస్మ బుధవారం ఫిబ్రవరి ఇరవై రెండున వచ్చింది. 2024లో ఇది ఫిబ్రవరి 14న వాలెంటైన్ రోజున వస్తుంది. ఈ విధంగా తేదీలు మారడానికి గల కారణం దీనిని చాంద్రమానం ప్రకారం నిర్ణయించడమే. ఉత్తరాయణ సూర్యుడు భూమధ్య రేఖను దాటే సమయంలో మొదటి పౌర్ణమి తరువాత వచ్చే ఆదివారాన్ని ఈస్టర్గా నిర్ణయిస్తారు. ఈస్టర్కు ముందున్న ఏడవ బుధవారాన్ని భస్మ బుధవారం అని పిలుస్తారు. క్రీ.శ. 325లో నైసియా కౌన్సిల్ భస్మ బుధవారం తేదీలను పైవిధంగా నిర్ణయించాలని సూచించింది.

భస్మ బుధవారం పేరు ఎలా వచ్చిందో చూద్దాం. గత సంవత్సరం మట్టలాదివారం (పామ్ సండే) రోజు వినియోగించిన ఖర్జూర మట్టలను దాచి, ఎండబెట్టి కాల్చగా వచ్చిన బూడిదను యాజకులు భద్రపరుస్తారు. ఈ బూడిదను ఎంతో పవిత్రంగా భావిస్తారు. దీనిని క్రైస్తవ యాజకులు తమ నొసట రుద్దుకొంటారు. తమ ఎదుట మోకరిల్లిన భక్తులకు వారి నుదుట అద్దుతారు. 'నీవు మట్టిలో నుండి వచ్చావు తిరిగి మట్టిలోనే కలిసిపోతావు గుర్తుంచుకో' అనే హెచ్చరిక అందులో ఇమిడి ఉంది. భక్తులలో ఒక ఆధ్యాత్మిక చింతన ఆరంభమవుతుంది. అంతే కాక ఈ బూడిద తగ్గింపు స్వభావానికీ, పశ్చాత్తాపానికీ, దుఃఖానికీ , నిరసనకూ సాదృశ్యంగా ఉంటుంది.

బైబిల్లో బూడిద ప్రస్తావన అనేకసార్లు రావడం గమనార్హం. 'బూడిదలో పడి పశ్చాతపపడుతున్నాను' అని యోబు భక్తుడు అన్నాడు. 'ఆ సంగతి నీనెవే రాజుకు వినపడినప్పుడు బూడిదలో కూర్చుండెను' అని రాజు తగ్గింపునకు క్షమాపణకు గుర్తుగా ఆ వాక్యం బైబిల్లో రాయబడింది. 'మొర్దెకై బూడిద పోసికొని రాజు గుమ్మము నొద్దకు వచ్చెను' అను వాక్యం తన బాధనూ, నిరసననూ మొర్దెకై తెలియజేసే సమయంలో రాయబడింది. ఇలాంటి సందర్భాలు బైబిల్లో కోకొల్లలు. భస్మ బుధవారం రోజును క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ విధంగా నలభైరోజులు ఉపవాస దినాలను క్రైస్తవులు పాటించి తమ జీవితాలను క్రమబద్ధీకరించుకుంటారు.

– పులుకూరి లాబాను ప్రభుదాసు, కావలి
(రేపు భస్మ బుధవారం)

నేటి నుంచి యాదాద్రి బ్రహ్మోత్సవాలు

- ఉదయం విశ్వక్సేన ఆరాధనతో శ్రీకారం
- మార్చి 3న పరిసమాప్తం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

సాక్షి, యాదాద్రి, యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రధానాలయంలో విశ్వక్సేన ఆరాధనతో ఆచార్యులు బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రధానాలయం పునర్నిర్మాణంలో భాగంగా ఆరు సంవత్సరాల పాటు బాలాలయంలోనే బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఉద్ఘాటన తర్వాత తొలి బ్రహ్మోత్సవాలు కావడంతో కొండపై శ్రీస్వామి సన్నిధిలో వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం నుంచి మార్చి 3వ తేదీ వరకు 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలిరానున్నారు. విదేశీ భక్తులు సైతం వచ్చే అవకాశం ఉంది.

ఆర్జిత సేవలు రద్దు: బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం నుంచి మార్చి 3వ తేదీ వరకు ఆర్జిత సేవలను రద్దు చేశారు. ఆలయంలో నిర్వహించే నిత్యకల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, బాలభోగం, అభిషేకం, అర్చనలను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.

రూ.1.50 కోట్ల బడ్జెట్

ప్రధానాలయం ఉద్ఘాటన అనంతరం జరుగుతున్న తొలి బ్రహ్మోత్సవాలు కావడంతో వైభవంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.రూ.1.50 కోట్ల బడ్జెట్ కేటాయించారు.

ఉత్తర మాడ వీధిలో కల్యాణం

28వ తేదీన శ్రీస్వామి, అమ్మవారి తిరు కల్యాణాన్ని ప్రధానాలయం ఉత్తర మాడ వీధిలో నిర్వహించనున్నట్లు అధికారులు ఆహ్వానపత్రికలో పేర్కొన్నారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.3,000 చెల్లించి శ్రీస్వామి వారి ఆశీస్సులు పొందాలని సూచించారు. 10 వేల మంది కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఇదీ షెడ్యూల్..

- 21వ తేదీ ఉదయం 10 గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తీవాచనం, రక్షాబంధనం, సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురారోపణం.
- 22న ఉదయం 8 గంటలకు అగ్నిప్రతిష్ఠ, 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6.30 గంటలకు భేరీపూజ, దేవతాహ్వానం, హవనం.
- 23న ఉదయం అలంకార, వాహన సేవలకు శ్రీకారం. 9 గంటలకు మత్స్యావతార సేవ, వేదపారాయణం, రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ.
- 24న ఉదయం 9 గంటలకు వటపత్రశాయి, రాత్రి 7గంటలకు హంస వాహన సేవలు.
- 25న ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణాలంకారం (మురళీ కృష్ణుడి) సేవ, రాత్రి 7 గంటలకు పొన్నవాహన సేవ.
- 26న ఉదయం 9 గంటలకు గోవర్ధనగిరిధారి, రాత్రి 7 గంటలకు సింహవాహన సేవలు.
- 27న ఉదయం 9 గంటలకు జగన్మోహిని, రాత్రి 7 గంటలకు అశ్వవాహన సేవలు, అనంతరం శ్రీస్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం.
- 28న ఉదయం 9 గంటలకు శ్రీరామ అలంకార (హనుమంత వాహనం) సేవ, రాత్రి 8 గంటల నుంచి గజవాహన సేవ, శ్రీస్వామి అమ్మవార్ల తిరు కల్యాణోత్సవం
- మార్చి 1న ఉదయం 9 గంటలకు మహా విష్ణు అలంకార గరుడ వాహన సేవ, రాత్రి 7 గంటల నుంచి దివ్య విమాన రథోత్సవం.
- 2వ తేదీ ఉదయం 10.30 గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం 6 గంటలకు శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవం.
- 3వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీస్వామి వారికి అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి 9గంటలకు శ్రీస్వామి వారి శృంగార డోలోత్సవంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

ఉట్నూర్ ఐటీడీఏకి 'తుడుందెబ్బ'

ఎస్టీల్లో 11 కులాల చేర్పుపై ఆదివాసీల ఆగ్రహం ● పోలీసులు ఆందోళనను అడ్డుకోవడంతో రాళ్లదాడి


ఐటీడీఏ ప్రధాన కార్యాలయంలోకి చొచ్చుకెళ్తున్న ఆదివాసీలు

- కార్యాలయం కిటికీ, ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ వాహన అద్దాలు ధ్వంసం
- ప్రగతి భవన్‌ను ముట్టడిస్తాం: రాష్ట్ర అధ్యక్షుడు బుర్సా పోచయ్య

సాక్షి,ఆదిలాబాద్: ఎస్టీల్లో నుంచి లంబాడాలను తొలగించాలని ఇప్పటివరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించిన ఆదివాసీలు తాజాగా ప్రభుత్వం వివిధ కులాలను ఎస్టీల్లో చేర్చడంపై ఆగ్రహావేశాలతో ఆందోళన ఉధృతం చేశారు. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో వాల్మీకిబోయ, ఖైతి లంబాడాతో పాటు మొత్తంగా 11 కులాలను షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) జాబితాలో చేరుస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టడాన్ని ఆదివాసీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏను ముట్టడించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ముందుగా నిర్ణయించింది. రాష్ట్ర అధ్యక్షుడు బుర్సా పోచయ్య ఆధ్వర్యంలో సోమవారం ఆదివాసీలు మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఆ తర్వాత కార్యాలయంలోనికి చొచ్చుకెళ్లేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. సమీపంలో ఏర్పాటుచేసిన బారికేడ్లను తోసేసి ఆదివాసీలులోనికి దూసుకెళ్లారు. కార్యాలయం పైకి ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. దీంతో కిటికీ అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఆవరణలో ఉన్న ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ వాహన అద్దాలను ధ్వంసం చేశారు.

అదనపు బలగాలతో చేరుకున్న ఎస్పీ

పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్పీ డి.ఉదయ్‌కుమార్ రెడ్డి అదనపు బలగాలతో ఉట్నూర్ చేరుకున్నారు. సమస్యలను కలెక్టర్‌కు విన్నవించాలని కోరారు. అయితే ఆందోళనకారులు ఐటీడీఏ పీవో రావాలని పట్టుబట్టారు. ప్రస్తుతం నిర్మల్ కలెక్టర్‌గా వ్యవహరిస్తున్న వరుణ్‌రెడ్డి ఉట్నూర్ ఐటీడీఏకు ఇన్‌చార్జి పీవోగా కొనసాగుతున్నారు. ఓ గంట తర్వాత ఆయన అక్కడికి చేరుకోవడంతో ఆదివాసీలు తమ సమస్యలను విన్నవించారు. ఎస్టీల్లో అదనంగా కులాలను చేర్చడాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాల జారీలో షరతులు విధించడం సరికాదన్నారు. దీనిపై వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

అన్ని ఐటీడీఏలను ముట్టడిస్తాం

ఇప్పటివరకు ఉన్న రిజర్వేషన్‌లతోనే ఆదివాసీల అభివృద్ధికి దిక్కులేదని, ఇంకా వేరేవారిని చేర్చడం ద్వారా మా మనుగడను రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నార్థకం చేస్తోందని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్సా పోచయ్య ఆరోపించారు. ఐటీడీఏ ముట్టడికి వచ్చిన ఆదివాసీలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని పోరాటం చేస్తుంటే ఈ ప్రభుత్వం అదనంగా 11 కులాలను చేర్చడం ఏవిధంగా సబబని ప్రశ్నించారు. ప్రగతి భవన్‌తో పాటు అన్ని ఐటీడీఏలను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండురంగ్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు గొడం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైరా మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం

కలెక్టర్‌కు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్ల నోటీసులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం జిల్లా వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌పై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సోమవారం కలెక్టర్ వీపీ గౌతమ్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. ఇటీవల జైపాల్‌తోపాటు మరో ముగ్గురు కౌన్సిలర్లు మాజీ ఎంపీ పొంగులేటికి మద్దతు తెలిపారు. దీంతో బీఆర్‌ఎస్ నుంచి ఇప్పటికే ఆయనను సస్పెండ్ చేయగా, మరో ముగ్గురు కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా ప్రకటించారు. ఈ క్రమంలో సోమవారం 14 మంది బీఆర్‌ఎస్, ఇద్దరు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లతో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ మంతనాలు జరిపారు. అనంతరం వీరంతా ఎమ్మెల్యే నేతృత్వంలో అవిశ్వాస తీర్మానం నోటీసును కలెక్టర్‌కు అందజేశారు.

పొంగులేటి వర్గం కావడంతో..

వైరా మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 20 వార్డులకుగాను బీఆర్‌ఎస్ 15, కాంగ్రెస్ రెండు, స్వతంత్రులు రెండు, సీపీఎం ఒక స్థానం గెలుచుకున్నాయి. ఆ తర్వాత ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు, సీపీఎం కౌన్సిలర్ బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌పై అసంతృప్తిగా ఉన్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన కార్యక్రమాలకు జైపాల్ హాజరయ్యారు. దీంతో ఆయనపై బీఆర్‌ఎస్ వేటువేసింది. ఆ తర్వాత మరో ముగ్గురు కౌన్సిలర్లు ఆ పార్టీకి రాజీనామా చేసి పొంగులేటి నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఎజెండా కాపీలను కౌన్సిల్ సమావేశాలకు ముందు అందజేయడంలేదని, అభివృద్ధిని పట్టించుకోవడంలేదని ఆయనపై మిగిలిన కౌన్సిర్లు అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వడం గమనార్హం.

రాయచూర్ వెళ్లే వాహనాల దారి మళ్లింపు

- కృష్ణా నదిపై బ్రిడ్జికి మరమ్మతులతో అధికారుల నిర్ణయం
- ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు అమలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్ర సరిహద్దులోని నారాయణపేట జిల్లా పరిధిలో కృష్ణా నదిపై బ్రిడ్జికి చేపట్టిన మరమ్మతుల కారణంగా జాతీయ రహదారి గుండా కర్ణాటకలోని రాయచూర్ వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నారు. ఈ నెల 22వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి నుంచి 25వ తేదీ వరకు వాహనాల మళ్లింపు ఉంటుంది. ఈ మేరకు హైదరాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్ నుంచి రాయచూరు వెళ్లే వాహనదారులు మార్పును గమనించి సహకరించాలని జోగులాంబ గద్వాల జోన్-7 డీఐజీ చౌహాన్ సూచించారు.

వాహనదారులు ఈ మార్గాల్లో వెళ్లాలి..

- హైదరాబాద్ నుంచి రాయచూర్ వైపుగా వెళ్లే వాహనదారులు జడ్చర్ల, భూత్పూర్, కొత్తకోట, పెబ్బేరు, ఎర్రవల్లి చౌరస్తా ద్వారా (కుడివైపు తిరిగి).. గద్వాల, కేటీదొడ్డి మీదుగా రాయచూర్..
- వికారాబాద్, కొడంగల్, తాండూర్, కోస్గి, మహమ్మదాబాద్, హన్వాడ, మహబూబ్‌నగర్ చుట్టుపక్కల గ్రామాల వాహనదారులు మహబూబ్‌నగర్ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ వయా భూత్పూర్, కొత్తకోట, పెబ్బేరు, ఎర్రవల్లి చౌరస్తా, గద్వాల, కేటీదొడ్డి మీదుగా రాయచూర్..
- దేవరకద్ర నుంచి రాయచూర్ వైపు వెళ్లే వాహనదారులు మరికల్ సబ్‌స్టేషన్ దగ్గర ఎడమవైపు తిరిగి చిత్తనూర్, రాంపూర్ గేటు, ఉంద్యాల, అమరచింత, మస్తీపూర్, కిష్టంపల్లి, నందిమల్ల, జూరాల డ్యామ్, ధరూర్ పోలీస్‌స్టేషన్, చిన్నచింత రేవుల, ధరూర్ గ్రామం, కేటీదొడ్డి మీదుగా రాయచూర్..
- కల్వకుర్తి నుంచి రాయచూర్ వైపు వెళ్లే వాహనదారులు జడ్చర్ల నుంచి భూత్పూర్, కొత్తకోట, పెబ్బేరు, ఎర్రవల్లి చౌరస్తా, గద్వాల, కేటీదొడ్డి మీదుగా రాయచూర్..
- నాగర్‌కర్నూల్ నుంచి రాయచూర్ వైపు వెళ్లే వాహనదారులు బిజినేపల్లి, భూత్పూర్, కొత్తకోట, పెబ్బేరు, ఎర్రవల్లి చౌరస్తా, గద్వాల, కేటీదొడ్డి మీదుగా రాయచూర్‌కు వెళ్లాల్సి ఉంటుంది.

క్లుప్తంగా...

మోదీ వివాదాస్పద వ్యక్తి!

మస్క్‌తో కలిపి ఒకేగాటన కట్టిన చాట్‌జీపీటీ జాబితాలో పుతిన్, ట్రంప్, బోరిస్, బోల్సొనారో

న్యూయార్క్: ప్రధాని నరేంద్ర మోదీని 'వివాదాస్పద వ్యక్తి'గా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్ చాట్‌జీపీటీ పేర్కొంది! ప్రపంచ కుబేరుడు, ట్విట్టర్ సీఈఓ ఎలాన్ మస్క్‌ను 'అత్యంత వివాదాస్పద వ్యక్తి'గా అది ఇటీవలే పేర్కొనడం తెలిసిందే. ప్రజా జీవితంలో ఉన్న ప్రముఖుల్లో వివాదాస్పదుల జాబితాను చాట్‌జీపీటీ తాజాగా వెల్లడించింది. అందులో మోదీతో పాటు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సొనారో, బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ తదితరులున్నారు. వీరందరినీ ప్రత్యేకంగా పరిగణించాల్సి ఉంటుందని కూడా చాట్‌జీపీటీ పేర్కొనడం విశేషం. వివాదాస్పదులు కాని వారి జాబితాలో అమెరికా, ఫ్రాన్స్ అధ్యక్షులు జో బైడెన్, మాక్రాన్, కుబేరులు బిల్ గేట్స్, జెఫ్ బెజోస్ తదితరులను పేర్కొంది.

26న సీబీఐ ముందు హాజరవనున్న సిసోడియా

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈ నెల 26వ తేదీన విచారణకు రావాలంటూ ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు సీబీఐ తాజాగా నోటీసులు పంపింది. ఈనెల 19వ తేదీనే ఆయన విచారణకు హాజరు కావాల్సి ఉంది. అయితే, బడ్జెట్ రూపకల్పనలో బిజీగా ఉన్నందున వచ్చే వారం వస్తానంటూ ఆయన ఆదివారం ఈడీకి లేఖ రాసిన విషయం తెలిసిందే. దీంతో, విచారణ తేదీని 26వ తేదీకి మారుస్తూ తాజాగా సమన్లు జారీ చేసినట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి.

25, 26 తేదీల్లో భారత్‌లో జర్మనీ అధ్యక్షుని పర్యటన

న్యూఢిల్లీ: జర్మనీ అధ్యక్షుడు ఒలాఫ్ షోల్జ్ ఈ నెల 25, 26వ తేదీల్లో భారత్‌లో పర్యటించనున్నారు. ఏడాది క్రితం అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన షోల్జ్ భారత్ రానుండటం ఇదే మొదటిసారి. సీనియర్ అధికారులు, ఉన్నత స్థాయి వాణిజ్య ప్రతినిధి వర్గంతో 25న ఆయన ఢిల్లీకి చేరుకుంటారని విదేశాంగ శాఖ తెలిపింది. షోల్జ్, ప్రధాని మోదీ పలు ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చలు జరుపుతారు. 26న బెంగళూరులో జరిగే కార్యక్రమాల్లో జర్మనీ అధ్యక్షుడు షోల్జ్ పాల్గొంటారు. అదేవిధంగా, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ కూడా మార్చి 8వ తేదీన భారత్‌లో పర్యటనకు రానున్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, కీలక ఖనిజాలు తదితర అంశాలపై ఆయన ప్రధాని మోదీతో విస్తృత చర్చలు జరుపుతారు. ఇరువురు నేతలు కలిసి అహ్మదాబాద్‌లో జరిగే భారత్–ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్‌ను తిలకించనున్నారు. ఈ పర్యటనపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

విద్వేషమే విడదీసింది!

ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య దశాబ్దాల వైరం

ఉభయ దేశాల యుద్ధంలో లక్షలాది మంది బలి ● కిమ్ వరుస క్షిపణి ప్రయోగాలతో ఉద్రిక్తతలు

ఉత్తర కొరియా. ప్రపంచంలో దూర్త దేశాల్లో ఒకటిగా అగ్రరాజ్యం అమెరికాతోపాటు యూరప్ దేశాలు గుర్తించిన దేశం. అమెరికా హెచ్చరికలను ఖాతరు చేయకుండా వరుస క్షిపణి ప్రయోగాలతో దూకుడు ప్రదర్శిస్తోంది. యథేచ్ఛగా ఆయుధ సంపత్తిని పెంచుకుంటోంది. అణ్వాయుధాలకూ పదును పెడుతోంది. తమవైపు కన్నెత్తి చూస్తే ఖబడ్దార్ అంటూ ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ హెచ్చరిస్తున్నారు. అమెరికా–దక్షిణ కొరియా కూటమి సంయుక్తంగా సైనిక విన్యాసాలపై మండిపడుతున్నారు. తాజాగా 48 గంటల వ్యవధిలో రెండుసార్లు క్షిపణి ప్రయోగాలు జరిపారు! ఉభయ కొరియాల మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతుండటం ప్రపంచ దేశాలను ఆందోళన పరుస్తోంది. వీటి మధ్య ఇంతటి విద్వేషానికి కారణమేమిటి...? - సాక్షి, నేషనల్ డెస్క్



ఉత్తర, దక్షిణ కొరియాల శత్రుత్వానిది దశాబ్దాల చరిత్ర. స్వతంత్ర దేశమైన ఉమ్మడి కొరియా ద్వీపకల్పాన్ని 1910లో జపాన్ ఆక్రమించుకుంది. 1945 దాకా నిరంకుశ పాలనలో కొరియా మగ్గిపోయింది. జపాన్ పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ పోరుబాట పట్టింది. కమ్యూనిస్టు నేత కిమ్ ఇల్–సంగ్ కొరియా విముక్తి కోసం మంచూరియా నుంచి జపాన్ సైన్యంపై గెరిల్లా యుద్ధం చేశారు. 1945లో రెండో ప్రపంచ యుద్ధం చివర్లో జపాన్ అధీనంలో ఉన్న కొరియాలోకి సోవియట్ సేనలు అడుగుపెట్టాయి. 38వ ప్యారలెల్ లైన్ దాకా దూసుకొచ్చాయి. దాని దిగువ ప్రాంతాన్ని అమెరికా స్వాధీనం చేసుకుంది. అలా కొరియా విభజనకు బీజం పడింది. 1945లో ప్యారలెల్ లైన్‌కు ఎగువన తమ అధీనంలోని కొరియా ప్రాంతంలో పాంగ్యాంగ్ రాజధానిగా సోవియట్ సైనిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అదే ఉత్తర కొరియా. దిగువ ప్రాంతంలో అమెరికా సైనిక ప్రభుత్వాన్ని నెలకొల్పింది. అదే దక్షిణ కొరియా!

ప్రచ్ఛన్నయుద్ధం చిచ్చు

కొరియాకు స్వాతంత్య్రం ఇవ్వడానికి ఉమ్మడి వేదిక ఏర్పాటు చేయాలని సోవియట్ యూనియన్, మిత్రదేశాలు భావించాయి. ప్రపంచాధిపత్యం కోసం అమెరికాతో సాగిన ప్రచ్ఛన్న యుద్ధంలో ఉత్తర కొరియా మద్దతు కోసం అక్కడి కమ్యూనిస్టులను సోవియట్ ప్రోత్సహించింది. దాని అండతో కిమ్ ఇల్ సంగ్ పెద్ద నేతగా అవతరించాడు. 1948లో ప్రధానిగా పీఠమెక్కాడు. అనంతరం సోవియట్ సేనలు ఉత్తర కొరియాను వీడాయి. మరోవైపు దక్షిణ కొరియాలో అమెరికా సైన్యం కమ్యూనిస్టులను కఠినంగా అణచివేసింది. అమెరికాలో చదివిన కమ్యూనిస్టు వ్యతిరేకి సైంగ్ మాన్ రీకి మద్దతిచ్చింది. 1948లో జరిగిన ఎన్నికల్లో అయిన సైంగ్‌మాన్ రీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 1949లో అమెరికా సైన్యం దక్షిణ కొరియా వీడింది. అక్కడి నుంచి ఇరు కొరియాల మధ్య కొట్లాటకు బీజం పడింది. కొరియా ద్వీపకల్పం మొత్తాన్ని తామే పాలిస్తున్నామని, ఉభయ ప్రభుత్వాలు వాదించడం మొదలుపెట్టాయి. కిమ్ ఇల్ సంగ్ నాటి సోవియట్, చైనాల్లోని కమ్యూనిస్టు పాలకులు స్టాలిన్, మావోల మద్దతు కోరారు. ఇటు సైంగ్ మాన్ రీ కూడా ఉత్తర కొరియాను జయించాలన్న ఆకాంక్షలను దాచుకోలేదు. ఇది కొరియన్ యుద్ధానికి దారితీసింది.

కొరియన్ యుద్ధం

1950 నాటికి సైనిక శక్తి పరంగా ఉత్తర కొరియాదే పైచేయి. కొరియా ద్వీపకల్పంపై ఆధిపత్యమే లక్ష్యంగా 1950 జూన్ 25న దక్షిణ కొరియాపై దండెత్తి చాలా ప్రాంతాలను ఆక్రమించుకుంది. అమెరికా జోక్యం చేసుకోబోదని, దక్షిణ కొరియా తన పరమవుతుందని కిమ్ భావించారు. కానీ, పోరాటం కాస్తా పోర యుద్ధంగా మారింది. కమ్యూనిస్టుల విస్తరణను అడ్డుకోవాలన్న ఉద్దేశంతో అమెరికా నేతృత్వంలోని ఐక్యరాజ్యసమితి సేనలు దక్షిణ కొరియాకు మద్దతుగా రంగంలోకి దిగాయి. ఉత్తర కొరియాను ఓడించినంత పనిచేశాయి. ఐరాస సైన్యం ఉత్తర కొరియాను దాటుకొని చైనా సరిహద్దు సమీపానికి చేరుకుంది. దాంతో ఉత్తర కొరియాకు అండగా చైనా రంగప్రవేశం చేసింది. చివరకు ఎటూ తేలకుండానే 1953లో యుద్ధం ముగిసింది. ప్రజలు, సైనికులు కలిపి 30 లక్షలకు పైగా బలయ్యారు.

దశాబ్దాలుగా అదే పగ

అమెరికా జోక్యం వల్లే దక్షిణ కొరియా తమకు దక్కకుండా పోయిందని కిమ్ పెంచుకున్న ద్వేషం తరతరాలుగా కొనసాగుతూనే ఉంది. కిమ్ తర్వాత కుమారుడు కిమ్ జోంగ్ ఇల్, ఇప్పుడు మనవడు కిమ్ జోంగ్ ఉన్ ఆ పగను అలాగే కొనసాగిస్తున్నారు. చైనా అండదండలతో ఉత్తర కొరియా, అమెరికా సహకారంతో దక్షిణ కొరియా సైనిక, ఆయుధ బలాన్ని పెంచుకుంటున్నాయి. తరచూ కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. దక్షిణ కొరియాలో ప్రజాస్వామ్యం వేళ్లూనుకోగా, ఉత్తర కొరియాలో మాత్రం నియంతృత్వం సాగుతోంది. 70 ఏళ్లలో దక్షిణ కొరియా అద్భుతమైన అభివృద్ధి సాధించగా ఉత్తర కొరియాలో మాత్రమే వెనకబాటుతనమే రాజ్యమేలుతోంది. వాటి నడుమ విద్వేషాలు చల్లారుతాయా, మళ్లీ ఒక్కటవుతాయా అంటే కాలమే సమాధానం చెప్పాలి!

మరో రెండు క్షిపణుల్ని ప్రయోగించిన ఉత్తరకొరియా

సియోల్: ఉత్తరకొరియా మూడు రోజుల వ్యవధిలోనే మరోసారి క్షిపణులను ప్రయోగించింది. శనివారం ఐసీబీఎంను ప్రయోగించిన ఆ దేశం సోమవారం రెండు స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఆ దేశం పశ్చిమతీరంలోని పట్టణం నుంచి ఈ క్షిపణులను ప్రయోగించినట్లు దక్షిణ కొరియా తెలిపింది. ఈ రెండు క్షిపణులు తమ ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ వెలుపల సముద్ర జలాల్లో పడిపోయాయని జపాన్ తెలిపింది. తమ దీర్ఘశ్రేణి రాకెట్ యూనిట్లు రెండు రాకెట్లను ప్రయోగించినట్లు ఉత్తరకొరియా అధికార వార్తా సంస్థ ధ్రువీకరించింది. ఇవి 395 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించాయని పేర్కొంది. తాజా ఉద్రిక్తతలపై చర్చించేందుకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిని వెంటనే సమావేశపరచాలని జపాన్ కోరింది. అమెరికా– దక్షిణ కొరియాల భారీ సైనిక విన్యాసాలు తమ దేశాన్ని ఆక్రమించడానికేనని ఆరోపిస్తూ ఉత్తరకొరియా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగిస్తుండటంతో కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.



మహిళా ఐపీఎస్, ఐఏఎస్‌ల గొడవ

ఇద్దరికీ నోటీసులిచ్చిన కర్ణాటక సర్కారు


రోహిణి సింధూరి


రూపా మౌద్గిల్

బనశంకరి: కర్ణాటకలో ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరిపై ఐపీఎస్ రూపా మౌద్గిల్ బహిరంగ ఆరోపణలు, ఆమె ఫొటోలను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేయడంపై రగడ రాజుకుంది. దీంతో ప్రభుత్వం సోమవారం ఇద్దరికీ నోటీసులను జారీచేసింది. ఇద్దరూ వేర్వేరుగా రాష్ట్ర సీఎస్ వందిత శర్మను కలిసి వివరణ ఇచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం వరకు రోహిణిపై రూపా ఫేస్‌బుక్ ద్వారా తీవ్ర ఆరోపణలను గుప్పించారు. సోమవారం రోహిణి సింధూరి బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న రూపాకు చికిత్స చేయించాలన్నారు. ప్రచారం కోసమే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను గతంలో సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన ఫొటోలను సేకరించి దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వీరి వ్యవహారాన్ని ప్రభుత్వం తీవ్రమైందిగా భావిస్తోందని హోంమంత్రి అరగ జ్ఞానేంద్ర తెలిపారు. వారి వ్యవహారంపై తాము కళ్లు మూసుకుని కూర్చోలేదని, చర్యలు తీసుకుంటామని, ఇద్దరూ హద్దు మీరి ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అంటే ప్రజాసేవకులని, ఆ హోదాలకు అవమానం చేశారని అన్నారు. తనకు తెలిసిన మేరకు వారిద్దరూ వ్యక్తిగత సమస్యల వల్లే దూషణలకు దిగుతున్నారని తెలిపారు. రోహిణి భర్త సుధీర్ రెడ్డి బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. తన కంటే పదేళ్లు జూనియర్ అయిన రోహిణీ సింధూరికి మంచి పేరు రావడం ఇష్టం లేకనే రూపా ఇలా ఆరోపణలు చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. రోహిణి ఫోన్‌ను బ్లూటూత్ ద్వారా హ్యాక్ చేసి వ్యక్తిగత ఫొటోలను రూపా కాజేశారంటూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జేడీయూ నుంచి వైదొలిగిన ఉపేంద్ర కుష్వాహ

పట్నా: జేడీయూ అసంతృప్త నేత ఉపేంద్ర కుష్వాహ సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. కొత్తగా రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ జనతా దళ్ పేరుతో పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. బిహార్ మహాఘట్‌బంధన్‌లో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌కు లభిస్తున్న ప్రాముఖ్యంపై అసంతృప్తితో ఉన్న కుష్వాహ గత కొంత కాలంగా జేడీయూ నేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌పై విమర్శలు చేస్తున్నారు. ఆయన రాజీనామాపై జేడీయూ జాతీయ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లాలన్ స్పందించారు. 'జేడీయూ నుంచి వెళ్లిపోయి సొంతంగా రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ పెట్టుకున్న కుష్వాహను 2021లో తిరిగి పార్టీలోకి కేవలం సీఎం నితీశ్ కుమార్ జోక్యంతోనే తీసుకున్నాం. స్థాయికి మించిన ఆశలు ఆయనకున్నాయి. అందుకే వెళ్లిపోతున్నారు' అని పేర్కొన్నారు.



భర్త, అత్తను చంపి, ముక్కలుగా నరికి..

- ప్రేమికుడు, స్నేహితుడి సాయంతో అస్సాం మహిళ దారుణం
- ఏడు నెలల తర్వాత మేఘాలయలో దొరికిన శరీర భాగాలు



గువాహటి: అస్సాం రాజధాని గువాహటికి చెందిన ఓ మహిళ దారుణానికి తెగించింది. తన భర్త, అత్తను చంపి ముక్కలుగా నరికి శరీర భాగాలను మేఘాలయలోని కొండప్రాంతంలో పడేసింది. ఏడు నెలల తర్వాత ఈ దారుణం వెలుగుచూసింది. పోలీసులు గాలించి ఆదివారం కొన్ని శరీర భాగాలను కనుగొన్నారు. గత ఏడాది జూలై–ఆగస్ట్ నెలల మధ్యలో ఈ దారుణం చోటుచేసుకుంది. తన భర్త అమర్‌జ్యోతి డే, అత్త శంకరి డే కనిపించడం లేదంటూ బందనా కలిటా(32) అనే మహిళ గత ఏడాది సెప్టెంబర్‌లో నూన్‌మతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొన్ని రోజుల తర్వాత అమర్‌జ్యోతి బంధువు కూడా అదే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఇద్దరి అదృశ్యం వెనుక బందనా కలిటా హస్తం ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. వీటిపై పోలీసులు దర్యాప్తు చేపట్టి కేసును ఛేదించారు. బందనాతోపాటు, ఆమె సన్నిహితులైన ధాంతి డేకా(32), అనూప్ డేకా(27)లను దోషులుగా గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. ఈ ముగ్గురూ కలిసి గువాహటిలోని చాంద్‌మరి, నారెంగి ప్రాంతాల్లో అమర్‌జ్యోతి, శంకరిలను చంపి నాలుగైదుముక్కలుగా చేశారు. అనంతరం ప్లాస్టిక్ బ్యాగుల్లో వాటిని ప్యాక్ చేసి, మేఘాలయకు కారులో తీసుకెళ్లారు. అక్కడి కొండప్రాంతంలో పడేశారు. విచారణలో వెల్లడించిన సమాచారం ఆధారంగా శరీర భాగాల్లో కొన్నిటిని స్వాధీనం చేసుకున్నారు. హత్యకు కారణాలతోపాటు పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు.

ఢిల్లీలోని ఒవైసీ ఇంటిపై రాళ్ల దాడి

న్యూఢిల్లీ: ఢిల్లీలోని తన నివాసంపై కొందరు దుండగులు రాళ్లతో దాడి చేశారంటూ ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సోమవారం ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2014 నుంచి ఇప్పటి వరకు నాలుగు పర్యాయాలు తన నివాసంపై దాడులు జరిగాయన్నారు. తాజా దాడిలో కిటికీల అద్దాలు పగిలాయన్నారు. రాజస్తాన్ పర్యటన నుంచి ఆదివారం రాత్రి తిరిగి వచ్చిన తనకు పనివారు ఈ విషయం చెప్పారన్నారు. అత్యంత భద్రత ఉండే చోట దాడికి పాల్పడిన వారిని వెంటనే పట్టుకోవాలని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో ఒవైసీ కోరారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించినట్లు డీసీపీ ప్రణవ్ తయాల్ చెప్పారు.

ఉక్రెయిన్‌లో బైడెన్

యుద్ధానికి ఏడాదవుతున్న వేళ ఆకస్మిక పర్యటన

- రష్యాను గొప్పగా నిలువరించారు
- మీ పోరాట స్ఫూర్తి ప్రశంసనీయం
- ప్రపంచమంతా అండగా ఉంటుంది
- మద్దతు కొనసాగుతుందంటూ హామీ
- జెలెన్‌స్కీతో కలిసి కీవ్‌లో పర్యటన
- మరో 50 కోట్ల డాలర్ల ప్యాకేజీ



కీవ్: రష్యా ఆక్రమణతో ఏడాదిగా అతలాకుతలమవుతున్న ఉక్రెయిన్‌లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సోమవారం ఆకస్మికంగా పర్యటించారు. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. రష్యాపై యుద్ధంలో మరోసారి సంఘీభావం ప్రకటించారు. రాజధాని కీవ్‌లో పలు ప్రాంతాలను జెలెన్‌స్కీతో కలిసి సందర్శించారు. యుద్ధం తాలూకు విధ్వంసానికి గుర్తులుగా మిగిలిన కూలిన భవనాలు, శిథిలాలు తదితరాలను వీక్షించారు. మరణించిన ఉక్రెయిన్ సైనికుల స్మారక నిర్మాణం వద్ద నివాళులర్పించారు. అనంతరం వారు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఏడాది కిందట రష్యా ఉన్నట్టుండి ఉక్రెయిన్‌పై దురాక్రమణకు పాల్పడిందంటూ బైడెన్ గుర్తు చేసుకున్నారు. ''ఉక్రెయిన్‌ను పుతిన్ సేన చూస్తుండగానే కబళించేస్తుందని భయపడ్డాం. కానీ ఏడాది గడిచినా ఉక్రెయిన్ ఏ మాత్రమూ తలవంచకుండా నిలబడింది. దీటుగా పోరాడుతోంది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని సమున్నతంగా నిలబెడుతోంది. వారి పోరాట స్ఫూర్తికి సలాం'' అంటూ ప్రశంసించారు. ''ఈ ఆటవిక, అక్రమ యుద్ధం ఇంకా ముగియలేదు. మరింత కష్టకాలం ముందుంది. కానీ ఈ పోరాటంలో అమెరికా మీతో ఉంది. మొత్తం ప్రపంచమే మీతో ఉంది. యుద్ధం ఎంత కాలం కొనసాగినా మీకు దన్నుగా నిలుస్తాం'' అంటూ భరోసా ఇచ్చారు. ''సమయం గడిచే కొద్దీ ఉక్రెయిన్‌కు తమ సాయం సన్నగిల్లుతుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ భ్రమ పడ్డారు. ఆయన దురాక్రమణ ఆకాంక్షలు ఆవిరి కాక తప్పదు. స్వేచ్ఛ అమూల్యమైనది. దానికోసం ఎంతకాలమైనా పోరాడాల్సిందే'' అన్నారు. ఉక్రెయిన్‌కు మరో 50 కోట్ల డాలర్ల సాయాన్ని ఈ సందర్భంగా బైడెన్ ప్రకటించారు. ఇందులో హొవిట్జర్ శతఘ్నులు, ట్యాంక్ విధ్వంసక క్షిపణులు, గగనతల పర్యవేక్షణ రాడార్లు తదితరాలున్నాయి. వీటితో పాటు మరిన్ని లాంగ్‌రేంజ్ వెపన్స్‌తో పాటు మరిన్ని కొత్త తరహా ఆయుధాలు కూడా అందించేందుకు బైడెన్ అంగీకరించినట్టు జెలెన్‌స్కీ చెప్పారు. ఆయనతో చర్చలు ఫలప్రదంగా జరిగాయన్నారు. వేసవి సమీపిస్తుండటంతో యుద్ధం మరింత తీవ్రతరం కావడం ఖాయమన్న అంచనాల మధ్య బైడెన్ పర్యటనకు చాలా ప్రాధాన్యం ఏర్పడింది. తద్వారా యుద్ధం ఇంకెంత కాలం కొనసాగినా ఉక్రెయిన్‌కు మద్దతిస్తూనే ఉంటామన్న సందేశాన్ని ఇచ్చారని భావిస్తున్నారు.

కట్టుదిట్టమైన భద్రత

బైడెన్ పర్యటన అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య కొనసాగింది. ఆయన కీవ్‌లో ఉన్నంతసేపూ ఈ–3 సెంట్రీ ఎయిర్‌బోర్న్ రాడార్ వంటి అమెరికా నిఘా విమానాలు, ఆర్‌సీ–135డబ్ల్యూ రివెట్ జాయింట్ ఎయిర్‌క్రాఫ్ట్ తదితరాలు పోలండ్ గగనతలం నుంచి ఉక్రెయిన్‌పై గట్టి నిఘా వేసి ఉంచాయి. బైడెన్ సోమవారం ఉదయమే కీవ్‌లో అడుగుపెట్టి ఐదు గంటలకు పైగా గడిపారు. ఇలా అమెరికాకు గానీ, దాని మిత్ర దేశాలకు గానీ గగనతల నియంత్రణ లేని యుద్ధ క్షేత్రంలో యూఎస్ అధ్యక్షుడు పర్యటించడం చాలా అరుదు. బైడెన్ ఉక్రెయిన్ పర్యటన గురించి రష్యాకు అమెరికా ముందుగానే సమాచారమిచ్చింది.

కాంట్రాక్టులన్నీ అదానీకే ఎందుకు: రాహుల్

న్యూఢిల్లీ: దేశంలోని ఆరు ఎయిర్‌పోర్టుల కాంట్రాక్టులను అదానీ గ్రూప్‌కే కట్టబెట్టడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్రాన్ని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ మేజిక్‌తో అదానీ లాభపడ్డారని పేర్కొన్నారు. సోమవారం మిత్ర–కాల్ పేరుతో రాహుల్ గాంధీ తన సామాజిక మాధ్యమ ఖాతాల్లో ఒక వీడియోను విడుదల చేశారు. 'మిత్ర–కాల్‌లో కబ్జారాజ్యం నడుస్తోంది. విమానాశ్రయాలు, పోర్టులు, రోడ్లు, భద్రతాబలగాలు, మీడియా, బొగ్గు, ఇంధనం..ఇలా అన్నిటిపై పెత్తనాన్ని ఒక్కరికే అప్పగించారు. వీటిపై మీడియా మాట్లాడదు. నా ప్రశ్నలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పరు' అని రాహుల్ ఆ వీడియోలో పేర్కొన్నారు. అదానీ గ్రూప్‌లో అక్రమాలు, దేశ సంపద లూటీ అవుతున్న తీరుపై పార్లమెంట్‌లో వెల్లడించిన నిజాలను ప్రభుత్వం రికార్డులనుంచి తొలగించిందని అందులో పేర్కొన్నారు. 'ఫకీర్ తన మేజిక్‌తో సంచీలోంచి తీసిన ఎయిర్‌పోర్టును అదానీ చేతుల్లో పెట్టారు' అంటూ ఆయన ట్వీట్ చేశారు. గుత్తాధిపత్యాన్నే వ్యతిరేకిస్తాను తప్ప వ్యాపార సంస్థలను కాదని రాహుల్ చెప్పారు.

ఛత్తీస్ కాంగ్రెస్ నేతల ఇళ్లలో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: కోల్ లెవీ మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం ఛత్తీస్‌గఢ్‌లోని అధికార కాంగ్రెస్ నేతల నివాసాల్లో సోదాలు జరిపినట్లు ఈడీ తెలిపింది. రాయ్‌పూర్‌లో ఈనెల 24–26వ తేదీల్లో కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలుండగా దాడులు జరగడం గమనార్హం. దాదాపు డజను ప్రాంతాల్లో సోమవారం ఉదయం నుంచి సోదాలు కొనసాగుతున్నాయని ఈడీ పేర్కొంది. భిలాయ్‌లోని కాంగ్రెస్ ఎమ్మెల్యే దేవేంద్ర యాదవ్, రాష్ట్ర పీసీసీ ట్రెజరర్ రాంగోపాల్ అగర్వాల్, పార్టీ అధికార ప్రతినిధి ఆర్‌పీ సింగ్‌తోపాటు, పలువురు పార్టీ నేతలకు చెందిన ప్రాంతాలపైనా సోదాలు జరిగాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి రవాణా అయ్యే ప్రతి టన్ను బొగ్గుపై రూ.25 చొప్పున అక్రమంగా వసూలు చేసి సీనియర్ అధికారులు, వ్యాపార వేత్తలు, దళారులు, రాజకీయ నేతలు పంచుకున్నట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈ కేసులో ఇప్పటికే పలువురిని ఈడీ అరెస్ట్ చేసింది. ఈడీతో దాడులు చేయిస్తూ కేంద్రంలోని బీజేపీ వేధింపు, కక్షసాధింపు, దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని కాంగ్రెస్ ఆరోపించింది.

నీతి ఆయోగ్ సీఈఓగా బీవీఆర్ సుబ్రహ్మణ్యం

ప్రపంచ బ్యాంకు ఈడీగా పరమేశ్వరన్ అయ్యర్



న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ కొత్త సీఈవోగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీవీఆర్ సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. నీతి ఆయోగ్ ప్రస్తుత సీఈవో పరమేశ్వరన్ అయ్యర్‌ను ప్రభుత్వం ప్రపంచబ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించింది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్లపాటు సుబ్రహ్మణ్యం ఆ పదవిలో ఉంటారని తెలిపింది. 1987 బ్యాచ్ ఛత్తీస్‌గఢ్ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన సుబ్రహ్మణ్యం ప్రస్తుతం ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్(ఐటీపీవో) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. అయ్యర్ వాషింగ్టన్‌లో ఉన్న ప్రపంచబ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఈడీగా మూడేళ్లపాటు పని చేయనున్నారు.

దివ్యాంగ వృద్ధుడికి డ్రోన్ ద్వారా పెన్షన్

నౌపద: హితారామ్ సత్నామీ. వయోభారంతో ఆరోగ్యం క్షీణించిన వృద్ధుడు. పైగా దివ్యాంగుడు. ఒడిశా రాష్ట్రం నౌపద జిల్లాలో మారుమూల గ్రామం భుత్కాపడని నివసిస్తున్నాడు. ఒడిశా ప్రభుత్వం అమలు చేస్తున్న 'మధుబాబు పెన్షన్ యోజన' లబ్ధిదారుడు. స్వయంగా నడవలేడు. ప్రతి నెలా దట్టమైన అడవిలో రెండు కిలోమీటర్లు ఇతరుల సాయంతో ప్రయాణించి, పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పెన్షన్ తెచ్చుకొనేవాడు. ఫిబ్రవరిలో మాత్రం అతడికి ఈ ప్రయాణ బాధ తప్పింది. గ్రామ సర్పంచ్ డ్రోన్ ద్వారా పెన్షన్ అందజేసే ఏర్పాటు చేయడమే ఇందుకు కారణం. సర్పంచ్ సరోజ్ అగర్వాల్ డ్రోన్ ద్వారా పెన్షన్ డబ్బులను తన ఇంటి వద్దకే చేర్చారని హితారామ్ సత్నామీ ఆనందం వ్యక్తం చేశాడు. వృద్ధుడు హితారామ్ గురించి తెలిసిన తర్వాత సొంత డబ్బులతో ఆన్‌లైన్‌లో డ్రోన్ కొనుగోలు చేశామని, ప్రతినెలా డ్రోన్ సాయంతో అతడికి పెన్షన్ అందజేయాలని నిర్ణయించామని సర్పంచ్ సరోజ్ అగర్వాల్ చెప్పారు.

లింగ, మతప్రమేయం లేని...
ఉమ్మడి చట్టాలు చేయొచ్చా?

- కోర్టులు అలా నిర్దేశించొచ్చా?
- సుప్రీంకోర్టు కీలక ప్రశ్నలు



న్యూఢిల్లీ: శాసన వ్యవస్థ పరిధిలోని అంశాలపై న్యాయ వ్యవస్థ జోక్యంపై సుప్రీంకోర్టు సోమవారం ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. పెళ్లిళ్లు, విడాకులు, మనోవర్తి, వారసత్వం వంటి అంశాల్లో లింగ, మతప్రమేయం లేకుండా పౌరులందరికీ సమానంగా వర్తించేలా ఉమ్మడి చట్టాలు చేయాలంటూ దాఖలైన పలు పిటిషన్లు, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్.నరసింహ, జె.బి. పార్దీవాలా ధర్మాసనం విచారణ జరిపింది. ''వీటిపై శాసన వ్యవస్థకు కోర్టులు సలహాలు, సూచనలు ఇవ్వొచ్చా? ఈ మేరకు కేంద్రానికి నిర్దేశాలు జారీ చేయొచ్చా?'' అంటూ సందేహాలు లేవనెత్తింది. శాసన వ్యవస్థ పరిధిలోని ఈ అంశాలపై న్యాయ జోక్యం ఏ మేరకు ఉండొచ్చన్నదే ఇక్కడ కీలక ప్రశ్న అని అభిప్రాయపడింది. ఇలాంటి అంశాల్లో ఉమ్మడి చట్టాలకు అభ్యంతరం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. విచారణను ధర్మాసనం నాలుగు వారాల పాటు వాయిదా వేసింది. ఈ పిటిషన్లను విచారణకు స్వీకరించాలో, వద్దో అప్పుడు తేలుస్తామని పేర్కొంది.

'అందరికీ ఒకే వివాహ వయసు' పిటిషన్ కొట్టివేత

స్త్రీ, పురుషులందరికీ చట్టబద్ధంగా ఒకే కనీస వివాహ వయసుండేలా చట్టం తేవాలంటూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ ధర్మాసనం కొట్టేసింది. 'ఇది పార్లమెంటు పరిధిలోని అంశం. దానిపై మేం చట్టం చేయలేం. రాజ్యాంగానికి మేం మాత్రమే ఏకైక పరిరక్షకులం కాదు. పార్లమెంటు కూడా ఆ భారం వహిస్తోంది' అని అభిప్రాయపడింది. కనీస వివాహ వయసు పురుషులకు 21 ఏళ్లు, మహిళలకు 18 ఏళ్లు.

ఎన్నికల సంఘాన్ని రద్దు చేయాలి: ఉద్ధవ్

న్యూఢిల్లీ/ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గాన్ని అసలైన శివసేనగా గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘాన్ని రద్దు చేయాలని మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే డిమాండ్ చేశారు. 'శివసేన పేరు, విల్లు, బాణం గుర్తును మా వద్ద నుంచి దొంగిలించారు. కానీ, ఠాకరే పేరును మాత్రం దొంగిలించలేరు' అని సోమవారం మీడియాతో అన్నారు. ఈసీ అంత హడావుడిగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందని ప్రశ్నించారు. దీనిపై తాము వేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో బహుశా మంగళవారం విచారణకు రావొచ్చని అన్నారు. ''ఎన్నికల సంఘం ఉత్తర్వులు తప్పు. సుప్రీంకోర్టే మా చివరి ఆశా కిరణం'' అని ఉద్ధవ్ పేర్కొన్నారు. దేశంలోని ప్రజాస్వామిక వ్యవస్థలను బీజేపీ నాశనం చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. 'నేడు మాకు జరిగినట్లే రేపు మరొకరికి జరగొచ్చు. ఇలాగే కొనసాగితే 2024 తర్వాత దేశంలో ప్రజాస్వామ్యం ఉండదు. ఎన్నికలూ ఉండవు' అని హెచ్చరించారు. ఎన్నికల సంఘం ఉత్తర్వుల నేపథ్యంలో మమతా బెనర్జీ, శరద్ పవార్, నితీశ్ కుమార్, తదితర విపక్ష నేతలు తనకు ఫోన్ చేసి మద్దతు తెలిపారన్నారు.



సుప్రీం తలుపుతట్టిన ఉద్ధవ్ వర్గం

షిండే వర్గాన్ని అసలైన శివసేనగా గుర్తిస్తూ, విల్లు, బాణం ఎన్నికల గుర్తు కేటాయించడాన్ని ఉద్ధవ్ వర్గం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. అయితే ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం తిరస్కరించింది. ''నిబంధనలు అందరికీ సమానంగా వర్తిస్తాయి. సరైన ప్రక్రియను అనుసరించి మంగళవారం న్యాయస్థానం ముందుకు రండి'' అని సీజేఐ సూచించారు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



తెలంగాణలో వైద్య రంగానికి పెద్దపీట

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైద్య రంగాన్ని అన్ని విధాలా అభివృద్ధిపర్చి సేవలందించే ఏర్పాట్లు చేశామని రాష్ట్ర మంత్రి హరీష్ రావు అన్నారు. -8లో



యూట్యూబ్‌లో చూసి నకిలీ కరెన్సీ తయారీ

యూట్యూబ్ వీడియోల ఆధారంగా నకిలీ కరెన్సీ ముద్రణ, చెలామణి చేస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. -8లో

అయిదు నామినేషన్లు

సాక్షి, సిటీబ్యూరో: మహబూబ్ నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సోమవారం అయిదుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మాడిశెట్టి తిరుపతి, చాలిక చంద్రశేఖర్, చాలిక పార్వతి, పాపన్న గారి మాణిక్ రెడ్డి, మారంపల్లి లక్ష్మీనారాయణ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలాకు అందజేశారు.

న్యూస్‌రీల్

చంచల్‌గూడ జైలులో 'మదర్ ఫీడింగ్' రూమ్



చంచల్‌గూడ: సాధారణంగా ఇంటి నుంచి బయటకు వచ్చిన బాలింతలు తమ పసిపిల్లలకు పాలు పట్టించేందుకు ఇబ్బందులు పడుతుంటారు. ఆస్పత్రుల్లో తప్ప వేరే చోట ఫీడింగ్ రూమ్‌లు కనిపించవు. స్వతహాగా సేవ గర్ల్ చైల్డ్ అనే అంశంతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ నవాబు శివకుమార్ గౌడ్ ములాఖత్ కోసం వస్తున్న బాలింతల ఇబ్బందులను గమనించి జైలు ఆవరణలో ఫీడింగ్ రూమ్ ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడి సిబ్బంది, జైలుకు వచ్చిన వారు శివకుమార్‌ను ప్రశంసిస్తున్నారు

ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ప్రారంభం



బంజారాహిల్స్: మూడు రోజుల పాటు బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో జరగనున్న సూత్ర ఫ్యాషన్ ఎగ్జిబిషన్ సోమవారం ప్రారంభమైంది. అరుదైన కలర్‌ఫుల్ కాంబినేషన్‌లో డిజైనర్ దుస్తులు, ఆభరణాలు, సౌందర్య ఉత్పత్తులు, గృహ అలంకరణ సామగ్రి, వినియోగ వస్తువులు ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ముంబై, ఢిల్లీ, జైపూర్, కోల్‌కతా, అహ్మదాబాద్, బెంగళూరు, కోయంబత్తూరు తదితర నగరాల నుంచి ఫ్యాషన్, డిజైనరీ బ్రాండ్‌లు ఈ ప్రదర్శనలో తమ ఉత్పత్తులను ఉంచాయి.

హాథ్ సే హాథ్ జోడో అసెంబ్లీ సమన్వయకర్తలు వీరే

సాక్షి, సిటీబ్యూరో: హాథ్ సే హాథ్ జోడో అభియాన్‌కు పీసీసీ ప్రధాన కార్యదర్శులను అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలుగా నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రమోద్ కుమార్, కార్వాన్‌కు సరితా వెంకటేష్, చార్మినార్, గోషామహల్‌లకు పటేల్ రమేష్ రెడ్డి, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురాకు చిలుముల కృష్ణారెడ్డి, యాకుత్‌పురా, సికింద్రాబాద్‌లకు ఉజ్మా షాకీర్, ముషీరాబాద్‌కు రజితా రెడ్డి, ఖైరతాబాద్, నాంపల్లికి సీహెచ్ శ్రీనివాస్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్‌లకు కోటం రెడ్డి వినయ్‌రెడ్డి, కుత్బుల్లాపూర్, ఉప్పల్‌కు అభిలాష్‌రావు, కూకట్‌పల్లి, మేడ్చల్‌కు చరకొండ వెంకటేష్, మల్కాజిగిరి, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు మహిపాల్, ఎల్‌బీనగర్‌లకు రఘువీర్‌రెడ్డి, అంబర్‌పేటకు బి కిషన్, పటాన్‌చెరుకు కైలాష్‌కుమార్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లికి విజయారెడ్డి, మహేశ్వరానికి జోత్స్నారెడ్డిలను నియామిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ప్రీబిడ్ విజయవంతం

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండల పరిధిలోని హెచ్‌ఎండీఏ స్థలాలపై సోమవారం జరిగిన ప్రీ బిడ్ సమావేశం విజయవంతమైంది. మేడిపల్లిలో 300 చదరపు గజాలు గల 50 ప్లాట్లు అమ్మకాలకు సిద్ధంగా ఉన్నాయి. ప్రీబిడ్ సమావేశంలో ఎమ్మెస్టీసీ ప్రతినిధులు లేఅవుట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. హెచ్‌ఎండీఏ ఇంజినీరింగ్, ఎస్టేట్ అధికారులు మేడిపల్లి లేఅవుట్ ప్రాధాన్యాన్ని వివరించారు. కీసర ఆర్డీఓ రమేష్, మేడిపల్లి తహసీల్దార్ మణిపాల్ రెడ్డి, హెచ్‌ఎండీఏ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఇ) హుస్సేన్, ప్లానింగ్ ఆఫీసర్ (పీఓ) ప్రభాకర్ రెడ్డి, ఎస్టేట్ అధికారులు శ్రీకాంత్ రెడ్డి, డీఏఓ శోభ తదితరులు పాల్గొన్నారు. మార్చి 6న ఈ ప్లాట్లకు ఆన్‌లైన్ వేలం నిర్వహించనున్నారు.

మార్చి 3న రాజీవ్ స్వగృహ ఫ్లాట్‌లకు లాటరీ

సాక్షి, సిటీబ్యూరో: బండ్లగూడ, పోచారంలలో రాజీవ్ స్వగృహ అపార్ట్‌మెంట్‌లలో మిగిలిపోయిన ఫ్లాట్‌లకు మార్చి 3వ తేదీన లాటరీ నిర్వహించనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీ నాటికి టోకెన్ అడ్వాన్స్ చెల్లించిన వారికి లాటరీ ద్వారా ఫ్లాట్లను కేటాయిస్తారు. ట్రిపుల్ బెడ్రూమ్‌కు రూ.3 లక్షలు, డబుల్ బెడ్ రూమ్‌కు రూ.2 లక్షలు, సింగిల్ బెడ్ రూమ్‌కు రూ.లక్ష చొప్పున టోకెన్ చెల్లించిన వారు మార్చి 3 నాటి లాటరీలో పాల్గొనవచ్చు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి పారదర్శకంగా లాటరీ నిర్వహిస్తారు. ఆన్‌లైన్‌లో ప్రత్యక్షంగా యూ ట్యూబ్, ఫేస్‌బుక్ ద్వారా వీక్షించవచ్చు.







సాయన్నా.. ఇక సెలవ్

బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ఆత్మీయుల అశ్రునయనాల నడుమ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలు ముగిశాయి. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కార్ఖానాలోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రారంభమైన అంతిమ యాత్ర సాయంత్రం 5 గంటలకు మారేడుపల్లి శ్మశాన వాటికకు చేరుకుంది. అధికార లాంఛనాలతో సాయన్న అంత్యక్రియలు నిర్వహించడం లేదని తెలుసుకున్న ఆయన అభిమానులు ఒక్కసారిగా ఆందోళకు దిగారు. రాజకీయ పార్టీలకు అతీతంగా స్థానిక దళిత సంఘాల నేతలు, కార్యకర్తల ఆందోళన కారణంగా దాదాపు రెండు గంటల పాటు అంత్యక్రియలు నిలిచిపోయాయి. ఎట్టకేలకు కుటుంబ సభ్యుల విజ్ఞప్తితో రాత్రి 7.30 గంటలకు అంత్యక్రియలు జరిగాయి.

ఆఖరు దాకా ఉన్న ఆప్తమిత్రులు

సాయన్నతో రాజకీయాలతో పాటు వ్యక్తిగత అనుబంధం కలిగిన డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, మైనంపల్లి హన్మంతరావులు మధ్యాహ్నం ఒంటి గంటకు కార్ఖానాకు చేరుకున్నారు. సాయన్న అంతిమ యాత్ర ప్రారంభం కాగానే కాలినడకనే కొద్ది దూరం వరకు వచ్చిన నేతలు, రెండు గంటల అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

– కంటోన్మెంట్

కాలుష్యానికి కళ్లెం వేద్దాం



వాయు కాలుష్యం, ఈ- వేస్ట్ నియంత్రణపై పీసీబీ నజర్

- కేంద్ర నిధులతో గ్రేటర్‌లో కాలుష్యం తగ్గింపునకు చర్యలు
- ఈ- వేస్ట్, నిర్మాణ వ్యర్థాల నియంత్రణ, శుద్ధి పాలసీపై సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: వాయు కాలుష్యం, ఈ- వేస్ట్ నియంత్రణ, నిర్మాణ వ్యర్థాల కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలి దృష్టి సారించింది. ఇందుకోసం అమలు చేస్తున్న కార్యాచరణ ప్రణాళిక అమలు తీరుపై రాష్ట్ర పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ సోమవారం పీసీబీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సమావేశంలో ఐఐటీ కాన్పూర్ నిపుణులు ప్రొఫెసర్ ముఖేష్ శర్మ, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సూక్ష్మ, స్థూల ధూళి కాలుష్యం ఉత్పన్నమయ్యేందుకు గల కారణాలను తన అధ్యయన నివేదిక ఆధారంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దెబ్బతిన్న రహదారులపై దుమ్ము, ధూళి అధికంగా వెలువడడం, కాలం చెల్లిన వాహనాలను నుంచి వెలువడుతున్న అపరిమిత ఉద్గారాలు, ఘన వ్యర్థాలను బహిరంగంగా దహనం చేయడం, కాలుష్య కారక పరిశ్రమలు వెలువరిస్తున్న వ్యర్థాల వివరాలను విశ్లేషించారు. ఈ అధ్యయన నివేదిక ఆధారంగా నగరంలో కాలుష్యం తగ్గించేందుకు చర్యలు తీసుకునే అంశంపై సమీప భవిష్యత్‌లో పలు సెమినార్లు నిర్వహించాలని రజత్ కుమార్ పీసీబీ అధికారులకు సూచించారు.



పీసీబీలో సమీక్ష సమావేశంలో పాల్గొన్న రజత్ కుమార్, నీతూ ప్రసాద్ తదితరులు

కాలుష్యం తగ్గింపునకు కేంద్ర నిధులు..

గ్రేటర్ పరిధిలో వాయు కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు మంజూరు చేయనున్నట్లు రజత్‌కుమార్ తెలిపారు. ఈ నిధులతో కాలుష్య కట్టడికి పలు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలుష్య నియంత్రణకు నల్లగొండ పట్టణంలో తీసుకున్న చర్యలు సత్ఫలితాన్నిచ్చాయని తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రేటర్ పరిధిలోనూ వాయునాణ్యతను మరింత మెరుగు పరిచేందుకు పలు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

భవన నిర్మాణ వ్యర్థాలపై..

నిర్మాణ వ్యర్థాల నియంత్రణపైనా సమీక్షించారు. వ్యర్థాల సేకరణ, శుద్ధి సామర్థ్యాన్ని నిత్యం 1000 నుంచి 2000 టన్నుల సామర్థ్యానికి పెంచినట్లు తెలిపారు. శుద్ధి చేసిన వ్యర్థాలను విధిగా వివిధ ప్రాజెక్టులలో తిరిగి ఉపయోగించడాన్ని తప్పనిసరి చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. నిర్మాణ వ్యర్థాలను సమర్థంగా ట్రాక్ చేసేందుకు పీసీబీ వెబ్‌సైట్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను పొందుపరచాలని ఆదేశించారు. సమావేశంలో ఐఐటీ, కాన్పూర్ బృందం, టీఎస్‌పీసీబీ సభ్య కార్యదర్శి నీతూ ప్రసాద్, ఎక్స్‌పర్ట్స్ కమిటీ సభ్యులు బి.సేన్‌గుప్తా, శాస్త్రవేత్తలు టి.వి.బి.ఎస్. రామకృష్ణ, ఆసిఫ్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

ఈ- వ్యర్థాల నియంత్రణపై..



ఈ- వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల అమలును రజత్‌కుమార్ సమీక్షించారు. ఈ వ్యర్థాల సేకరణలో పీసీబీ అమలు చేస్తున్న విధానాల కారణంగా ఏటా 30 వేల టన్నుల నుంచి 44 వేల టన్నుల మేర వ్యర్థాలను సేకరించి శుద్ధి చేస్తున్నామన్నారు. ఈ- వ్యర్థాల సేకరణ, శాస్త్రీయ శుద్ధి కోసం పలువురికి శిక్షణనివ్వడం సవాలుగా మారిందన్నారు. వ్యర్థాల సేకరకణను మరింత మెరుగుపరిచేందుకు వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని పీసీబీ అధికారులను ఆయన ఆదేశించారు.

ఎంత పని చేశావ్ అమ్మా!

పుట్టిన బిడ్డలందరూ అల్పాయుష్కులేనని ఆవేదన

- కొన్నాళ్ల క్రితం ముగ్గురు చిన్నారుల మృతి
- మేనరికపు పెళ్లి వల్లే పిల్లలకు అనారోగ్యం అని అనుమానం
- మాతృమూర్తిగా భరించలేనంటూ కఠిన నిర్ణయం
- ఇద్దరు పసికందులను సంపులో వేసి తల్లి ఆత్మహత్య
- ఘటనా స్థలంలో లభించిన సూసైడ్ నోట్





సంధ్యారాణి (ఫైల్) విగతజీవులుగా తల్లి, ఇద్దరు పసికందులు

అల్వాల్: కడుపున పుట్టిన ముగ్గురు బిడ్డలూ అల్పాయుష్షుతోనే కన్నుమూశారు. ప్రస్తుతం జన్మించిన కవలలూ అనారోగ్యానికి గురయ్యారు. మేనరికపు పెళ్లి కారణంగానే పిల్లలు ఆయుర్దాయం లేకుండా చనిపోతున్నారని ఆవేదనకు గురైంది ఆ తల్లి. భవిష్యత్‌లో తాను మాతృమూర్తిగా మనగలిగే పరిస్థితి ఉండదని భావించిన ఆమె పదిరోజుల వయసున్న పసికందులను ఇంటి ఆవరణలోని సంపులో పడేసి తానూ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాజీగూడ శివనగర్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

- మెదక్ జిల్లాకు చెందిన నర్సింగ్‌రావుకు మేనమామ కూతురు సంధ్యారాణితో 2012లో వివాహమైంది. 5 సంవత్సరాల అనంతరం ఇద్దరు కవల పిల్లలు జన్మించి అనారోగ్యంతో చనిపోయారు. 2018లో పుట్టిన కొద్ది రోజులకే కూతురు మరణించింది. అనంతరం ఈ నెల 11న ఇద్దరు కవల (మగ, ఆడ) పిల్లలు జన్మించారు. వీరు సైతం అనారోగ్యానికి గురయ్యారు. బాబుని కొంపల్లిలోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. 14వ తేదీన ఇంటికి తీసుకువచ్చారు. పుట్టిన పిల్లలందరూ అనారోగ్యానికి గురవుతూ మృత్యువాత పడుతుండడం.. ఈ ఇద్దరు పసికందులు కూడా దక్కకుండాపోతారేమోనని భావించిన సంధ్యారాణి.. ఆదివారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంటి ఆవరణలో ఉన్న సంపులో వారిని పడేసి తాను కూడా ఆత్మహత్యకు పాల్పడింది.



ఇంట్లో ఉన్న సంపు

- ఇంట్లో అర్ధరాత్రి సంధ్యారాణి కనిపించకపోడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంటి పరిసరాలను పరిశీలిస్తూ సంపులో వెతకగా సంధ్యారాణి, ఇద్దరు పిల్లల మృతదేహాలు సంపులో కనిపించాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మేనరికపు పెళ్లి వల్లే పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని భావించి ఈ ఘాతుకానికి పాల్పడుతున్నట్లు రాసి ఉన్న సూసైట్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా.. ఈ ఘటనపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

భారతీయ మూలాల్ని విస్మరించొద్దు

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- 'రేవు తిరగబడితే' నవల ఆవిష్కరణ

రాయదుర్గం: పాశ్చాత్య వ్యామోహంతో భారతీయ మూలాల్ని విస్మరించవద్దని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు సూచించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో దళిత, ఆదివాసీ అధ్యయనం, అనువాద కేంద్రం (సిడాస్ట్) ఆధ్వర్యంలో ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి రచించిన 'రేవు తిరగబడితే' నవలను సోమవారం జాకీర్ హుస్సేన్ హాల్‌లో ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. లోపాల్ని సరిచేసుకుంటూ భారతీయ శక్తిని ప్రపంచానికి చాటి చెప్పాల్సిన అవసరం ఎంతో ఉందని వ్యాఖ్యానించారు. స్వరాజ్యం సముపార్జించిన తొలినాళ్ళలో ఇంకా స్వాతంత్ర్యం రాని ప్రజల స్థితిగతులను ఈ నవల ప్రతిబింబిస్తుందన్నారు. సాంఘిక సమానత్వంతో పాటు ఆర్థిక పరిస్థితులు కూడా అందరికీ అందుబాటులోకి రావాలన్నారు. ఎంతో పరిశోధన చేసి ఈ నవల అందించిన ఆచార్య పులికొండ సుబ్బాచారిని అభినందించాలన్నారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, హెచ్‌సీయూ ప్రో.వైస్‌చాన్స్‌లర్ ఆచార్య ఆర్‌ఎస్ సర్రాజు, హెచ్‌సీయూ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, సిటీ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు, పుస్తక రచయిత పులికొండ సుబ్బాచారి, పత్రికా సంపాదకులు కె. శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ, ప్రముఖ కవి డాక్టర్ కొప్పర్తి వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



'రేవు తిరగబడితే' నవలను ఆవిష్కరిస్తున్న వెంకయ్య నాయుడు తదితరులు

సీవీ ఆనంద్ 151 నాటౌట్

సికింద్రాబాద్ క్లబ్ ఘన విజయం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఏ3 డివిజన్ వన్డే లీగ్ చాంపియన్‌షిప్‌ను సికింద్రాబాద్ క్లబ్ జట్టు భారీ విజయంతో ముగించింది. సీజన్ చివరి లీగ్ మ్యాచ్‌లో సికింద్రాబాద్ క్లబ్ 230 పరుగుల తేడాతో బాయ్స్‌టౌన్ జట్టును చిత్తు చేసింది. ముందుగా సికింద్రాబాద్ 35 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 339 పరుగులు సాధించింది. సీవీ ఆనంద్ (88 బంతుల్లో 151 నాటౌట్; 11 ఫోర్లు, 12 సిక్సర్లు) మెరుపు సెంచరీ సాధించగా... సంజీవ్ రెడ్డి (74 నాటౌట్), రాంబాబు (55) రాణించారు. అనంతరం బాయ్స్‌టౌన్ 25.1 ఓవర్లలో 109 పరుగులకే కుప్పకూలింది. మొహమ్మద్ ఖలీల్ 38 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టారు. 2022–23 సీజన్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన సీవీ ఆనంద్ తాను ఆడిన 12 ఇన్నింగ్స్‌లలో 119 సగటుతో 828 పరుగులు సాధించడం విశేషం. ఇందులో 5 అజేయ సెంచరీలు ఉన్నాయి. 7 ఇన్నింగ్స్‌లలో బౌలింగ్ చేసిన ఆనంద్ ఖాతాలో 11 వికెట్లు కూడా ఉన్నాయి.



జీవాన్ష్‌కు జీవం పోయండి!

చిత్రపురి కాలనీలో బాలుడిని ఢీకొన్న కారు

- తలకు తీవ్ర గాయాలతో పరిస్థితి విషమం
- ఆలస్యంగా వెలుగుచూసిన దయనీయ ఘటన
- ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో భర్త మృతి
- ఒక్కగానొక్క కుమారుడు చావు బతుకుల్లో..
- ఆదుకోవాలంటూ మాతృమూర్తి కన్నీరుమున్నీరు
- బాలుడి కుటుంబానికి అండగా నిలుస్తామన్న కేటీఆర్



సీఎంఆర్‌ఎఫ్ గురించి ఎమ్మెల్యేకు ఆస్పత్రి పత్రాలను అందిస్తున్న కౌన్సిలర్ హైమాంజలి

గచ్చిబౌలి: భర్త మరణించిన దుఃఖం నుంచే ఆ ఇల్లాలు ఇంకా కోలుకోలేదు. మరో పిడుగులాంటి వార్త ఆమెను అసహాయురాలిని చేసింది. ఒక్కగానొక్క కుమారుడు కారు ఢీకొని చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండటంతో హృదయ విదారకంగా రోదిస్తున్న ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చిత్రపురి కాలనీలో హెచ్‌ఐజీ–5, ఫ్లాట్ నంబర్ 705లో నివాసం ఉంటున్న వేలూరి జీవాన్ష్ (7) స్నేహితులతో కలిసి హెచ్‌ఐజీ–6, హెచ్‌ఐజీ–7 మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో కలిసి ఆడుకుంటున్నాడు. ఈ నెల 18న సాయంత్రం 6 గంటల సమయంలో సెల్లార్ నుంచి ర్యాంప్‌పైకి వచ్చిన యూకో స్పోర్ట్స్ కారు ఎడమ వైపు మలుపు తిరుగుతూ జీవాన్ష్ తలపైనుంచి ముందు టైరు తాకుతూ వెళ్లింది. అక్కడే ఉన్న మరో బాలుడు వనపర్తి భవీన్ సూర్య కుడి మోకాలు, భుజానికి గాయాలయ్యాయి. జీవాన్ష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో రాయదుర్గంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. జీవాన్ష్ తండ్రి ఈశ్వర్ సాయి చిత్రపురి కాలనీలోని హెచ్‌ఐజీలో మెయింటెనెన్స్ మేనేజర్‌గా పని చేసే వారు. ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో జీవాన్ష్ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. భర్త దూరం కావడంతో కొడుకు చదువు కోసం శ్రావణి ప్రైవేట్ జాబ్ చేస్తోంది. ఇంతలోనే ఒక్కగానొక్క కొడుకు కారు ప్రమాదంతో తీవ్ర గాయాలు కావడంతో దిక్కు తోచని స్థితిలో కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. కుమారుడు లేకుంటే తాను బతకలేనని గుండెలవిసేలా రోదిస్తోంది. జీవాన్ష్ చికిత్సకు రూ.30లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారని, శ్రావణి అంతపెద్ద మొత్తంలో ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉందని బంధువులు తెలిపారు.

జీవాన్ష్‌ను ఆదుకుంటాం: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: చిత్రపురి కాలనీలో కారు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జీవాన్ష్‌ను ఆదుకునేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. తెలిపారు. స్థానిక కౌన్సిలర్ వి.హైమాంజలి అనిల్‌కుమార్ బాలుడి కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి సోమవారం వివరించారు. దాంతో ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా వీలైనంత ఎక్కువ ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామన్నారు. ఇదే సంఘటనపై మంత్రి కేటీఆర్ సైతం స్పందించి బాలుడి కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారని కౌన్సిలర్ తెలిపారు.

క్రీడారంగానికి అధిక ప్రాధాన్యం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో క్రీడారంగానికి అత్యధికంగా నిధులను కేటాయించడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఖేలో తెలంగాణ జీతో తెలంగాణ పేరిట సోమవారం రాత్రి నిజాం కళాశాల మైదానంలో సికింద్రాబాద్ స్పోర్ట్స్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను గుర్తించడం కోసమే దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దీనిని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం వివిధ క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశ్రీ పుల్లెల గోపీచంద్, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ నేతలు మర్రి శశిధర్ రెడ్డి, వివేక్, చింతల రాంచంద్రారెడ్డి, బండా కార్తీకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యూట్యూబ్‌లో చూసి నకిలీ కరెన్సీ తయారీ

- వ్యవస్థీకృతంగా దందా చేస్తున్న అన్న–చెల్లెలు
- సిటీతో పాటు గుజరాత్‌లోనూ నోట్ల మార్పిడి
- గుట్టురట్టు చేసిన సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్
- చెల్లితో పాటు సహకరించిన వ్యక్తికి అరదండాలు
- ప్రస్తుతం గుజరాత్‌లోని జైలులో ఉన్న సూత్రధారి

సాక్షి, సిటీబ్యూరో: అతడి పేరు కస్తూరి రమేష్ బాబు... ఆమె పేరు రామేశ్వరి. అన్నాచెల్లెళ్లు అయిన వీళ్లు యూట్యూబ్ వీడియోల ఆధారంగా నకిలీ కరెన్సీ ముద్రణ, చెలామణిలో దిట్టలు. ఐదు నెలల కాలంలో గోపాలపురం, గుజరాత్‌ల్లో వీరిపై కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం రమేష్ గుజరాత్ జైల్లో ఉండగా... రామేశ్వరి తన అన్న ద్వారా పరిచయమైన హసన్ బిన్ హమూద్‌తో కలిసి ఫేక్ నోట్లు చెలామణి చేయడానికి ప్రయత్నించింది. వీరిద్దరినీ పట్టుకున్న సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.27 లక్షలు నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారని డీసీపీ క్రైమ్స్ డాక్టర్ పి.శబరీష్ తెలిపారు. బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పూర్తి వివరాలు వెల్లడించారు.

అన్న ఆలోచన.. చెల్లెలి తయారీ...

నారాయణపేట్ జిల్లా కోస్గికి చెందిన రమేష్ తన సోదరి రామేశ్వరితో కలిసి బండ్లగూడ జాగీర్‌లోని కాళీ మందిర్ వద్ద కొన్నాళ్లు నివసించాడు. తేలిగ్గా డబ్బు సంపాదించడానికి రమేష్ నకిలీ నోట్లు ముద్రించి చెలామణి చేయాలని నిర్ణయించుకున్నాడు. రామేశ్వరికి కంప్యూటర్ పరిజ్ఞానం ఉండటంతో ల్యాప్‌టాప్, స్కానర్, ప్రింటర్ సాయంతో 2021 నుంచి ఫేక్ కరెన్సీ తయారీ దందా మొదలెట్టారు. యూట్యూబ్‌లో ఉన్న అనేక వీడియోలు చూసిన వీళ్లిద్దరూ నోట్లు తయారు చేయడంతో పాటు ఆ వీడియోల కింద కామెంట్ బాక్స్‌లో 'మాల్ హై హోనా క్యా?' అంటూ రమేష్ కామెంట్ చేసి తన ఫోన్ నెంబర్ ఇచ్చాడు.

మొదటిసారిగా గోపాలపురంలో అరెస్టు...

నాచారంలో సెక్యూరిటీ గార్డుగా పని చేసే సాట్ల అంజయ్య తండ్రి అనారోగ్యానికి గురయ్యాడు. ఆయనకు చికిత్స చేయించడానికి డబ్బు కోసం ఇతడు ఆ వీడియోలు చూశాడు. అలా రమేష్‌ను సంప్రదించి రూ.50 వేలు చెల్లించి రూ.1.3 లక్షల నకిలీ నోట్లు తీసుకున్నాడు. వీటిని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద చెలామని చేస్తూ అంజయ్య పోలీసులకు చిక్కాడు. ఇదే కేసులో రమేష్‌ను గతేడాది సెప్టెంబర్‌లో గోపాలపురం పోలీసులు అరెస్టు చేయగా.. రామేశ్వరి కోర్టు నుంచి బెయిల్ పొందారు. జైల్లో రమేష్‌కు హత్య కేసులో అరెస్టు అయిన ఫలక్‌నుమకు చెందిన ఆటోడ్రైవర్ హసన్‌తో పరిచయమైంది. అక్కడే వీళ్లు నకిలీ కరెన్సీ చెలామణిపై ఓ పథకం వేశారు. ఈ కేసులో బయటకు వచ్చిన రమేష్... రామేశ్వరితో కలిసి తాండూర్‌కు మకాం మార్చాడు. భారీగా నకిలీ కరెన్సీ ముద్రించిన వీళ్లు ఈ ఏడాది జనవరిలో గుజరాత్‌లో మార్పిడికి ప్రయత్నించారు. అక్కడి ముఠా వీరి నుంచి తీసుకున్న నోట్లను చెలామణికి ప్రయత్నించి చిక్కింది. వీరి ద్వారా రమేష్ వ్యవహారం వెలుగులోకి రావడంతో రాజ్‌కోట్ పోలీసులు రమేష్‌ను అరెస్టు చేసి తీసుకువెళ్లారు.

పాతబస్తీలో దాచి మార్పిడికి యత్నం...

రమేష్ ద్వారానే రామేశ్వరికి హసన్ విషయం తెలిసింది. గుజరాత్ పోలీసులు దాడి చేసినప్పుడు మరో గదిలో దాచి ఉంచిన రూ.27 లక్షలు వారికి దొరకలేదు. ఈ మొత్తాన్ని హసన్ వద్దకు తీసుకు వచ్చి దాచిన రామేశ్వరి ఇద్దరూ కలిసి మార్పిడి చేయాలని భావించారు. వీరిద్దరూ ఈ ప్రయత్నాల్లో ఉన్నారనే సమాచారం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్రకు తెలిసింది. ఆయన నేతృత్వం ఎస్సైలు వి.నరేందర్, ఎన్.శ్రీశైలం, షేక్ బుర్హాన్, కె.నర్సింహులు వలపన్ని ఇద్దరినీ పట్టుకుని నకిలీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. రమేష్‌ను గుజరాత్ జైలు నుంచి పీటీ వారెంట్‌పై అరెస్టు చేయనున్నారు. వీళ్లు ఇప్పటి వరకు దాదాపు రూ.కోటి విలువైన నకిలీ నోట్లు మార్చి ఉంటారని అనుమానిస్తున్నారు. గోపాలపురం పోలీసులు రమేష్‌ను పట్టుకున్నప్పుడు అతడి ల్యాప్‌టాప్‌లో రూ.2 వేలతో పాటు రూ.5 వేల నోటు స్కాన్డ్ కాపీని గుర్తించారు. అరుదైన సందర్భాల్లో మాత్రమే ఆర్బీఐ వీటిని ముద్రిస్తుంటుంది.

తెలంగాణలో వైద్య రంగానికి పెద్ద పీట

మంత్రి హరీష్‌రావు



పేట్లబురుజు ఆస్పత్రిలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి హరీష్ రావు

దూద్‌బౌలి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైద్య రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచి కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా సేవలందించే ఏర్పాట్లు చేశామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీష్ రావు అన్నారు. సోమవారం పేట్లబురుజులోని ప్రభుత్వ ఆధునిక ప్రసూతి ఆసుపత్రిలో ఇన్ఫెక్షన్ కంట్రోల్ (సీఎంఈ)పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. త్వరలో 1400 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియమాకాలను చేపట్టనున్నామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గర్భిణుల కోసం అమ్మ ఒడి, కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ కార్యక్రమాలతో పాటు తెలంగాణలోని 33 జిల్లాల్లో 4 లక్షల మంది గర్భిణిలకు న్యూట్రిషియన్ కిట్లను అందజేయనున్నామన్నారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రుల్లో ఇన్ఫెక్షన్లు సోకకుండా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గాంధీ, నిమ్స్ ఆసుపత్రుల్లో త్వరలో 200 బెడ్లతో కూడిన ప్రత్యేక ఎంసీహెచ్ ఆసుపత్రులను ప్రారంభించనున్నామన్నారు. అల్వాల్‌లో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి వైద్య సిబ్బంది రోగులకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని, ఆసుపత్రుల అభివృద్ధికి నిధుల కొరత లేదని..ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీఎంఈ రమేష్ రెడ్డి, డాక్టర్ అజయ్ కుమార్, ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, పేట్లబురుజు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాలతి తదితరులు పాల్గొన్నారు.

సిటీలో 'పెనాంగ్ రోడ్ షో'



సాక్షి, సిటీబ్యూరో: మలేషియాకు చెందిన పెనాంగ్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ బ్యూరో (పీసీఈబీ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 'పెనాంగ్ రోడ్ షో టూ ఇండియా–2023'ను నిర్వహించింది. పీసీఈబీ 6వ ఎడిషన్‌లో భాగంగా ఈ నెల 13వ తేదీన ముంబైలో ప్రారంభమైన ఈ రోడ్ షో ఢిల్లీ, చెన్నై నగరాల మీదుగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పెనాంగ్ టూరిజం, క్రియేటివ్ ఎకానమీ శాఖా మంత్రి యో సూన్ హిన్ మాట్లాడుతూ.. భారత్– మలేషియా మధ్య సంబంధాలను పునరుద్ధరించుకోవడంలో భాగంగా పీసీఈబీ ప్రత్యేక రాయితీలను, ప్యాకేజీలను విడుదల చేయనుందని తెలిపారు. పర్యాటక రంగంతో పాటు ఫార్మా, ఐటీ, బయో ఇంజనీరింగ్ రంగాల్లో వ్యాపార పురోగతికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది పెనాంగ్ వేదికగా 2 వేలకు పైగా ఈవెంట్లను నిర్వహించనున్నామని, ఈ వేడుకల్లో రెండున్నర లక్షల మందికి పైగా ప్రతినిధులకు ఆతిథ్యం అందించే ఏర్పాట్లు చేస్తున్నామని పీసీఈబీ సీఈఓ అశ్విన్ గుణశేఖరన్ పేర్కొన్నారు. ఛలో పెనాంగ్ రోడ్ షోలో అపోలో హాలీడేస్, ఫెంటాస్టిక్ హాలీడేస్, టూరిజం మలేషియా, మలేషియా ఎయిర్‌లైన్స్, మలబార్ రెస్టారెంట్, ఏస్ కాన్ఫరెన్స్ అండ్ ఈవెంట్స్ తదితర సంస్థలు పాల్గొన్నాయి.

నేటి నుంచి దస్తకారీ హాత్ క్రాఫ్ట్స్ బజార్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎన్ఐటీహెచ్ఎం–గచ్చిబౌలి) వేదికగా దేశంలోనే ప్రసిద్ధిగాంచిన దస్తకారీ హాత్ క్రాఫ్ట్స్ బజార్‌ను ఏర్పాటు చేయనున్నామని దస్తకారీ హాత్ సమితి వ్యవస్థాపకురాలు జయా జైట్లీ ఒక ప్రకటనలో తెలిపారు. సిటీలో మొదటిసారిగా నిర్వహిస్తున్న ఈ కళా ప్రదర్శనలో 18 రాష్ట్రాల నుంచి వంద మందికి పైగా సంప్రదాయ భారతీయ హస్తకళాకారులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. హస్తకళల సంరక్షణ, చేతివృత్తులవారి ప్రతిష్టను పెంపొందించడానికి జయ జైట్లీ 40 సంవత్సరాల నుంచి కృషి చేస్తున్నారు. నగరం వేదికగా తొలిసారి దస్తకారీ హాత్ క్రాఫ్ట్స్ బజార్‌ను నిర్వహిస్తున్న సందర్భంగా జయా జైట్లీ మాట్లాడుతూ తెలంగాణలో అద్భుతమైన హస్తకళాకారులు ఉన్నారని, వారిని కలవడానికి ఆతృతగా ఉన్నామని తెలిపారు. ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు దస్తకారీ హాత్ క్రాఫ్ట్స్ బజార్ కొనసాగుతుందని అన్నారు. సున్నితమైన సూఫ్ ఎంబ్రాయిడరీ, చేతితో తయారు చేసిన పేపర్ స్టేషనరీ, సంప్రదాయ పట్టు చీరలు, ఆర్గానిక్ కాటన్ దుస్తులు, నల్ల గృహ అలంకరణ కుండలు, చెక్కతో చేసిన రూపాలంకారాలు, గమ్చా దుస్తులు, చాపలు, బుట్టలు వంటి అనేక రకాల వస్తువులు సందర్శకుల కోసం అందుబాటులో ఉంటాయన్నారు.

పాటల పోటీలకు దరఖాస్తులు ఆహ్వానం



మణికొండ: పాటల పోటీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీహర్షిత, కృష్ణ ప్రసన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాయిస్ ఆఫ్ హైదరాబాద్ 23 బ్యానర్‌పై చైతన్య స్పందన, చైతన్యగీతి వారు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మార్చి 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ పోటీలో పాల్గొనే అభ్యర్థులకు మొదటి రౌండ్ ఆన్‌లైన్‌లో, రెండు, మూడో రౌండ్లు ఆఫ్ లైన్‌లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. మూడో రౌండ్ సీబీఐటీ కళాశాలలో ఉంటుందన్నారు. విజేతలకు రూ.30 వేల ప్రైజ్‌మనీ అందిస్తారన్నారు. ఆసక్తిగల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తమ ప్రతిభను ఈ వేదిక ద్వారా నిరూపించుకోవడానికి సదావకాశమని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 8688286682, 9392 846264 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య



వంశీకృష్ణ (ఫైల్)

చైతన్యపురి: జీవితంలో సెటిల్ కాలేదని మానసిక ఒత్తిడికి గురైన ఓ యువకుడు బలన్మరణానికి పాల్పడిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రమేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం..విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా పనిచేసే దోమలపల్లి నరేందర్, అనురాధ దంపతులు కర్మన్‌ఘాట్ క్రాంతినగర్‌లో నివసిస్తున్నారు. వీరి చిన్నకుమారుడు వంశీకృష్ణ (22) హోటల్ మేనేజ్‌మెంటు కోర్సు పూర్తి చేసి ఉద్యోగాన్వేషణ చేస్తున్నాడు. సరైన ఉద్యోగం రాక పోవటంతో మనస్థాపం చెందాడు. ఆదివారం రాత్రి మొదటి అంతస్తులో నిద్రించాడు. సోమవారం ఉదయం తల్లి వెళ్లి చూడగా వంశీకృష్ణ ఫ్యాన్‌కు దుప్పటితో ఉరేసుకుని ఉన్నాడు. చుట్టుపక్కల వారు వచ్చి కిందకి దించి చూడగా అప్పటికే చనిపోయి వున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కవ్వించే గొంతుతో రూ.కోటి కొట్టేశారు

- ఒకే తరహా మోసం..ఇద్దరు వ్యక్తులతో మాట్లాడింది అమ్మాయే..
- సైబర్‌క్రైం పోలీసుల్ని ఆశ్రయించిన బాధితులు

హిమాయత్‌నగర్: ఓ అమ్మాయి తియ్యని మాటలతో వేర్వేరుగా ఇద్దరితో మాట కలిపింది. టెలిగ్రామ్ వేదికగా కవ్వింపు మాటలు మాట్లాడి కోటీశ్వరులు అయ్యే ఉపాయం చెప్తానన్నది. ఇంకేముంది?..దీనికి అంగీకరించిన ఇద్దరి నుంచి సైబర్ నేరగాళ్లు అందినకాడికి దోచుకున్నారు. ఒకరి నుంచి రూ.56 లక్షలు, మరొకరి నుంచి రూ.51 లక్షలు కాజేశారు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా సోమవారం సిటీ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ కేవీఎం ప్రసాద్ చెప్పారు. బంజారాహిల్స్‌కు చెందిన 58 ఏళ్ల వ్యక్తి ఇటీవల టెలిగ్రామ్ వేదికగా ఓ అమ్మాయి పరిచయమయ్యింది. రెండురోజుల పాటు ఇద్దరూ చాటింగ్ చేస్తూ పరిచయాన్ని కాస్త స్నేహంగా మలుచుకున్నారు. తాను ఇన్వెస్టర్‌ని అంటూ నమ్మబలికింది. నాలా ఇన్వెస్ట్ చేయొచ్చు కదా అంటూ కోరింది. ఆమె మాటలకు బుట్టలో పడ్డ వ్యక్తి ఆమె చెప్పినట్లుగా ఇన్వెస్ట్ చేశాడు. తొలుత రెండు, మూడు పర్యాయాలు లాభాలు ఇచ్చింది. ఆ తర్వాత సుమారు రూ.20 లక్షల వరకు ఇన్వెస్ట్ చేయించి ఒక్క రూపాయి లాభం ఇవ్వలేదు. ఈ రూ.20 లక్షలు రావాలంటే మరికొంత కట్టాలన్నది. ఇలా ఆమె చెప్పినట్లు పలు దఫాలుగా రూ.52 లక్షలు వెచ్చించాడు. మెహదీపట్నంకు చెందిన 30 ఏళ్ల యువకుడికి ఇదే మాదిరిగా ఓ అమ్మాయి పరిచయమైంది. ఇన్వెస్ట్‌మెంట్ నుంచి క్రిప్టో కరెన్సీ వైపు అడుగులు వేయించింది. పలు దఫాలుగా యువకుడి నుంచి రూ.56 లక్షలు స్వాహా చేసింది. ఈ ఇద్దరిదీ ఒకేరకమైన వలపు వల కావడంతో పోలీసులు సైతం అవాక్కయ్యారు. ముక్కూ మొహం తెలియని అమ్మాయి తియ్యగా మాట్లాడితే అన్ని లక్షలు ఎలా ఇస్తారంటూ ఏసీపీ కేవీఎం ప్రసాద్ మందలించారు. వీరిద్దరి వేర్వేరు ఫిర్యాదులతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాఫిక్ సిగ్నళ్ల బ్యాటరీలు చోరీ: ఇద్దరి అరెస్టు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బ్యాటరీలను చూపిస్తున్న సీఐ ప్రసాదరావు

గన్‌ఫౌండ్రీ: ట్రాఫిక్ సిగ్నళ్ల బ్యాటరీలను దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను సోమవారం అబిడ్స్ పోలీసులు అరెస్టు చేశారు. అబిడ్స్ సీఐ ప్రసాద రావు తెలిపిన వివరాల మేరకు.. మహబూబ్‌నగర్, రాజేంద్రనగర్ ప్రాంతాలకు చెందిన షేక్ అజిముద్దీన్, జంగాల మద్దిలేటి నగరంలోని పలు ప్రాంతాల్లో సిగ్నళ్ల నుంచి బ్యాటరీలను దొంగిలించి విక్రయిస్తున్నట్లు తెలిపారు. వీరిపై బేగంబజార్, కాచిగూడ, లంగర్‌హౌస్, బేగంపేట్, హబీబ్‌నగర్, గోపాలపురం, షాహినాయత్‌గంజ్, మలక్‌పేట్, సైఫాబాద్, చైతన్యపురి తదితర పోలీస్‌స్టేషన్లలో 11 ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు వెల్లడించారు. నగరంలో తరచూ ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద బ్యాటరీలు మాయం అవుతుండడంతో నిఘా పెట్టినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నిందితులు అనుమానాస్పదంగా అబిడ్స్ మీదుగా వెళ్తుండగా అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. నిందితుల నుంచి సుమారు రూ.5 లక్షల విలువ గల 26 పెద్ద బ్యాటరీలు, 48 చిన్న బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ, కానిస్టేబుళ్లను సీఐ అభినందించారు.

దేశవాళీ పిస్టల్‌తో తిరుగుతున్న వ్యక్తి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: దేశవాళీ పిస్టల్‌తో తిరుగుతున్న మహారాష్ట్రకు చెందిన ఒక వ్యక్తిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి డీసీపీ శబరీష్ కథనం ప్రకారం.. మహారాష్ట్ర, నాగాపూర్‌కు చెందిన ప్రజ్వల్ హెమరాజ్ బంటి 2017లో విద్యాభ్యాసం కోసం హైదరాబాద్‌కు వచ్చి, అనంతరం ఖైరతాబాద్‌లో నివాసముంటూ 2022లో బంజారాహిల్స్‌లో వన్ స్టూడియో పేరుతో ఒక ఫోటో స్టూడియో ప్రారంభించాడు. గతంలో నాగాపూర్‌లో కొందరితో గొడవలు జరగడంతో కత్తిపోట్ల వరకు వెళ్లింది. దీంతో డిసెంబర్ 2022లో రూ. 63 వేలు చెల్లించి నాగపూర్‌లో గణేష్ జన్మోజయ్ కుటె అనే వ్యక్తి ద్వారా కంట్రీమేడ్ .32 బోర్ పిస్టల్, రెండు ఖాళీ మ్యాగజైన్‌లు, సాయిని ట్రావెల్స్ ద్వారా పార్శిల్ సర్వీస్‌లో తెప్పించుకున్నాడు. డిసెంబర్ చివరి వారంలో రెండు లైవ్ రౌండ్లతో కొంపల్లి అటవీ ప్రాంతానికి వెళ్లి పిస్టల్ పనితీరును పరిశీలించాడు. దీనిపై విశ్వసనీయ సమాచారంతో ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ బృందం ఖైరతాబాద్‌లో అరెస్ట్ చేసి, కంట్రీమేడ్ పిస్టల్, రెండు ఖాళీ మ్యాగజైన్లులను స్వాధీనం చేసుకొని, తదుపరి విచారణ నిమిత్తం పంజగుట్ట పోలీసులకు అప్పగించారు.

పదోన్నతులు పొందిన పోలీసులకు ముగిసిన శిక్షణ..

వివిధ జోన్లకు చెందిన 130 మంది ఏఆర్ విభాగంలోని పదోన్నతి పొందిన కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్లకు పేట్లబురుజులోని సిటీ పోలీస్ శిక్షణ కేంద్రంలో 15 రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా సోమవారం శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. హెడ్‌క్వార్టర్స్‌లో జాయింట్ సీపీ ఎం.శ్రీనివాసులు, శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ మద్దిపాటి శ్రీనివాస్ రావు పాల్గొని తమ అనుభవాలను వారితో పంచుకున్నారు.

అదృశ్యమైన విద్యార్థి.. కుంటలో శవమై..

నెల రోజుల తర్వాత గుర్తింపు



నిఖిల్ కుమార్ (ఫైల్)

శంషాబాద్: కళాశాలకు వెళ్లి అదృశ్యమైన విద్యార్థి ఓ నీటి కుంటలో శవమై తేలిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..పట్టణంలో ఏకే టౌన్‌షిప్‌లో నివాసం ఉండే నిఖిల్‌కుమార్ (16) స్థానికంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. గత నెల 20 ఇంటి నుంచి కళాశాలకు బయలుదేరిన అతడు ఎంతకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం చారీనగర్ కాలనీ సమీపంలోని ఓ నీటికుంటలో శవం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అదృశ్యమైన నిఖిల్‌కు సంబంధించిన ఆనవాళ్ల ద్వారా అతడి శవంగా గుర్తించారు. కుటుంబసభ్యులు కూడా మృతదేహం నిఖిల్‌దిగా గుర్తించారు.

పుర్రె కోసం తంటాలు..

మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండడంతో తొలుత కేవలం మొండెం భాగం మాత్రమే దొరికింది. దీంతో పుర్రెభాగం కోసం పోలీసులు చుట్టుపక్కల తీవ్రంగా వెతికారు. గంటల పాటు శ్రమించిన తర్వాత ఈతగాళ్లు కుంట అడుగుభాగంలోకి వెళ్లి బయటికి తీశారు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. మృతదేహం కుళ్లిపోయిన కారణంగా పుర్రెభాగం విడిపోయినట్లు గుర్తించారు. మానసిక ఒత్తిడి కారణంగా అతడే ఆత్మహత్య చేసుకున్నాడా.. లేక మరేవైనా కారణాలున్నాయా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

ఎస్సీ, ఎస్టీ మహిళా ప్రొఫెసర్ల పట్ల వివక్ష

ప్రొఫెసర్లు వసుమతి, సుష్మ ఆరోపణ

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో ఎస్సీ, ఎస్టీ మహిళా ప్రొఫెసర్ల పట్ల తీవ్ర వివక్ష కొనసాగుతోందని వర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ వసుమతి, సుష్మలు ఆరోపించారు.యూనివర్సిటీలో పోస్టుల విషయమై ఎస్టీ, ఎస్సీ సీనియర్ మహిళా ప్రొఫెసర్లకు అన్యాయం జరుగుతోందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కంటే జూనియర్స్‌కు డైరెక్టర్లుగా, ప్రిన్సిపాల్స్‌గా పోస్టులు ఇస్తున్నారని అన్నారు. సీనియారిటీతో సంబంధం లేకుండా ఇష్టం వచ్చినట్లు పోస్టులు ఇస్తుండటంపై తాము రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తే కనీసం వినతిపత్రం కూడా తీసుకోలేదని పేర్కొన్నారు. వైస్‌చాన్సలర్ తమకు ఇష్టమైన వాళ్లకు పోస్టులు ఇస్తారంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని వాపోయారు. ఇప్పటికీ జేఎన్‌టీయూహెచ్‌లో ఏ విధంగా వివక్ష కొనసాగుతుందో అర్థం చేసుకోవాలన్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై ఎస్సీ, ఎస్టీ, మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

జేఎన్‌టీయూహెచ్ జేఏసీ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న వైస్‌చాన్సలర్ ప్రొ. కట్టా నరసింహారెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో వైస్‌చాన్సలర్ ప్రొ. కట్టా నరసింహారెడ్డి చేతుల మీదుగా సోమవారం జేఎన్‌టీయూహెచ్ జేఏసీ డైరీ ఆవిష్కరించారు. యూనివర్సిటీ రెక్టార్ ప్రొ ఎం.గోవర్ధన్, కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.జయలక్ష్మి టేబుల్ కేలండర్‌ను ఆవిష్కరించారు. డైరీలో భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులు, దేశ, రాష్ట్ర స్థాయిలో యూజీసీ గుర్తింపు పొందిన మెడికల్, ఇంజినీరింగ్ యూనివర్సిటీల సమాచారం, వివిధ సెట్ అర్హతల సమాచారం, హైకోర్టు, ప్రధానకోర్టుల వివరాలు, శాసనసభ పాలకవర్గం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, యస్పీల వివరాలు పొందుపరిచినట్లు జేఏసీ సభ్యులు తెలిపారు. అదే విధంగా యూనివర్సిటీ అధికారులు, అనుబంధ కాలేజీ సమాచారం డైరీలో ఉందని పేర్కొన్నారు. ఈ డైరీ విద్యార్థులు, రాజకీయ నాయకులు, సామాన్య ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బొట్ల భిక్షపతి, అధ్యక్షుడు మంద రంజిత్‌కుమార్, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.సందీప్, ప్రణయ్, అజయ్, సాయిశరత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు రండి



మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ అర్చకులు

బంజారాహిల్స్: ఇందిరానగర్ బస్తీలో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవానికి రావాల్సిందిగా ఆలయ ప్రధాన అర్చకులు మోటుపల్లి కిరణ్‌కుమారాచార్యులు, శేష శైలాచార్యులు సోమవారం మంత్రి హరీశ్‌రావును కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు వేడుకలు జరుగుతాయని ఈ సందర్భంగా అర్చకులు మంత్రికి తెలిపారు.

స్వామిరామానంద తీర్థ సొసైటీ సందర్శన

సనత్‌నగర్: బేగంపేట బ్రాహ్మణవాడీలోని స్వామి రామానందతీర్థ సొసైటీని మహారాష్ట్రకు చెందిన యోగేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు సోమవారం సందర్శించారు. ఇక్కడ నిర్వహించే మోడల్ స్కూల్, మాజీ ప్రధానమంత్రి పీవీ స్మారక గ్రంథాలయంతో పాటు ఆయన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కమిటీ చేస్తున్న సేవలను తెలుసుకుని ప్రశంసించారు. రీసెర్చ్ స్కాలర్స్‌కు ఎంతో మేలు చేకూర్చడంతో పాటు విజ్ఞాన సముపార్జనకు పీవీ స్మారక గ్రంథాలయం వేదికగా నిలవడం పట్ల అభినందనలు తెలిపారు. వారికి కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే వాణీదేవి ఇక్కడి అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో యోగేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ సురేష్ కూర్మలే, సెక్రటరీ జీబీ వ్యాస్, ప్రిన్సిపాల్ రామన్ దేశ్‌పాండే ఉన్నారు.

మంచి మిత్రుడ్ని కోల్పోయా..

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపీనాథ్



సాయన్న అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గోపీనాథ్

రహమత్‌నగర్: ఎమ్మెల్యే సాయన్న మృతితో ఓ మంచి మిత్రుడ్ని కోల్పోయానని బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ వాపోయారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించిన ఆయన తనకు సాయన్నతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సాయన్న కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

మద్యం మత్తులో కారు ప్రమాదం

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు (ఏపీ 39 క్యూఎం 2197)ను నడుపుతున్న ఓ యువకుడు ఆదివారం అర్ధరాత్రి యూసుఫ్‌గూడ చెక్‌పోస్టులో అదుపు తప్పి సెంట్రల్ మీడియన్ పైకి ఎక్కించాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. జూబ్లీహిల్స్ పోలీసులు ఆ కారు ఎవరిది అనే దానిపై ఆరా తీయడంతో పాటు కారు నడిపిన వ్యక్తి కోసం సీసీ ఫుటేజీల ఆధారంగా గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్ విద్యార్థుల దత్తత

- వారి చదువులపై ప్రత్యేక దృష్టి సారించిన ఉపాధ్యాయులు
- ఉదయాన్నే నిద్రలేపి చదివించడం
- ఉదయం, సాయంత్రం స్పెషల్ క్లాస్‌ల నిర్వహణ



గతి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

బంజారాహిల్స్: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి టెన్త్ పరీక్షలు మొదలు కానుండటంతో ఒక వైపు 90 రోజుల ప్రణాళికను అమలు చేస్తూనే.. మరో వైపు ఉదయం, సాయంత్రం వేళల్లో గంట పాటు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు.

- వంద శాతం ఫలితాలు రాబట్టడమే లక్ష్యంగా పెట్టుకున్న బంజారాహిల్స్ రోడ్ నం. 7లోని గతి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులపై మరింత దృష్టి పెట్టారు.
- ఒక్కో ఉపాధ్యాయుడు ఐదుగురు విద్యార్థులను దత్తత తీసుకొని వారి చదివే పూర్తి బాధ్యతలు తమ భుజాలపై వేసుకున్నారు.
- దత్తత తీసుకున్న విద్యార్థికి ఉదయం 5 గంటలకే దత్తత తీసుకున్న టీచర్ ఫోన్ చేసి మేల్కొలిపి చదువుకునేలా చర్యలు తీసుకుంటున్నాడు.
- అదే సమయంలో సదరు విద్యార్థి తల్లిదండ్రులతో కూడా మాట్లాడి కొడుకు చదువుకుంటున్నాడో లేదో పర్యవేక్షించాలని సూచిస్తున్నాడు.
- పోషక విలువలున్న ఆహారం అందించాలని, ఇలా చేస్తే విద్యార్థి ఉదయం నుంచి సాయంత్రం దాకా పాఠశాలలో నీరసించి పోకుండా ఉంటాడని సూచిస్తున్నాడు.
- తప్పనిసరిగా ఉదయం 8 గంటలకు స్కూల్‌కు పంపించాలని తల్లిదండ్రులను అప్రమత్తం చేస్తున్నారు.
- ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు.
- ప్రతి వారం విద్యార్థులకు అంతర్గత పరీక్షలు నిర్వహించి ఏ సబ్జెక్టులో వెనుకబడ్డాడో గుర్తించి, ఆ సబ్జెక్టు టీచర్‌కు మరింత దృష్టి పెట్టాలంటూ సూచిస్తున్నారు.
- దీని ద్వారా పరీక్షల నాటికి ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టుల్లోనూ ముందుండేలా ప్రణాళికలు రూపొందించారు.
- వారానికోసారి పరీక్షలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు పరీక్షలంటే భయం పోగొట్టేలా చేస్తున్నారు.
- ఎవరైనా విద్యార్థి పాఠశాలకు గైర్హాజరైతే ఎందుకు రాలేదని తల్లిదండ్రులను అడిగి తెలుసుకుంటున్నారు.
- విద్యార్థులు చెప్పే కారణం సరైనదా కాదా అనేది తల్లిదండ్రులు చెప్పే కారణంతో పోల్చి చూస్తున్నారు.
- ఇలా చేయడం వల్ల విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరయ్యే అవకాశం లేకుండా పోతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మూర్తి వెల్లడించారు.
- మరోవైపు సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడకుండా ఇక్కడి టీచర్లే బిస్కెట్లు, పండ్లు, ఇతర ఆహారపదార్థాలను అందిస్తున్నారు.
- ఇలా చేయడం వల్ల విద్యార్థులు గంట పాటు తరగతి గదిలో నీరసించిపోకుండా ఉండేందుకు వీలవుతుందని ఆయన తెలిపారు.
- మరో రెండు, మూడు రోజుల్లో మధ్యాహ్న భోజనం సరఫరా చేసే ఏజెన్సీ అల్పాహారాన్ని అందించేందుకు ముందుకు వచ్చిందని ఆయన పేర్కొన్నారు.
- విద్యార్థులు ఎలా చదువుతున్నారు అనేది తల్లిదండ్రులకు కూడా తెలియాలన్న ఉద్దేశంతో వారి సమావేశం కూడా నిర్వహిస్తామని తెలిపారు.

విజయారెడ్డికి అదనపు బాధ్యతలు



బంజారాహిల్స్: వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ తగిన వ్యూహరచన సిద్ధం చేసి నియోజక వర్గాల్లో పార్టీ బలోపేతంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా టీపీసీసీ జనరల్ సెక్రటరీలకు ఒక్కొక్కరికి రెండు నియోజక వర్గాల చొప్పున బాధ్యతలు అప్పగించి ఆ నియోజక వర్గాల్లో పార్టీని బలోపేతం చేసి నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం తీసుకురావాలని సూచించింది. ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకురాలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డికి శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజక వర్గాల బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజక వర్గాల్లో పార్టీని సమన్వయం చేస్తూ ప్రజలకు మరింత చేరువయ్యే దిశలో బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత బాధ్యతాయుతంగా ముందుకు వెళ్తానని విజయా రెడ్డి అన్నారు.

'ఐక్యతకు భంగం కల్గించేందుకే అభివృద్ధి కమిటీ'

రహమత్‌నగర్: బస్తీ అభివృద్ధి కమిటీ ఏర్పాటును తాము వ్యతిరేకిస్తున్నామని ఎస్పీఆర్ హిల్స్ రాజీవ్ గాంధీనగర్ బస్తీ నాయకులు స్పష్టం చేశారు. కొంత మంది కావాలనే అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి బస్తీవాసుల ఐక్యతకు భంగం కలిగిస్తున్నారని బస్తీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు శాంతకుమార్, ఉపాధ్యక్షులు మూర్తి, కుమార్, కురుమయ్య, బాలు తదితరులు ఆరోపించారు. రాజీవ్‌గాంధీనగర్‌లో సోమవారం వారు మాట్లాడుతూ, బస్తీవాసుల సమక్షంలోనే వెల్ఫేర్ కమిటీని ఎన్నుకున్నామని, ఇప్పుడు అభివృద్ధి కమిటీ ఏర్పాటులో ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. ఆ కమిటీ చెల్లదని వారు స్పష్టం చేశారు. వెల్ఫేర్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ, ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, నాయకులు లక్ష్మయ్య, నరసింహ, గంగాధర్, బాలరాజ్, రామ్‌చందర్ పాల్గొన్నారు.

త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయండి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం.10లోని బంజారా భవన్ లైన్‌లో రూ. 12.91 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన వీడీసీసీ రోడ్డు పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పరిశీలించారు. ఇక్కడ రోడ్డు పనులు పూర్తయితే స్థానికుల రాకపోకలతో పాటు బంజారా భవన్‌కు వచ్చే వారికి కూడా మార్గం తేలికవుతుందని అన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ పనులు పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు.

25న స్టీల్ మ్యాన్ క్లాసిక్ బాడీబిల్డింగ్ పోటీలు



సాక్షి, సిటీబ్యూరో: యువ బాడీబిల్డర్లను ప్రోత్సహించేందుకు మిస్టర్ ఇండియా సిల్వర్ మెడలిస్ట్ శివ కుమార్, మిస్టర్ వరల్డ్ రాహుల్ స్టీల్ మ్యాన్ క్లాసిక్ బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 25న సోమాజిగూడ జయా గార్డెన్స్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. పలు రాష్ట్రాల నుంచి 200 మందికి పైగా బాడీ బిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఐదు కేటగిరీల్లో 10 విభిన్న వెయిట్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని అర్గనైజింగ్ కమిటీ మెంబర్, సోమాజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు మొత్తం రూ.5 లక్షల ప్రైజ్ మనీ ఇస్తామన్నారు. కాగా, ఇటీవల వరంగల్‌లో జరిగిన కేసీఆర్ కప్ మిస్టర్ తెలంగాణ టైటిల్ గెలిచిన శివకుమార్‌ను పలువురు అభినందించారు.

ఫైర్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన

బంజారాహిల్స్: అగ్ని ప్రమాదం జరిగితే ఘటనా స్థలం నుంచి ఎలా బయటికి రావాలి, డీఆర్ఎఫ్ సిబ్బంది బాధితులను ఎలా బయటికి తీసుకొస్తారు అనే అంశాలను విద్యార్థులకు వివరించారు. సోమవారం సోమాజిగూడ రాజ్‌భవన్ హైస్కూల్‌లో జీహెచ్ఎంసీ ఈవీడీఎం డీఆర్ఎఫ్ సిబ్బంది ఫైర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే దానిపై అవగాహన పెంచుకున్నారు. పై అంతస్తుల నుంచి బాధితులను కిందకు క్షేమంగా ఎలా తీసుకొస్తారో డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.

పని చేయని వారిని పక్కన పెడదాం

పీసీసీ వైస్ ప్రెసిడెంట్ వినోద్‌రెడ్డి



సమావేశానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ నేతలు

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం పనిచేయని వారిని పక్కనపెట్టి పనిచేసే వారికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పీసీసీ వైస్ ప్రెసిడెంట్ మిట్టకంటి వినోద్‌రెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇంటింటికీ వెళ్తూ కాంగ్రెస్ పార్టీ విశిష్టతను చాటి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం నియోజకవర్గంలోని ఆరు డివిజన్ల నాయకుల సమావేశాన్ని హిమాయత్‌నగర్‌లోని వినోద్‌రెడ్డి ఇంట్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అందరం ఏకతాటిపైకి వచ్చి ఒకేరీతిగా పనిచేస్తేనే పార్టీ గుర్తింపు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తుందన్నారు. కేవలం పార్టీ పదవులకు మాత్రమే పనిచేసే చిన్నా చితకా వారిని పక్కన పెట్టి పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు పదవులను ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతంలో నిర్వహించే హాత్ సే హాత్ యాత్ర విజయవంతానికి ఇప్పటి నుంచే కసరత్తు అవసరమన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రెసిడెంట్ రోహిణ్‌రెడ్డి, ఆరు డివిజన్ల ప్రెసిడెంట్లు, రెండు బ్లాక్‌ల ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌బీ మహాసభలను జయప్రదం చేయాలి



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఏఐఎఫ్‌బీ ప్రతినిధులు

బంజారాహిల్స్: ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పార్టీ 19వ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని పార్టీ నాయకులు కోరారు. మహాసభల గోడ పత్రికను సోమవారం పంజగుట్ట నేతాజీ భవన్‌లో ఆ పార్టీ జాతీయ కార్యదర్శి జ్యోతి రంజన్ మహాపాత్ర, జాతీయ కమిటీ సభ్యులు పీవీ సుందర్‌రామరాజు, జోజిరెడ్డి, రామరాజు, సయ్యద్ తౌఫిక్ అలీ, కె.వెంకటేష్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశం నలుమూలల నుంచి పార్టీ నేతలు ఈ మహాసభలకు తరలి వస్తున్నారని, దేశానికి దిక్సూచిగా నిలిచేలా ఈ మహాసభ కొనసాగనుందన్నారు. అదానీ అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ చేపట్టాలని ఈ సందర్భంగా జ్యోతి రంజన్ మహాపాత్ర డిమాండ్ చేశారు. ఆర్థిక నేరాలకు ప్రతినిధిగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నారు. తక్షణమే అదానీని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

యువతకు అవకాశాలు కల్పించడమే లక్ష్యం




బాక్స్ ఎన్ ఫ్రైట్ సంస్థ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

బంజారాహిల్స్: లాజిస్టిక్స్ రంగంలో వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా తమ సంస్థ ముందుకు సాగుతున్నదని బాక్స్ ఎన్ ఫ్రైట్ సంస్థ చైర్మన్ నిమేష్ కొటేజా అన్నారు. జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో జరిగిన సంస్థ ఉద్యోగుల సమావేశంలో ఆయన తెలంగాణ, ఏపీ జోనల్ హెడ్ వశిష్ఠ శాస్త్రి, జీఎం వెంకట్ నాయుడుతో కలిసి సంస్థ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ నిమేష్ మాట్లాడుతూ, లాజిస్టిక్స్ రంగంలో అపార అవకాశాలున్నాయని, ఈ రంగంలోకి రావాలనుకుంటున్న యువతను తాము ప్రోత్సహిస్తున్నామన్నారు. ఏడాది క్రితం ప్రారంభమైన తమ సంస్థ అతి తక్కువ సమయంలో 250 మంది నిరుద్యోగులను అసోసియేట్లుగా నియమించుకొని కొనసాగుతోందన్నారు. మరో ఏడాదిలో 8 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించామని నిమేష్ తెలిపారు.

'ఖేల్ తెలంగాణ'కు జూబ్లీహిల్స్ నుంచి 77 జట్లు

రహమత్‌నగర్: ఖేల్ తెలంగాణ, జీత్ తెలంగాణ సికింద్రాబాద్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో జూబ్లీహిల్స్ నియోజక వర్గం నుంచి 77 జట్లు పాల్గొంటున్నాయని జూబ్లీహిల్స్ బీజేపీ నాయకుడు లంకాల దీపక్ రెడ్డి తెలిపారు. ఎస్పీఆర్ హిల్స్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే ఈ పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, ,క్రికెట్‌తో పాటు ఇతర ఆటల ఉంటాయన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలకు నగదుతో పాటు, పార్లమెంటు స్థాయిలో 50 బహుమతులు, అసెంబ్లీ స్థాయిలో 120 బహుమతులు అందజేస్తారన్నారు. జూబ్లీహిల్స్ బీజేపీ కన్వీనర్ కుంబాల గంగారాజు, కోఆర్డినేటర్ ప్రేమ్, అధికార ప్రతినిధి కౌలస్ సత్యనారాయణ, సుప్రియగౌడ్, నీలం రతన్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

ఇంద్రజిత్ గుప్తా, గోవింద్ పన్సారే సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హిమాయత్‌నగర్: దేశానికి మరచిపోలేని సేవలు, త్యాగాలు చేసిన భారతీయుల తరంలో చివరి వ్యక్తులు గొప్ప కమ్యూనిస్టు యోధులు ఇంద్రజిత్ గుప్తా, గోవింద్ పన్సారేలు అని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి కొనియాడారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఇంద్రజిత్ గుప్తా 22వ వర్ధంతి, గోవింద్ పన్సారే 8వ వర్ధంతి సందర్భంగా హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో సోమవారం వారి చిత్రపటాలకు సీపీఐ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ, పార్లమెంట్‌లో అత్యంత చురుకైన విమర్శకులలో ఇంద్రజిత్ గుప్తా ఒకరని, 'ఫాదర్ ఆఫ్ ది హౌస్' అని ఆయనను పిలిచేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఈటి. నరసింహ, పి. ప్రేమపావని, ఎస్. ఛాయాదేవి, కమతం యాదగిరి, బి.స్టాలిన్, నిర్లేకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్, కలకొండ కాంతయ్య, లక్ష్మీ నారాయణ, ఆరుట్ల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

బస్తీల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు

రహమత్‌నగర్: ఎస్పీఆర్ హిల్స్ నవీన్‌నగర్‌లో సోమవారం స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి జలమండలి మేనేజర్ రాజేందర్‌తో కలిసి పర్యటించారు. స్థానికులను అడిగి తాగునీటి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్పీఆర్ హిల్స్‌లో ఏర్పాటవుతున్న కొత్త రిజర్వాయర్‌తో ఈ ప్రాంతంలోని నీటి సమస్య పూర్తిగా తొలగిపోతుందన్నారు. బస్తీల్లోని మౌలిక సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బీఆర్ఎస్ నాయకులు విజయ్‌కిరణ్, లింగమూర్తి, గద్వాల రఘు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అధునాతన పద్ధతుల్లో పాఠాలు బోధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతారామారావు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, పరిశోధకులకు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఔట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ టీచింగ్ లెర్నింగ్ అనే అంశంపై రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్న విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. సీతారామారావు మాట్లాడుతూ, తక్కువ సమయంలో అధునాతన పద్ధతుల్లో విద్యార్థికి సమగ్రంగా అర్థమయ్యేలా పాఠాలు ఎలా బోధించాలి అనేది అధ్యాపకులకు నిరంతర అధ్యయనం, పరిశోధనల వల్లే సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఒక వైపు సాంకేతిక పరిజ్ఞానం పరుగులు పెడుతుంటే మరోవైపు మూసపద్ధతుల్లో విద్యాబోధన సరైంది కాదన్నారు. నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా అధ్యాపకులు నైపుణ్యం సాధించాలని సూచించారు. పరిశోధన అంశాలను ఛాట్ జీపీటీ లాంటివి మరింత ప్రభావితం చూపనున్నాయని, తద్వారా పరిశోధనలపైనా అనుమానాలు రేకెత్తే అవకాశాలున్నాయన్నారు. ఇలాంటి సవాళ్లను ఎదుర్కోవడానికి అధ్యాపకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ ఇన్‌చార్జి అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధారాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఏవీఎస్.రెడ్డి, ఐ.ఆనంద్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ వీసీ ఘెరావ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.రవీందర్‌ను పీహెచ్‌డీ అభ్యర్థులు ఘెరావ్ చేశారు. సోమవారం క్యాంపస్‌లోని ఠాగూర్ జరిగిన కార్యక్రమానికి హాజరై ఓయూలో పరిశోధనలకు పెద్దపీట వేస్తున్నామని మాట్లాడుతుండగా పీహెచ్‌డీ అభ్యర్థులు వీసీ ప్రసంగానికి అడ్డుతగిలి ఎంతమందికి పీహెచ్‌డీ సీట్లు ఇచ్చారని గొడవకు దిగారు. అప్రమత్తమైన పోలీసులు విద్యార్థులను సముదాయించి కూర్చోబెట్టారు. కార్యక్రమం ముగించుకొని బయటికి వెళ్తున్న వీసీని వెళ్లనివ్వకుండా అడ్డుకొని పీహెచ్‌డీ అర్హత మార్కుల తగ్గింపు విషయమై స్పష్టత ఇవ్వాలని నినాదాలు చేశారు. పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది సహకారంతో వీసీ వెళ్లిపోయారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు షురూ



ధ్వజారోహణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పెద్ద శేష వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా మొదటి రోజు ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తుల మధ్య కనుల పండువగా నిర్వహించారు.

పెద్ద శేష వాహన సేవ...

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు సోమవారం సాయంత్రం పెద్ద శేషవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. డప్పుచప్పుళ్లు కోలాటల నడుమ ఉత్సాహభరిత వాతావరణంలో ఊరేగింపు కొనసాగింది. సర్పరాజైన ఆదిశేషువు జగన్నాథునికి నివాస భూమిగా, తల్పంగా, సింహాసనంగా స్వామివారికి విశేష సేవలందించనట్లు పురాణాలు చెబుతున్నాయి. అందువల్లే స్వామివారి బ్రహ్మోత్సవ వాహన సేవల్లో తొలి ప్రాధాన్యత ఆదిశేషునికే ఇచ్చినట్లు అర్చకులు తెలిపారు. స్వామి వారి దాసభక్తికి మారురూపంగా నిలిచే తన ప్రియభక్తుడైన ఆదిశేషుడిపై ఉభయ దేవేరులతో కూడి ఊరేగిన స్వామివారిని చూసి భక్తులు తరించిపోయారు.

గన్నవరం రణరంగం

- ఎమ్మెల్యే వంశీపై అసభ్య పదజాలంతో విరుచుకుపడిన టీడీపీ నేతలు
- దీనిపై నిరసన తెలిపిన వంశీ అభిమానులపై పట్టాభి, ఆయన అనుచరుల వీరంగం
- కర్రలు, రాళ్లతో దాడి.. గన్నవరం టౌన్ సీఐకి తీవ్ర గాయం

సాక్షి ప్రతినిధి, విజయవాడ/గన్నవరం: ఏపీలోని కృష్ణా జిల్లా గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను లక్ష్యంగా చేసుకుని మూడు రోజులుగా టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి, ఆ పార్టీ నియోజకవర్గ నేతలు చేస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారి తీశాయి. టీడీపీ నేతల వైఖరికి నిరసన తెలుపుతూ ఆ పార్టీ కార్యాలయం వద్దకు వెళ్లిన వంశీ అభిమానులు, అనుచరులపై టీడీపీ నేతలు దాడికి దిగారు. రాళ్లు విసురుతూ, జెండా కర్రలతో బాదడం మొదలుపెట్టారు. దీనిపై స్పందించిన వంశీ అభిమానులు ఆత్మరక్షణ కోసం ప్రతిఘటించడంతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు అప్రమత్తమై ఇరువర్గాలను నియంత్రించేందుకు తీవ్రంగా శ్రమించారు. ఈ క్రమంలో టీడీపీ నేత విసిరిన రాయి తగలడంతో సీఐ పి.కనకరావు తలకు తీవ్ర గాయమైంది. పోలీసులు ఆయనను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు ఏడు కుట్లు వేశారు. డీఎస్పీ కె.వి జయపాల్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో పోలీస్ బలగాలను అక్కడ మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి గన్నవరంలో ఓ గుంపును వెనకేసుకుని తిరుగుతూ.. రెచ్చగొట్టడం, దాడికి దిగడమే ఘర్షణకు కారణమని ప్రత్యక్ష సాక్షులు చెప్పున్నారు. ఈ క్రమంలో వారు పోలీసులపై కూడా ఉద్దేశపూర్వకంగా దాడికి దిగారని వివరిస్తున్నారు.

నా పని నేను చేసుకుంటున్నా..: ఎమ్మెల్యే వంశీ

తాను గన్నవరం నియోజకవర్గంలో గడప గడపకు తిరుగుతూ తన పని తాను చేసుకుంటున్నానని.. టీడీపీ నాయకులు కావాలని అసత్య ఆరోపణలతో రెచ్చగొడుతూ దాడులకుదిగారని ఎమ్మెల్యే వంశీమోహన్ చెప్పారు. బయటి నుంచి టీడీపీ నాయకులు వచ్చి గన్నవరం ప్రజలను రెచ్చగొట్టడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు.

త్రిశూల చక్రతీర్థ స్నానం.. పోటెత్తిన భక్తజనం



శ్రీకాకుళం జిల్లాలోని ప్రఖ్యాత శ్రీముఖలింగం పుణ్యక్షేత్రంలో సోమవారం స్వామి త్రిశూల చక్రతీర్థ స్నానం ఘనంగా జరిగింది. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు నిర్వహించిన ఈ క్రతువుకు భక్తులు పోటెత్తారు. - జలుమూరు

గొప్పగా.. గర్వంగా!



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మునుపెన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయం అమలు చేస్తున్నాం: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- ఎమ్మెల్సీలుగా 18 మంది పేర్లు ఖరారు.. వీరిలో 14 మంది బీసీ, ఎస్టీ, ఎస్సీలే
- మిగిలిన 4 సీట్లలో ఒక్కో సామాజిక వర్గానికి ఒక్కొక్కటి
- మనం చేస్తున్న సామాజిక న్యాయాన్ని ప్రతి గడపకూ చెప్పాలి
- నేను చేయాల్సింది చేశా.. ఇవ్వాల్సింది ఇచ్చా.. ఇక మీ బాధ్యత నెరవేర్చండి
- స్థానిక సంస్థలు, ఎమ్మెల్యే, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులతో సీఎం సమావేశం

సాక్షి, అమరావతి: మునుపెన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయాన్ని అమలు చేస్తున్నామని, ఇంత గొప్పగా ఎప్పుడూ జరగలేదని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మనం చేసిన సామాజిక న్యాయాన్ని ప్రతి నియోజకవర్గంలో వినిపించాలని, ప్రతి గడపకూ చేరవేయాలని ఎమ్మెల్సీ అభ్యర్థులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ తరఫున స్థానిక సంస్థల కోటా, ఎమ్మెల్యే కోటా, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించిన వారితో సీఎం జగన్ సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఏమన్నారంటే..

సుదీర్ఘ కసరత్తు అనంతరం..

గతంలో ఎప్పుడూ చూడనంత, జరగనంత సామాజిక న్యాయాన్ని దేవుడి దయతో మన పార్టీలో చేయగలుగుతున్నామని గర్వంగా చెప్పుకునే గొప్ప పరిస్థితుల్లోకి వచ్చాం. ఇవాళ చాలా సుదీర్ఘ కసరత్తు అనంతరం 18 మందిని ఖరారు చేస్తే వారిలో 14 మంది బీసీ, ఎస్టీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వారే. ఇంత గొప్పగా సామాజిక న్యాయం ఎప్పుడూ జరగలేదు. మిగిలిన సామాజిక వర్గాలకు నాలుగు సీట్లిస్తే అందులో కూడా ఒక్కో సామాజిక వర్గానికి ఒకటి చొప్పున కేటాయించాం. మనం చేస్తున్న సామాజిక న్యాయం ప్రతి గడపకూ తెలియాలి, ప్రతి నియోజకవర్గంలోనూ చెప్పాలి.

రాజకీయాల్లో గొప్ప మార్పు

రాజకీయాల్లో ఇంత గొప్ప మార్పు ఎప్పుడూ జరగలేదు. పారదర్శకంగా బటన్ నొక్కి లంచాలకు తావు లేకుండా నేరుగా లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్నాం. విద్య, వ్యవసాయం, ఆరోగ్య రంగాల్లో మంచి మార్పులు తెచ్చాం. అవన్నీ ఒక ఎత్తు అయితే ఈరోజు మనం చేసిన సామాజిక న్యాయం మరో ఎత్తు.

దీటుగా, మరింత దూకుడుగా..

పదవులు పొందిన వారు పార్టీని బలోపేతం చేయాలి. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాల్లో యాక్టివ్‌గా ఉండాలి. ఇది చాలా ముఖ్యమైన అంశం. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 లాంటివి ఒక్కటై లేనిపోని విష ప్రచారం చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మనం కూడా అంతే దీటుగా, యాక్టివ్‌గా, మరింత దూకుడుగా పనిచేయడం ద్వారా మన వాణిని సమర్థంగా వినిపించాలి.

మీ నుంచి కోరుకునేది అదే..

మరో 13 – 14 నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి. ఎమ్మెల్సీలుగా బాధ్యతలు స్వీకరించనున్నవారు పార్టీ కోసం ఏం చేయగలుగుతాం? అన్న ఆలోచనతో అడుగులు వేయాలి. నేను చేయాల్సింది చేశాను... మీకు ఇవ్వాల్సిన పదవులు ఇచ్చా. ఇక పార్టీకి ఏ రకంగా మంచి చేయాలనే కీలక బాధ్యతలు మీపై ఉన్నాయని గుర్తుంచుకోవాలి. మీ తరఫు నుంచి నేను అదే కోరుకుంటున్నా. మరింత ఉత్సాహంగా ఉండాలని అందరినీ కోరుతున్నా. పదవులు పొందుతున్న వారందరికీ మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా.

వారిని కన్విన్స్ చేసుకుంటూ వెళ్లాలి

ఈ పదవులను ఆశించిన వారు ఇంకా చాలా మంది ఉన్నారు. ఉన్న పదవులు తక్కువ, ఆశావహులు ఎక్కువగా ఉంటారు కాబట్టి అందర్నీ సంతృప్తి పరచలేం. కొద్దో గొప్పో కొరత ఉంటుంది. వీరందరికీ కూడా చెప్పే రీతిలో నచ్చచెబుతూ, కన్విన్స్ చేసుకుంటూ వెళ్లాలి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి ప్రజల పక్షాన నిలబడి రాజకీయాలు చేశాం. అధికారంలోకి వచ్చాం. దేవుడి దయతో మంచి పరిపాలన కొనసాగుతోంది. వచ్చే ఎన్నికల్లో 175కి 175 స్థానాలు వై నాట్? అనే రీతిలో అడుగులు ముందుకు వేస్తూ పాలన కొనసాగుతోంది.

మిగతా వారికి ఈసారి

దేవుడు ఆశీర్వదిస్తే గత ఎన్నికల కంటే ఈసారి అత్యధిక స్థానాలు సాధిస్తాం. ఇంకా చాలా మందికి రాబోయే రోజుల్లో ఎక్కువ అవకాశాలు వస్తాయి. చంద్రబాబు అరకొర పదవులిచ్చి బీసీలకు అన్నీ చేసినట్లు ప్రచారం చేసుకోవటాన్ని మనం చూశాం. ఈసారి మనం వడ్డీలు, వడ్డెర కులాల వారికి అవకాశం ఇచ్చాం. రజకులు, నాయీ బ్రాహ్మణులు, ఇంకా మిగిలిన కులాలకు తదుపరి దఫాలో తప్పకుండా అవకాశం ఇస్తామని భరోసా ఇస్తున్నాం.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే

- మొత్తం 18 మంది అభ్యర్థులను ప్రకటించిన వైఎస్సార్‌సీపీ
- బీసీలకు 11, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, ఓసీలకు 4 కేటాయింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసనమండలిలో ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న 9 స్థానిక సంస్థల నియోజకవర్గాలతో పాటు.. ఎమ్మెల్యే కోటాలో ఖాళీ కానున్న 7 స్థానాలకు వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఖరారు చేశారు. గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న రెండు స్థానాలకు సంబంధించిన అభ్యర్థులను కూడా సీఎం వైఎస్ జగన్ ప్రతిపాదించారు. మొత్తం 18 మంది అభ్యర్థుల వివరాలను వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాకు వెల్లడించారు. బీసీలకు 11, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, ఓసీలకు 4 కేటాయించారు.

సామాజిక వర్గాల వారీగా ఎమ్మెల్సీ అభ్యర్థులు

కోటా	బీసీ	ఎస్సీ	ఎస్టీ	ఓసీ	మొత్తం
స్థానిక సంస్థలు	6	1	0	2	9
ఎమ్మెల్యేల కోటా	4	1	0	2	7
గవర్నర్ కోటా	1	0	1	0	2
మొత్తం	11	2	1	4	18

స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు

నర్తు రామారావు
కుడిపూడి సూర్యనారాయణ
వంకా రవీంద్రనాథ్
కవురు శ్రీనివాస్
మేరుగ మురళీధర్
సిపాయి సుబ్రమణ్యం
పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి
ఎ.మధుసూదన్
ఎస్.మంగమ్మ

ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు

పీవీ సూర్యనారాయణరాజు పెన్మత్స
పోతుల సునీత
కోలా గురువులు
బొమ్మి ఇజ్రాయెల్
జయమంగళ వెంకటరమణ
చంద్రగిరి ఏసురత్నం
మర్రి రాజశేఖర్

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ప్రతిపాదించిన అభ్యర్థులు

కుంభా రవిబాబు
కర్రి పద్మశ్రీ

మరో బీసీ విప్లవం

18 ఎమ్మెల్సీ స్థానాలకుగానూ 14 బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకే.. నాలుగు ఓసీలకు

- సీఎం జగన్ ఆవిష్కరించిన సామాజిక మహావిప్లవంలో మేలిమలుపు
- ప్రస్తుతం శాసనమండలిలో వైఎస్సార్‌సీపీ బలం 26
- స్థానిక సంస్థలు, శాసనసభలో అధికార పార్టీకి తిరుగులేని ఆధిక్యం
- మండలిలో 44కి పెరగనున్న బలం.. అందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే 30 మంది
- మండలిలో వైఎస్సార్‌సీపీ సభ్యుల్లో ఆయా వర్గాలది 68.18 శాతం
- ఉమ్మడి రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో ఆ వర్గాలకు ప్రాతినిధ్యం దక్కలేదు
- నాడు మండలిలో టీడీపీకి 48 మంది ఉంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు 18 మందికే అవకాశం.. వీరిని 37.5 శాతానికే పరిమితం చేసిన చంద్రబాబు
- గత 44 నెలలుగా సామాజిక సాధికారత దిశగా నిబద్ధతతో సీఎం జగన్ అడుగులు
- సామాజిక సాధికారత సాధనలో దేశానికే రోల్ మోడల్

స్టార్టప్స్ కేంద్రంగా విశాఖ

- 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త భవనం
- 2023–28 నూతన పారిశ్రామిక విధానంపై సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం
- ఆలోచన నుంచి ఆరంభం దాకా చేయి పట్టుకుని నడిపిద్దాం
- రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందించేలా చర్యలు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నగర వార్తలు

టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆర్.కృష్ణయ్య వినతి



సీఎస్‌కు వివరిస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

కాచిగూడ: పీఆర్‌సీ నివేదిక మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో రిటైర్మెంట్ వల్ల ఏర్పడ్డ 24 వేల ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. సోమవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. గ్రూపు–1, గ్రూప్–2, గ్రూప్ –3, గ్రూప్–4 నోటిఫికేషన్లతో పాటు అన్ని కేటగిరీల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేశారన్నారు. అయితే ముఖ్యమైన, ప్రాధాన్యత ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వ లేదన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని టీచర్ పోస్టుల భర్తీకై నోటిఫికేషన్ జారీ చేసేలా తగు చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు విజ్ఞప్తి చేశారు. ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 4900 పోస్టులు భర్తీ చేయాలన్నారు. గత 25 సంవత్సరాలుగా ఎయిడెడ్ టీచర్ పోస్టులను భర్తీ చేయడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 12 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించారని, ఇంత వరకు నోటిఫికేషన్ జారీ చేయలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 10 వేల పీఈటీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల్లో గత 20 సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న 5 వేల ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ప్రతి ఉన్నత పాఠశాలకు ఒక కంప్యూటర్ చొప్పున 4 వేల ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు పంపించారని, ఇంత వరకు కంప్యూటర్ టీచర్లను నియమించలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలకు ఒక జూనియర్ అసిస్టెంట్ ఉండాలని, 25 సంవత్సరాలుగా జూనియర్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయడం లేదని గుర్తుచేశారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 15 వేల అటెండర్, స్వీపర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో టీచర్ పోస్టుల భర్తీ ఒకే సమయంలో జరగాలన్నారు. చాలా మందికి రెండింటిలో ఉద్యోగం వస్తుందని, ఒకే జాబ్ సెలెక్టు చేసుకునేలా ఆప్షన్ ఇవ్వాలని, అప్పుడే మొత్తం ఉద్యోగాలు భర్తీ అవుతాయన్నారు. నేతలు గుజ్జ కృష్ణ, ఎర్ర సత్యం, భూపేష్ సాగర్, సుధాకర్, మన్నారం నాగరాజు, సత్యం, వీరస్వామి, నర్సింహగౌడ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఛాయాదేవి

హిమాయత్‌నగర్: సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శిగా ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శిగా కమతం యాదగిరి నియమితులయ్యారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. హైదరాబాద్ జిల్లా స్థాయిలో మహిళా కార్యదర్శిగా నియమితులు కావడం ఇదే మొదటిసారి. పార్టీ అభ్యున్నతికి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఛాయాదేవి తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా కార్యదర్శిగా కొనసాగిన ఇ.టి.నరసింహ జాతీయ సభ్యుడిగా నియమితులయ్యారు.

లోకో పైలట్ సుప్రియాసనుమ్ యువతకు స్ఫూర్తి



సుప్రియాసనుమ్‌ను సత్కరిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: తెలంగాణ తొలి మహిళా మెట్రో రైల్ లోకో పైలట్ సుప్రియాసనుమ్‌ను సోమవారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా నాగోలులోని తన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... యువత ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రో రైల్‌లో లోక్ పైలట్‌గా పనిచేస్తూ అందరి మన్ననలు పొందిన సుప్రియను అభినందించారు. సుప్రియ ఓ సామాన్య కుటుంబం నుంచి వచ్చి చిన్న వయస్సులోనే కష్టపడి తన లక్ష్యం నేరవేర్చుకుందన్నారు. సుప్రియాసునుమ్ చాలా శక్తివంతమైన మహిళ అని పేర్కొన్నారు. విద్యార్థినులు, మహిళలు అమెను స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.


బీజేపీ అధికారంలోకొస్తే పేదలకు భూములు, ఇళ్లు

- బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే ఈటల రాజేందర్



నాగోలు: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత పేదలకు భూములు ఇచ్చుడేమోగానీ గడచిన నాలుగు దశాబ్దాలుగా పేదల ఆధీనంలో ఉన్న భూములను టీఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకుంటోందని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ప్రజాగోస–బీజేపీ భరోసా, బీజేపీ కార్నర్ మీటింగ్‌లను నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ఆధ్వర్యంలో నాగోలు చౌరస్తాలో, బీజేపీ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం హస్తినాపురం చౌరస్తాలో నిర్వహించారు. ఆయా సమావేశాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈటల రాజేందర్ మాట్లాడుతూ... 'పల్లెల్లో ఉపాధి లేక వేల మంది పట్నానికి వలస వచ్చారు. వీరంతా రెక్కల కష్టాన్ని నమ్ముకున్నవారు. గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వమని అడిగితే ఇవ్వడంలేదు. ఒక్కరికి కూడా 50 గజాల భూమి ఇవ్వలేదు సరికదా ఎప్పుడో ఇచ్చిన భూమిని గద్దల్లా గుంజుకుంటున్నారు' అని ఆరోపించారు. హైదరాబాద్‌లో కిరాయిలు కట్టలేకపోతున్నాం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని కోరుతున్నారన్నారు. మంత్రి కేటీఆర్ ఎన్ని లక్షల ఉద్యోగాలు ఇచ్చారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 'ఎల్‌బీనగర్ కాలనీ వారికి భూములు రెగ్యులరైజ్ చేస్తామని మునుగోడు ఎన్నికల సందర్భంగా కేటీఆర్ వచ్చి జీఓ 118 ఇచ్చారు. ఓట్లు వేయించుకున్నారు. తరువాత మర్చిపోయారు. ఏమాత్రం నిజాయితీ ఉన్నా 118 జీఓను అమలు చేయాలి' అని ఈటల డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే పేదల భూములకు పట్టాలు ఇస్తామని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని...ఉద్యోగావకాశాలను కల్పిస్తాం అని భరోసా ఇస్తున్నామని తెలిపారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి మాట్లాడుతూ... గత ఎన్నికల్లో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేకపోయారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. బీజేపీ ఎల్‌బీనగర్ కన్వీనర్ రవీందర్‌గౌడ్, వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, నేతలు కన్నెబోయిన రాజయ్యయాదవ్, బద్దం బాలకృష్ణగౌడ్, శ్యామల, పద్మారెడ్డి, మైనం రాజేష్, రావుల శ్రీనివాస్, డప్పు రాజు, రాఘవాచారి, హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు నరేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో సీబీఐటీలో అంతర్జాతీయ సమావేశం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో ఏప్రిల్ 28, 29వ తేదీలలో రోబోటిక్స్ సైబర్ ఫిజికల్ మెషీన్‌లపై అంతర్జాతీయ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ సమావేశాలకు సంబంధించిన వివరాలతో రూపొందించిన పోస్టర్‌ను సోమవారం కళాశాలలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... కంప్యూటర్ సైన్స్ రంగంలో జరుగుతున్న పరిశోధన ఫలితాలు అద్భుతంగా వస్తున్నాయన్నారు. వాటిని పంచుకోవటం, వ్యాప్తి చేయటానికి విద్యావేత్తలు, పరిశోధకులు, డెవలపర్‌లు, విద్యా సంస్థలు, శాస్త్రీయ సంస్థలు, పరిశ్రమలను ఒకే చోట ఉంచాలనే ఉద్దేశంతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రోబోటిక్స్, సైబర్ ఫిజికల్ మెషీన్‌లపై అంతర్జాతీయ సమావేశం ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పద్ధతిలో కళాశాలలో నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే వంద వరకు పరిశోధన పత్రాలు వచ్చాయని, రాబోయే రోజుల్లో మరిన్ని వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌లు రజినీకాంత్, డాక్టర్ సుధాకర్‌బాబు, డాక్టర్ రమణ, ఏడీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్టకు పోటెత్తిన భక్తులు



స్వామివారికి పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు

- ఐదవరోజు వేడుకగాగా తైలాభిషేకం, అన్నపూజ, వసంతోత్సవం, పుష్పయాగం
- నేడు బ్రహ్మోత్సవాల ముగింపు



కీసరగుట్ట స్వామివారికి అన్నాభిషేకం

కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన సోమవారం అమావాస్య సందర్భంగా కీసరగుట్ట స్వామి సన్నిధిలో వేద పండితులు విశేష పూజలను నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, తైలాభిషేకం అనంతరం ప్రజల ఆకలిబాధను (క్షుద్బాధ) తీర్చాలని ఆ పరమశివుడికి అన్నాభిషేకాన్ని నిర్వహించారు. యాగశాలలో రుద్రస్వాహాకార హోమాన్ని నిర్వహించారు. అమావాస్య కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సామూహిక అభిషేకాల్లో పాల్గొన్నారు. ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలోని శివలింగాలకు పాలు, పసుపు, కుంకుమ, నూనె, నెయ్యిలతో అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ప్రదోష కాల పూజ, హారతి, మంత్రపుష్పం తదితర పూజలను నిర్వహించారు. రాత్రి 8 గంటలకు శ్రీస్వామి వారికి వసంతోత్సవం, పుష్పయాగం నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, ఈఓ సుధాకర్‌రెడ్డి, ఫౌండర్‌ట్రస్టీ సభ్యులు తటాకం ఉమాపతిశర్మ, నారాయణశర్మ, తటాకం వెంకటేషం, నాగలింగం, శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు.

- కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగియనున్నాయని ఆలయ చైర్మన్ తటాకం రమేష్ శర్మ తెలిపారు. మంగళవారం ఉదయం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం క్షేత్రదిగ్బలి, పూర్ణాహుతి, పండిత సన్మానంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆయన వివరించారు.
- కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టలో సోమవారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్, కబడ్డీ , ఖోఖో పోటీలను ప్రారంభించారు. కబడ్డీ పోటీలలో 25, వాలీబాల్ పోటీల్లో 20, ఖోఖో పోటీలలో 6 టీమ్‌లు పాల్గొంటున్నాయని అధికారులు తెలిపారు. యూత్ క్రీడాపోటీల ఫైనల్స్ మంగళవారం జరుగనున్నాయని తెలిపారు. విజేతలకు సాయంత్రం ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

యూనిఫాం సివిల్ కోడ్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

ఆలిండియా ముస్లిమ్ పర్సనల్ లా బోర్డు ప్రధాన కార్యదర్శి ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ

సాక్షి, సిటీబ్యూరో: 'యూనిఫాం సివిల్ కోడ్ వల్ల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలుగుతుంది. విభిన్న మతాలు, కులాలు నివసిస్తున్న భారతదేశంలో యూనిఫాం సివిల్ కోడ్ అమలు సాధ్యం కాదు. ఇది రాజ్యాంగ విరుద్ధం' అని ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రధాన కార్యదర్శి ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ అభిప్రాయపడ్డారు.

ఈ విషయమై ప్రధాన కార్యదర్శి సోమవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు యూనిఫాం సివిల్ కోడ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తోందని బోర్డు సమావేశంలో తీర్మానించిందని స్పష్టం చేశా. లక్నోలో గత నెల ఏఐఎమ్‌పీఎల్‌బీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం జరిగింది. యూనిఫాం సివిల్ కోడ్‌ను అమలు పరచే ఆలోచనలు మన దేశానికి మంచిది కాదని, విభిన్న భాషలు, మతాలు, సంస్కృతులున్న దేశంలో ఇది సాధ్యమయ్యే పని కాదని పర్సనల్ లా బోర్డు అభిప్రాయపడిందని స్పష్టం చేశారు. పార్లమెంటులో యూనిఫాం సివిల్ కోడ్ బిల్లు నెగ్గి చట్టం చేస్తే మనదేశ విశిష్టత అయిన మత సామరస్యం, సద్భావనకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని స్పష్టం చేశారు. యూనిఫాం సివిల్ కోడ్ అమలు ఆలోచనను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. 1991 ప్రార్థనా స్థలాల పరిరక్షణ చట్టాలను సక్రమంగా అమలయ్యేలా చూడాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ చట్టం సక్రమంగా అమలయ్యేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ గుర్తు చేశారు.

ఆరె కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చెట్టిపల్లి శివాజీ

ఆరె కుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక



ఆరె కుల సంఘం నూతన కమిటీ అధ్యక్షుడు చెట్టిపల్లి శివాజీ తదితరులు

అంబర్‌పేట (హైదరాబాద్): ఆరె కుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. సోమవారం అంబర్‌పేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో కమిటీ ఆవిర్భవించింది. అధ్యక్షుడిగా చెట్టిపల్లి శివాజీ, గౌరవ అధ్యక్షుడిగా నాగూర్ల వెంకన్న, స్టీరింగ్ కమిటీ చైర్మన్‌గా దిగంబర్‌రావు, క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా రాంబాబు, ఉద్యమ కమిటీ చైర్మన్‌గా అంజన్‌రావు, ఆరె కుల రైతు సంఘ అధ్యక్షుడిగా మోర్తాల చందర్‌రావుతో పాటు వివిధ కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ పలు తీర్మానాలను ఆమోదించింది. ఉప్పల్ బగాయత్‌లో ఆరె కుల సంఘానికి ఒక ఎకరం స్థలం, రూ.కోటి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినందుకు సీఎం కేసీఆర్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. అలాగే భవన నిర్మాణానికి మరో రూ.4 కోట్ల నిధుల కోసం విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. ఆరె కుల సంఘాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ తీర్మానించారు. సమావేశంలో కుల సంఘం నాయకులు రామ నర్సింహయ్య, కోల కృష్ణస్వామి, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లు షురూ



నామినేషన్ దాఖలు చేస్తున్న పాపన్నగారి మాణిక్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల పర్వం మొదలైంది. ప్రధాన సంఘాల అభ్యర్థులు హంగుఆర్భాటాలతో నామినేషన్లు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మద్దతు ఇస్తున్న ఇతర సంఘాలతో కలిసి తమబలాన్ని ప్రదర్శించేందుకు పోటీపడుతున్నారు. జిల్లాల నుంచి పెద్దఎత్తున ఉపాధ్యాయులను తరలిస్తున్నారు. టీఎస్‌యూటీఎఫ్ బలపరుస్తున్న పాపన్నగారి మాణిక్‌రెడ్డి సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో తన నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు ఇందిరా పార్క్‌వద్ద భారీ బహిరంగసభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ నేతలు జంగయ్య, చావా రవి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ తదితరులు హాజరయ్యారు. కాంట్రాక్టు లెక్చరర్ల సంఘాలు, మోడల్ స్కూల్స్ ఫెడరేషన్, పలువురు ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల ఉపాధ్యాయులు, అధ్యాపకులు మాణిక్‌రెడ్డికి మద్దతు పలికారు.

నేడు భుజంగరావు నామినేషన్

స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ(ఎస్టీయూటీఎస్) బలపరుస్తున్న అభ్యర్థి బి.భుజంగరావు మంగళవారం నామినేషన్ దాఖలు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్ ఆర్టీసీ కల్యాణ మండపంలో భారీ బహిరంగసభ ఏర్పాటు చేస్తున్నారు. ఎస్టీయూటీఎస్‌తోపాటు పలు సంఘాల మద్దతు కూడగట్టాలని భావిస్తున్నారు. సీపీఐ నేతలు కూడా ఈ సభకు హాజరవుతున్నట్టు ప్రకటించారు. మరోవైపు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న పలువురు ఉపాధ్యాయులు కూడా నామినేషన్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే 317 జీవో బాధితుల పక్షమంటూ కొంతమంది, స్పౌజ్ బాధితుల పేరుతో మరికొంతమంది నామినేషన్లు వేశారు. సంఘాలపై తీవ్ర అసంతృప్తి ఉన్న వాళ్లు పోటీ చేసి, తమ నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తున్నారు.

డాక్టర్ ప్రసాదరావుకు ఐఏసీటీఎస్ పురస్కారం



అవార్డు అందుకుంటున్న దాసరి ప్రసాదరావు

బంజారాహిల్స్ (హైదరాబాద్): ప్రముఖ గుండె శస్త్ర చికిత్స నిపుణుడు, నిమ్స్ మాజీ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ దాసరి ప్రసాదరావుకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ కార్డియో వాస్కులర్ థొరాసిక్ సర్జన్స్ (ఐఏసీటీఎస్) ప్రతిష్టాత్మక జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేసింది. కోయంబత్తూర్‌లో జరిగిన సదస్సులో హార్ట్ సర్జన్స్ ఆఫ్ ఇండియా 69వ వార్షిక సదస్సులో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. తమిళనాడు ఆరోగ్య శాఖమంత్రి ఎంఏ సుబ్రమణియన్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ జైల్‌సింగ్ మెహర్వాల్ కూడా పాల్గొన్నారు. కరోనరీ బైపాస్ సర్జరీ, హార్ట్ వాల్వ్ సర్జరీ, ఇతర గుండె ఆపరేషన్లలో ప్రసాదరావు నిష్ణాతుడైన వైద్యుడిగా, పలువురికి ప్రాణదానం చేసి అందరి మన్ననలు అందుకున్నారు. నిమ్స్‌లో అనేక అత్యాధునిక వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. నిమ్స్ యూనివర్సిటీ కోసం కూడా స్థల సేకరణలో కీలకపాత్ర పోషించారు. మెడిసిటీ, కేర్ ఆస్పత్రుల వ్యవస్థాపక డైరెక్టర్‌గా కూడా విశేష సేవలు అందించారు. 2001లో ఆయనకు పద్మశ్రీ పురస్కారం లభించింది.

పీఆర్సీ కోసం ఉద్యమాలు ఉధృతం

కార్యాచరణను ప్రకటించిన విద్యుత్ జేఏసీ



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ సాధన కోసం ఆందోళనలను తీవ్రం చేస్తున్నట్లు తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ప్రకటించింది. 1004 యూనియన్ కార్యాలయంలో సోమవారం సమావేశమై ఉద్యమ కార్యాచరణను ఖరారు చేయడంతో పాటు ఇందుకు సంబంధించిన నోటీసులను యాజమాన్యానికి అందజేసినట్లు జేఏసీ చైర్మన్ జి.సాయిబాబు, కన్వీనర్ రత్నాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రావాల్సిన కొత్త పీఆర్సీ విషయంలో యాజమాన్యం నుంచి ఇంకా స్పష్టత రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యాచరణలో భాగంగా ఈనెల 21, 22 తేదీల్లో సర్కిల్ స్థాయిల్లో సమావేశాలు, 24, 25, 28 తేదీల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన, మార్చి 1, 2న డివిజన్ కార్యాలయాలు, జనరేటింగ్ స్టేషన్ల వద్ద భోజన విరామ సమయంలో ప్రదర్శన, మార్చి 3, 4న సర్కిల్ కార్యాలయాలు, కార్పొరేట్ కార్యాలయాలు, జనరేటింగ్ స్టేషన్ల వద్ద భోజన విరామ సమయంలో ప్రదర్శన, మార్చి 8 నుంచి 23 వరకు సర్కిల్ కార్యాలయాలు, కార్పొరేట్ కార్యాలయాలు, జనరేటింగ్ స్టేషన్ల వద్ద రిలే నిరాహార దీక్షలు, మార్చి 14న కేటీపీఎస్ ప్లాంట్ వద్ద, 17న వరంగల్‌లో, 21న శంషాబాద్‌లో నిరసన సభలు, 24న విద్యుత్ సౌధలో మహాధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అయినా, యాజమాన్యం స్పందించని పక్షంలో 24న అత్యవసర సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. సమావేశంలో జేఏసీ కో చైర్మన్ శ్రీధర్, కో కన్వీనర్, బీసీ రెడ్డి, వైస్ చైర్మన్ వజీర్ పాల్గొన్నారు.

'ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలి'

సాక్షి, హైదరాబాద్: ఆశ వర్కర్లకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం సీఎం కేసీఆర్‌కు జూలకంటి లేఖరాశారు. ఆశ వర్కర్లకు ప్రసూతి సెలవులు, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని విన్నవించారు. అలాగే పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయిలను వెంటనే చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని లేఖలో జూలకంటి పేర్కొన్నారు.

క్లుప్తంగా...

సబ్ కమిటీ సమావేశాలు వాయిదా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పేదలకు ఇళ్లస్థలాల పంపిణీతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల క్రమబద్ధీకరణ, ఆదాయ వనరుల సమీకరణలపై సోమవారం జరగాల్సిన మంత్రివర్గ ఉపసంఘం (కేబినెట్ సబ్ కమిటీ) సమావేశాలు వాయిదా పడ్డాయి. కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మృతి చెందడంతో పలువురు మంత్రులు ఆయన అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొనాల్సి రావడంతో పాటు సాయన్న గౌరవార్థం కేబినెట్ సబ్‌కమిటీ సమావేశాలు నిర్వహించలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే వైద్య, ఆరోగ్య, ఆర్థిక మంత్రి హరీశ్‌రావు మాత్రం సచివాయంలో ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ, హౌజింగ్ అధికారులతో సమీక్షలు నిర్వహించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులతో పాటు సిద్దిపేట జిల్లాలో రోడ్డు భద్రతా చర్యల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన తదితర అంశాలపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఆయన చర్చించారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు బెదిరింపు కాల్స్



ఆబిడ్స్ (హైదరాబాద్): గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తనకు పాకిస్తాన్ నుంచి చంపేస్తామంటూ బెదిరింపు కాల్స్ వచ్చినట్లు ట్విట్టర్ ద్వారా రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు. సోమవారం మధ్యాహ్నం 3.34 గంటలకు తన వాట్సాప్ ద్వారా పాకిస్థాన్ నుంచి ఓ వ్యక్తి ఫోన్ చేసి తన ఆచూకీ, కుటుంబ వివరాలు చెబుతూ... హైదరాబాద్‌లో ఉన్న యాక్టివ్ స్లీపర్ సెల్ ద్వారా చంపేస్తామని బెదిరించినట్లు రాజాసింగ్ తెలిపారు. ప్లస్ 923105017464 నెంబర్ ద్వారా బెదిరింపు కాల్స్ వచ్చినట్లు రాజాసింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తరచూ ఇలాంటి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఆయన తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

22న ఈడీ విచారణకు రండి

ఎంబీఎస్ జ్యువెల్లర్స్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 22న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరుకావాలని ఎంబీఎస్ జ్యువెల్లర్స్ యజమాని సుఖేశ్‌గుప్తాను హైకోర్టు ఆదేశించింది. చట్ట విరుద్ధంగా బంగారం, వజ్రాల కొనుగోళ్లకు పాల్పడిన ఆరోపణలపై ప్రముఖ నగల వ్యాపార సంస్థ ముసద్దీలాల్ జెమ్స్ అండ్ జ్యువెల్లర్స్‌పై అక్టోబర్‌లో కేసు నమోదైంది. సీబీఐ కేసు నమోదు చేయగా, తర్వాత ఈడీ విచారణ ప్రారంభించింది. ఈడీ కేసును సవాల్ చేస్తూ యజమాని సుఖేశ్ గుప్తా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్ శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనల తర్వాత పైవిధంగా ఆదేశాలు జారీ చేస్తూ విచారణను మార్చి 3కు వాయిదా వేశారు.

'ఎంబీబీఎస్ విద్యార్థినిని పరీక్షలకు అనుమతించండి'

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ చివరి సంవత్సరం విద్యార్థినిని పరీక్షలు రాసేందుకు అనుమతించాలని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీని హైకోర్టు ఆదేశించింది. హాజరు శాతం లేదంటూ నార్కట్‌పల్లిలోని కామినేనిలో చదువుతున్న విద్యార్థిని జొన్నల గడ్డ అరుణను కాలేజీ, వర్సిటీ పరీక్షలు రాసేందుకు అనుమతించలేదు. దీన్ని తొలుత విద్యార్థిని హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద సవాల్ చేయగా, పిటిషన్‌ను కొట్టివేశారు. దీనిపై సీజే ధర్మాసనాన్ని ఆశ్రయించగా, వాదనలు విని నేటి నుంచి జరిగే ఎంబీబీఎస్ చివరి సంవత్సరం పరీక్షలు రాసేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు.


ఫ్లైట్ ఎక్కనివ్వలేదని ఫేక్‌కాల్..

శంషాబాద్: ఆలస్యంగా రావడంతో తనను విమానం ఎక్కనివ్వలేదని ఓ ప్రయాణికుడు చేసిన బాంబు బెదిరింపు ఫేక్ కాల్, అధికారులు, భద్రతా సిబ్బందిని ఉరుకులు.. పరుగులు పెట్టించింది. ఈ ఘటన సోమవారం ఉదయం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని కాప్రాలో ప్రశాంత్‌నగర్‌కు చెందిన అజ్మీరా భద్రయ్య (59) చెన్నైలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఓ శాఖలో సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం 11.20 గంటలకు హైదరాబాద్ నుంచి చెన్నై బయలుదేరాల్సిన ఇండిగో విమానం (6ఈ–151) ఎక్కేందుకు ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. అప్పటికే బోర్డింగ్ సమయం అయిపోవడంతో ఇండిగో ఎయిర్ లైన్స్ అధికారులు అతడిని ఫ్లైట్ ఎక్కించుకునేందుకు నిరాకరించారు. దీంతో ఆ విమానాన్ని కొంత సేపు ఆపాలనే ఆలోచన చేసిన భద్రయ్య డయల్ 100 ఫోన్‌కు చేశాడు. హైదరాబాద్ నుంచి చెన్నై బయలుదేరుతున్న విమానంలో బాంబు పెట్టారని చెప్పాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు, సీఐఎస్‌ఎఫ్ అధికారులు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో విమానంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి బాంబు లేదని నిర్ధారించారు. కాగా, ఎయిర్‌పోర్టు నుంచే భద్రయ్య ఈ ఫేక్‌కాల్ చేసినట్లు అధికారులు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు.

కొత్తగా 9 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సోమవారం 3,298 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 9 మంది వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి ముగ్గురు కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది.

ఇన్‌ఫ్లుయెన్సర్లు.. నయా సేల్స్‌మెన్!





సోషల్ మీడియాలో పెరుగుతున్న ఇన్‌ఫ్లుయెన్సర్ల జోరు

సాక్షి, హైదరాబాద్: సోషల్ మీడియాలో తమ కంటెంట్‌తో లక్షలాది మంది నెటిజన్లను 'ఫాలోవర్లు'గా మార్చుకుంటున్న వ్యక్తులు ఇటీవలి కాలంలో ఇన్‌ఫ్లుయెన్సర్లుగా సరికొత్త పాత్ర పోషిస్తున్నారు. విషయ పరిజ్ఞానం, చలాకీ మాటలతో విజ్ఞానం, వినోదం అందిస్తూనే వివిధ సంస్థల ఉత్పత్తులను ప్రచారం చేస్తూ వాటిని కొనేలా 'ఫాలోవర్ల'ను ప్రభావితం చేస్తున్నారు. ఉత్పత్తుల తయారీ సంస్థలకు కొనుగోళ్లు పెంచడంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల పాత్ర నిర్ణయాత్మకంగా మారుతోందని అడ్వర్టయిజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ) చేపట్టిన తాజా అధ్యయనంలో వెల్లడైంది.



- ఉత్పత్తుల ప్రచారంతో ఫాలోవర్లను ప్రభావితం చేస్తున్న వైనం
- వారు సూచిస్తున్న ఉత్పత్తులనే కొంటున్న 70 శాతం మంది
- కనీసం ఒక్క ఉత్పత్తినైనా కొంటున్నామన్న 90 శాతం మంది
- అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ తాజా నివేదికలో వెల్లడి

79% మందిలో నమ్మకం...

దేశంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ప్రచారం చేస్తున్న వస్తువులను కొనేందుకు 70 శాతం మంది ప్రజలు మొగ్గుచూపుతున్నట్లు సర్వేలో వెల్లడైంది. 'ఇన్‌ఫ్లుయెన్సర్ ట్రస్ట్ రిపోర్ట్'పేరిట 18 ఏళ్లకు పైబడిన వారిపై నిర్వహించిన ఈ సర్వేలో తాము ఈ ఇన్‌ఫ్లుయెన్సర్లు చెబుతున్న విషయాలను విశ్వసిస్తున్నట్లు 79 శాతం మంది పేర్కొన్నారు. వారిలో 30 శాతమైతే సంపూర్ణంగా నమ్ముతున్నట్లు తెలపగా 49 శాతం మంది ఎంతో కొంత విశ్వసిస్తున్నట్లు తెలియజేశారు.

నివేదికలోని ముఖ్యాంశాలు...

- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఎండార్స్ చేసిన వస్తువుల్లో కనీసం ఒకటైనా కొనుగోలు చేశామన్న 90 శాతం మంది నెటిజన్లు.
- వారు సూచించిన లేదా పేర్కొన్న ఉత్పత్తుల్లో మూడుకన్నా ఎక్కువే కొంటున్నామన్న వారు 61 శాతం (25 ఏళ్ల నుంచి 44 ఏళ్ల మధ్య వారు).
- ఇన్‌ఫ్లుయెన్సర్లు పారదర్శకంగా, నిజాయితీగా వ్యవహరించడంతోపాటు ఆయా బ్రాండ్లతో తమకున్న సంబంధాల గురించి దాచకుండా బయటపెట్టినప్పుడే వినియోగదారులు వారిని విశ్వసిస్తున్నారు
- సెలబ్రిటీలుగా, ఇన్‌ఫ్లుయెన్సర్లుగా వారు గడిపే జీవనశైలి, వ్యక్తిగత జీవితం, అనుభవాలు కష్టమర్ల విశ్వాసాన్ని పెంచుతున్నాయి.
- ఒకవేళ ఇన్‌ఫ్లుయెన్సర్లలో విశ్వసనీయత కొరవడితే వారిని 'ఫాలోవర్లు'నమ్మే పరిస్థితి లేదు.

వివిధ బ్రాండ్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లకు సంబంధించి ఆస్కికి 2,767 ఫిర్యాదులు (2021–22లో 1,592, 2021–22 ఏప్రిల్–డిసెంబర్‌ల మధ్య 1,175) అందాయి. ఇందులో వర్చువల్ డిజిటల్ అసెట్స్, పర్సనల్ కేర్ వంటి అంశాలపై వినియోగదారుల నుంచి

ఫిర్యాదులు సైతం ఉన్నాయి...

ఎక్కువగా ఫిర్యాదులు నమోదయ్యాయి. దీంతో ఆయా సంస్థలు, ఉత్పత్తులతో ఉన్న అనుబంధం, ఇతర అంశాలను తెలియజేయాలంటూ ఇన్‌ఫ్లుయెన్సర్లను 2021 మేలో ఏఎస్‌సీఐ కోరింది.

500 కోట్ల నెటిజన్లు..

ప్రపంచంలోని సగం జనాభాకు పైగా... అంటే దాదాపు 500 కోట్ల మంది సోషల్ మీడియాలోని ఏదో ఒక వేదికపై యాక్టివ్‌గా ఉన్నారు. 2027కల్లా ఈ సంఖ్య 600 కోట్లకు పెరుగుతుందని నిపుణుల అంచనా.

పనిచేస్తున్న మార్కెటింగ్ వ్యూహాలు



సోషల్ మీడియాలో ప్రముఖ వ్యక్తులు ఉపయోగిస్తున్న లేదా ప్రచారం చేస్తున్న వస్తువులను 'ఫాలోవర్లు'కొనుగోలు చేసేలా చేయడంలో మార్కెటింగ్ వ్యూహాలు బాగా పనిచేస్తున్నాయి. ఆన్‌లైన్ మార్కెటింగ్ అందుబాటులోకి వచ్చాక ఎవరూ వ్యక్తిగతంగా షాపులకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే నచ్చిన ఉత్పత్తులను ఉన్న చోటు నుంచే వెతికి కొనుగోలు చేయడం నిమిషాల వ్యవధిలోనే పూర్తవుతోంది.

– సి.వీరేందర్, సీనియర్ సైకాలజిస్ట్

నెల రోజుల్లో ఏసీ స్లీపర్ బస్సులు

తొలిసారి సమకూర్చుకుంటున్న టీఎస్‌ఆర్టీసీ

- ముంబై, బెంగళూరు, షిర్డీ, తిరుపతి, విశాఖలాంటి దూరప్రాంతాలకు సర్వీసులు
- ప్రైవేటు ట్రావెల్స్ ఏసీ స్లీపర్‌లకు దీటుగా రంగంలోకి..
- ఇప్పటికే 16 బస్సులకు ఆర్డర్..
- గరుడ ప్లస్ బస్సుల కంటే ఎక్కువ చార్జీలు!



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) తొలిసారిగా ఏసీ స్లీపర్ బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకురానుంది. ఇప్పటికే 16 ఏసీ స్లీపర్ బస్సుల కోసం 'అశోక్‌లేలాండ్'కు తయారీ ఆర్డర్ ఇవ్వగా ఆ సంస్థ ఒక నమూనా బస్సును సిద్ధం చేసి తీసుకొచ్చింది. దానికి మార్పులు సూచించిన అధికారులు మొత్తంమీద ఆ నమూనాకు ఓకే చెప్పారు. ఈ బస్సులు మార్చి చివరికి అందుబాటులోకి రానున్నాయి.

ప్రైవేటుకు దీటుగా...

ప్రైవేటు ట్రావెల్స్ 90 శాతం స్లీపర్ బస్సులే వినియోగిస్తుండటంతో వాటికి విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో ఆర్టీసీపై కూడా స్లీపర్ సర్వీసుల కోసం ఒత్తిడి పెరుగుతోంది. దాన్ని దృష్టిలో పెట్టుకొని ఇటీవలే ఏసీ స్లీపర్ బస్సుల కోసం ఆర్డర్ ఇచ్చింది. వాటిని ముంబై, పుణే, బెంగళూరు, షిర్డీ, చెన్నై, హుబ్లీ, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ లాంటి దూరప్రాంతాలకు నడపనుంది.

గరుడ ప్లస్ కంటే ఎక్కువ చార్జీ?

కొద్దిరోజుల క్రితమే అద్దెకు నాన్ ఏసీ స్లీపర్ సర్వీసులను సమకూర్చుకున్న ఆర్టీసీ వాటికి సూపర్ లగ్జరీ–రాజధాని కేటగిరీలకు మధ్యస్తంగా చార్జీలను ఖరారు చేసింది. ఈ బస్సుల్లో కొన్ని స్లీపర్ కమ్ సీటర్ సర్వీసులుగా ఉన్నాయి. వాటిల్లో సీట్ల చార్జీ సూపర్ లగ్జరీ టికెట్ ధరకు సమంగా, బెర్తుల చార్జీ అంతకు రూ. 100 ఎక్కువగా ఖరారు చేసింది. ఇప్పుడు సొంతంగా కొంటున్నవి ఏసీ స్లీపర్ బస్సులు కావడంతో వాటిల్లో టికెట్ ధరలను ఎక్కువగానే ఖరారు చేయాలని భావిస్తోంది. గరుడ ప్లస్‌తో సమంగా, దాని కంటే కొంచెం తక్కువ ధర ఖరారు చేస్తే ఎలా ఉంటుందని పరిశీలిస్తోంది. అయితే గరుడ ప్లస్‌లో 48 సీట్లు ఉండగా కొత్త ఏసీ స్లీపర్ బస్సుల్లో కేవలం 30 బెర్తులే (లోయర్ 15, అప్పర్ 15) ఉండనున్నాయి. తక్కువ చార్జీ ఉంటే నష్టం వచ్చే అవకాశం ఉన్నందున గరుడ ప్లస్ కంటే ఎక్కువే నిర్ధారిస్తే మంచిదన్న యోచనలోనూ ఉంది. అయితే ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.

3 నెలల్లో డబుల్ డెక్కర్ బస్సులు..

గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు (జీసీసీ) పద్ధతిలో ప్రముఖ బస్సుల తయారీ కంపెనీ ఆర్టీసీలో నిర్వహించే డబుల్ డెక్కర్ బస్సులు మరో మూడు నెలల్లో అందుబాటులోకి రానున్నాయి. వాటిని హైదరాబాద్‌లో తిప్పనున్నారు. కి.మీ.కు రూ. 79 చొప్పున అద్దె చెల్లించాలని ఆ కంపెనీ కోట్ చేయగా రూ. 75కు తగ్గించాలని ఆర్టీసీ కోరింది. చివరకు రూ. 76 దగ్గర సయోధ్య కుదిరినట్టు ప్రచారం జరుగుతోంది. తొలుత 10 డబుల్ డెక్కర్ బస్సులను తయారు చేసి ఆర్టీసీకి అందించనుంది.

నూతన సాంకేతికతతో ఉద్యోగాలేమీ పోవు

ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్



సాక్షి, హైదరాబాద్: నూతన సాంకేతికత వినియోగంతో ఉద్యోగాలు తగ్గిపోతాయన్న ఆందోళన అవసరం లేదని నూతన ఉద్యోగాల సృష్టి సాధ్యపడుతుందని ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ అన్నారు. సోమవారం తెలంగాణా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో చాట్‌జీపీటీ, జీపీటీ టూల్స్ అన్న అంశంపై నిర్వహించిన వెబినార్‌లో ఆయన మాట్లాడారు. జూమ్‌లో వర్చ్యువల్ ఆడియన్స్‌ని ఉద్దేశించి ప్రసంగించారు. చాట్ జీపీటీ అనేది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)లో విజ్ఞానాన్ని మెరుగుపరచడంలో సరికొత్తదని తెలిపారు. సరదా ప్రయోజనాల కోసం, సరదాగా ప్రశ్నించడం కోసం ఇది ఉపయోగ పడుతుందన్నారు. ఇటీవల తాను అత్యంత ప్రాచుర్యం పొందిన ఐదు తెలుగు సామెతలు అడగ్గా... ఇది తెలుగు, ఇంగ్లీషు రెండింటిలో మాత్రమే కాకుండా వాటి అర్థాలను కూడా ఇచ్చిందని తెలిపారు. విస్తారమైన డేటా నుంచి చాలా వేగంగా శోధించగల సమాచారాన్ని అందించే సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. 'జయేశ్ రంజన్ ఎవరు? అని అడిగితే హెల్త్ సెక్రటరీ అని సమాధానం ఇచ్చింది, కానీ తాను ఎప్పుడూ ఆరోగ్య కార్యదర్శిగా పనిచేయలేదన్నారు.. చాట్ జీపీటీ మరియు జీపీటీ సాధనాలు మానవ జాతికి ఎలా సహాయపడతాయో జయేష్ రంజన్ తెలిపారు. ఈ వెబినార్‌లో చీఫ్ ఇన్నొవేషన్ ఆఫీసర్, గ్లోబల్ హెడ్ టెక్నాలజీ అడ్వైజరీ సర్వీసెస్ బాల ప్రసాద్, ఎఫ్‌టీసీసీఐ ఐసీటీ కమిటీ చైర్మన్ కె. మోహన్ రాయుడు తదితరులు మాట్లాడారు.

సాయన్నకు తుది వీడ్కోలు

- అభిమానుల అశ్రునయనాల మధ్య కంటోన్మెంట్‌లో అంతిమ యాత్ర
- మారేడుపల్లిలో అంత్యక్రియలు



సాయన్న అంతిమయాత్ర దృశ్యం



ఆందోళన చేస్తున్న అభిమానులు

కంటోన్మెంట్ (హైదరాబాద్): బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ఆత్మీయుల అశ్రునయనాల మధ్య ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలు ముగిశాయి. అశోక్‌నగర్‌లోని సాయన్న నివాసం నుంచి ఆయన భౌతికకాయాన్ని సోమవారం ఉదయం 11.30కి కార్ఖానాలోని క్యాంపు ఆఫీసుకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం వరకు అభిమానుల సందర్శనార్థం అక్కడే ఉంచారు. మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్ తదితరులు నివాళులు అర్పించారు. మధ్యాహ్నం 3.00 గంటలకు క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమైన సాయన్న అంతిమయాత్ర.. సాయంత్రం 5.00 గంటలకు మారేడుపల్లి శ్మశానవాటికకు చేరుకుంది. సాయన్నకు ముగ్గురు కుమార్తెలు నమ్రత, నివేదిత, లాస్య నందిత ఉండగా.. పెద్ద కుమార్తె నమ్రత భర్త చందు ముందు నడిచి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే సాయన్న భౌతిక కాయానికి ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించకపోవడంపై అభిమానులు ఆందోళనకు దిగారు. దీనితో సుమారు రెండు గంటల పాటు అంత్యక్రియలు నిలిచిపోయాయి.

అధికారిక లాంఛనాల కోసం అభిమానుల ఆందోళన

సాయన్న భౌతికకాయాన్ని దహనవాటిక వద్ద దింపి ఆఖరి క్రతువు చేపడుతుండగా.. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సాయన్నకు ప్రభుత్వ అధికార లాంఛనాలు చేపట్టడం లేదేమంటూ అభిమానులు ఆందోళనకు దిగారు. అక్కడే ఉన్న మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావులను దీనిపై నిలదీశారు. ఈ క్రమంలో మంత్రి తలసాని ఆందోళనకారుల వద్దకు వచ్చి కాసేపట్లో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరుగుతాయని చెప్పి వెళ్లిపోయారు. కాసేపటికే మంత్రి మల్లారెడ్డి కూడా వెళ్లిపోవడంతో ఆందోళన చేస్తున్న అభిమానులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే తాను ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నానంటూ డిప్యూటీ స్పీకర్ పద్మారావు వారిని సముదాయిస్తూ వచ్చారు. ఇలా రెండు గంటలు గడిచింది. కానీ పోలీసులు తమకు అధికారిక ఉత్తర్వులేవీ లేవని, సూర్యాస్తమయం తర్వాత అధికార లాంఛనాలు నిర్వహించే అవకాశం లేదని తేల్చి చెప్పారు. చివరికి పద్మారావు తదితరులు సాయన్న భార్య, కుమార్తెలతో మాట్లాడి అంత్యక్రియలు పూర్తి చేయాల్సిందిగా ఒప్పించారు. సాయన్న కుటుంబీకుల విజ్ఞప్తితో ఆందోళనకారులు శాంతించగా.. రాత్రి 7.30 గంటలకు అంత్యక్రియలు ముగిశాయి.

అది ప్రభుత్వ అధికారం

- ఉద్యోగులకు పోస్టుల రద్దును ప్రశ్నించే హక్కులేదు
- వీఆర్వో వ్యవస్థ రద్దుపై హైకోర్టులో ఏజీ వాదనలు

సాక్షి, హైదరాబాద్: తన పరిధిలో ఉన్న పోస్టులను రద్దుచేయడం అనేది ప్రభుత్వానికుండే చట్టబద్ధమైన అధికారం.. దానిని కాదనే హక్కుగానీ, ప్రశ్నించే అధికారంకానీ ఉద్యోగులకు లేవని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో వాదనలు వినిపించింది. ప్రజాప్రయోజనాలను పరిగణనలోకి తీసుకునే వీఆర్వో పోస్టులను రద్దు చేశామని, ఇదంతా చట్టబద్ధ ప్రక్రియ అని నివేదించింది. రెవెన్యూ శాఖలో ఖాళీలున్నా తమను ఇతర శాఖల్లోకి పంపడం అన్యాయమని పేర్కొంటూ వీఆర్వోలు హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై గతంలో విచారణ చేపట్టిన సీజే నేతృత్వంలోని ధర్మాసనం వీఆర్వోలను ఇతర శాఖలకు తరలించడంపై స్టే విధించింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) వాదనలు వినిపించారు. 'వీఆర్వో వ్యవస్థ రద్దు చట్టప్రకారంగానే జరిగింది. పిటిషనర్లు చెబుతున్నట్లు ప్రత్యేక నిబంధనలు రూపొందించాల్సిన అవసరం లేదు. వీఆర్వోల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం నిర్ధారించుకున్న తర్వాతే రద్దు చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలతోనే వీఆర్వోలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేయడానికి మార్గదర్శకాలు జారీచేసింది. రెవెన్యూ రికార్డుల నిర్వహణకు వీఆర్వోల అవసరం ఉండేది. ఆన్‌లైన్ ప్రక్రియ ధరణి.. రాకతో వారి అవసరం లేకుండా పోయింది. రెవెన్యూ రికార్డుల భౌతిక నిర్వహణతో అవినీతి పెరిగిన నేపథ్యంలో పారదర్శకత కోసం ప్రభుత్వం డిజిటలైజ్ చేసింది. వీఆర్వోలకు ఎలాంటి అన్యాయం జరగకుండా ఇతర శాఖల్లో వారి పోస్టులకు సమానమైన కేడర్ పోస్టుల్లోకి తరలించాం'అని ఏజీ వివరించారు. తదుపరి వాదనల కోసం ధర్మాసనం విచారణను మార్చి 9కి వాయిదా వేసింది.

నాన్ కేడర్ ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల నాన్ కేడర్ ఐఏఎస్‌లుగా ఎంపికైన పలువురు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

పేరు	పోస్టింగ్
ఎ.నిర్మలా కాంతివెస్లీ	రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ
కోటా శ్రీవాత్సవ	వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్
చంద్రశేఖర్ బాదుగు	నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్
సీహెచ్ ప్రియాంక	కరీంనగర్ జెడ్పీ సీఈవో
జె.అరుణశ్రీ	అటాచ్డ్ టు జీఏడీ
కె.హరిత	పంజగుట్ట డివిజన్ అదనపు కమిషనర్ (ఎస్టీ)
కె.అశోక్‌రెడ్డి	ఆర్థిక, వైద్యశాఖ మంత్రి ప్రైవేటు సెక్రెటరీ
పి.కాత్యాయినీ దేవి	పురపాలక శాఖమంత్రి ఓఎస్డీ
ఈవీ నరసింహారెడ్డి	టీఎస్‌ఐఐసీ వైస్‌చైర్మన్, ఎండీ, ఈడీ
ఇ.నవీన్ నికోలస్	అటాచ్డ్ టు జీఏడీ

గెలిపించి ఉంటే కేంద్రమంత్రి అయ్యేదాన్ని!

- నాలాంటి వారి ప్రతిభ వృథా కాకూడదనే గవర్నర్ పదవులు: తమిళిసై
- నేను పనిచేస్తుంటే కన్నా.. పడిపోతేనే పెద్దవార్త అవుతోంది
- రెండు రాష్ట్రాలనే పర్యవేక్షిస్తున్నా.. రెండు ఫోన్లను భరించలేనా?
- తమిళనాడు పర్యటనలో గవర్నర్ సరదా వ్యాఖ్యలు



సాక్షి, చెన్నై: తన లాంటి ప్రతిభావంతులను ప్రజలు గుర్తించడం లేదని తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. తనలాంటి వారి ప్రతిభ వృథా కాకూడదనే కేంద్ర ప్రభుత్వం గవర్నర్ పదవులు అప్పగించిందన్నారు. సోమవారం తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన స్టాఫ్ డే (ఉద్యోగ దినోత్సవం) కార్యక్రమంలో తమిళిసై ప్రసంగించారు. తాను ఈ కార్యక్రమానికి వచ్చే సమయంలో ఓ పెద్దాయన తన వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లను చూసి, రెండు ఫోన్లను ఎలా భరిస్తున్నారని ప్రశ్నించారని చెప్పారు. తాను రెండు రాష్ట్రాలనే పర్యవేక్షిస్తున్నప్పుడు.. ఈ రెండు ఫోన్లను భరించలేనా? అని సమాధానం ఇచ్చానని వివరించారు. ఇక ఆదివారం ఓ కార్యక్రమంలో తాను కిందపడిపోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ''రోజుకు 48 గంటలు ఉన్నా కూడా నేను పనిచేయడానికి సిద్ధం. అయినా నేను కిందా మీదా పడి పనిచేస్తుంటే అది వార్తగా రావడం లేదు. అదే కింద పడితే మాత్రం అతిపెద్ద వార్తగా వచ్చేస్తోంది.''అని తమిళిసై చమత్కరించారు. రాజకీయాల్లో ఆమె ప్రస్థానంపై మీడియా అడిగిన పలు ప్రశ్నలకూ ఆసక్తికరంగా సమాధానమిచ్చారు. ''తమిళ ప్రజలు నన్ను గుర్తించలేదు. గుర్తించి ఉంటే పార్లమెంట్ వెళ్లి, ఆ తర్వాత కేంద్ర మంత్రిని కూడా అయ్యేదాన్ని. ప్రజలు ఓడించినా నాలాంటి వారి ప్రతిభ వృథా కాకూడదనే ఉద్దేశంతోనే కేంద్రం గవర్నర్ పదవులను కేటాయిస్తోంది..''అని పేర్కొన్నారు.

మేమంతా ఒక్కటే

కాంగ్రెస్ పార్టీ నేతలమంతా కలిసే ఉన్నాం

- ఓరుగల్లు ఎమ్మెల్యేలు దండుపాళ్యం ముఠా
- డైరీ రాస్తున్నాం... వడ్డీతో చెల్లిస్తాం
- తెలంగాణలో టీఆర్‌ఎస్, బీజేపీ నేతల భూకబ్జాలు...
- వరంగల్ హాథ్ సే హాథ్ జోడో యాత్రలో రేవంత్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, వరంగల్: 'మేమంతా ఒక్కటే.. మా నాయకులంతా కలిసే ఉన్నాం.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేసీఆర్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు ఈ రాష్ట్ర ప్రజలు, మేం సిద్ధంగా ఉన్నాం.. 2024 జనవరిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుంది'అని టీపీసీసీ చీఫ్ ఎనుముల రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం హనుమకొండ అమృత జంక్షన్ వద్ద నిర్వహించిన సభలో ప్రసంగించారు. బీఆర్‌ఎస్ నేతలే కాదు.. బీజేపీ నేతలు కూడా భూములు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా నష్టం జరుగుతున్నా అమరుల ఆకాంక్ష మేరకు సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, కానీ సరైన పరిపాలన జరగక కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ బొందల గడ్డగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో నివేదిక ప్రకారం రాష్ట్రంలో 80 వేలమంది రైతులు, మూడు వేల మంది నిరుద్యోగుల ఆత్మహత్యలు చేసుకున్నారని వివరించారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు ఇప్పటికీ పూర్తికాలేదు కానీ 9 నెలల్లో 10 ఎకరాల్లో 150 గదులతో దొరల గడీలను తలపించే ప్రగతి భవన్ మాత్రం పూర్తయిందని ఎద్దేవా చేశారు.

ఈస్ట్, వెస్ట్ ఎమ్మెల్యేలు బిల్లా రంగాల్లా దోచుకుంటున్నారు

వరంగల్ ఎంపీ పసునూరు దయాకర్ పసిపిల్లగాడు అనుకుంటున్నారని, కానీ ఆర్టీసీ టైర్ల ఫ్యాక్టరీని మూసివేసి హంటర్ సెంటర్లో 6 ఎకరాల భూమిని కాజేసిన ఘనత ఆయనదని ఆరోపించారు. ఓరుగల్లు ఎమ్మెల్యేలు దండుపాళ్యం ముఠా అని, వరంగల్ ఈస్ట్, వెస్ట్ ఎమ్మెల్యేలు బిల్లా రంగాల్లా ప్రజలను దోచుకుంటున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 'వరంగల్‌లో ఏ ఎమ్మెల్యేను తీసుకున్నా ఉద్యమం సమయంలో వీరి దగ్గర ఏమీ లేదు. కానీ ఇప్పుడు వేల కోట్లకు పడగలెత్తారు. దండుపాళ్యం ముఠాకు హన్మకొండ సాక్షిగా హెచ్చరిక చేస్తున్నా. గోడ మీద రాసిపెట్టుకోండి. రోజులు లెక్కపెట్టుకోండి. డైరీలో ప్రతి ఒక్కటీ నోట్ చేసుకుంటున్నాం. మా పార్టీ నాయకులు, కార్యకర్తల మీద కేసులు పెట్టి వేధించిన దండుపాళ్యం ముఠాకు ఇంతకింత మిత్తితో సహా చెల్లిస్తాం'' అని హెచ్చరించారు. పాదయాత్రకు ముందు కాజీపేటలోని హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియబాని దర్గాను దర్శించుకొని రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ, మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, మాజీ మంత్రులు మహ్మద్ అలీ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నేతపై దాడి

రేవంత్ యాత్ర ముగింపు తరువాత ఘటన



వరంగల్ క్రైం: హనుమకొండలో సోమవారం రాత్రి కాంగ్రెస్ యువజన నాయకుడు తోట పవన్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బహిరంగసభ ముగిసిన కొన్ని నిమిషాలకే సభావేదికకు వంద మీటర్ల దూరంలోనే ఈ దాడి జరిగింది. ముక్కు, కుడి కన్ను భాగంలో బలమైన గాయాలయ్యాయి. వీపుపై వాతలు తేలాయి. రక్తపుమడుగులో ఉన్న పవన్‌ను స్థానికులు గమనించి హుటాహుటిన సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకున్నారు. డీసీసీ నేత నాయిని రాజేందర్‌రెడ్డి ఆస్పత్రి వద్ద మాట్లాడుతూ పవన్‌పై బీఆర్‌ఎస్ కార్యకర్తలే దాడి చేశారని ఆరోపించారు.

ప్లకార్డులతో నిరసన..: రేవంత్‌రెడ్డి యాత్ర సమయంలో హనుమకొండలోని బాలసముద్రం అంబేడ్కర్ కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పేదలకు పంచాలని తోట పవన్ డిమాండ్ చేస్తూ స్థానికులతో కలిసి ప్రదర్శన చేపట్టారు. ఆ తరువాత రేవంత్ బహిరంగ సభలో స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీని ప్రదర్శించారు. ఆ సభ ముగియగానే ఈ దాడి జరిగింది.



వేతన వివక్ష

జెండర్ ఈక్వాలిటీ కోసం సమాజంలో దశాబ్దాలుగా ఒక నిశ్శబ్ద ఉద్యమం సాగుతూనే ఉంది. కానీ మహిళ అయిన కారణంగా వేతనంలో వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉంది. వేతనంలో అసమానతలకు బీజాలు అడుగడుగునా పడుతూనే ఉన్నాయి. ఈ విషయంలో పాశ్చాత్య దేశాల పరిస్థితి కొంత మెరుగ్గా ఉందని, మనదేశంలో సమానత సాధనలో అంతరం పెరుగుతోందని, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌వో) నివేదికను ఉదహరించారు సామాజిక కార్యకర్త మమతా రఘువీర్. ఆమె తన అధ్యయన వివరాలను సాక్షితో పంచుకున్నారు.

ఐటీలోనూ ఉంది!

"చదువులో సమానత్వసాధనలో లక్ష్యానికి దగ్గరకు వస్తున్నట్లే చెప్పాలి. కానీ ఉద్యోగాల దగ్గరకు వచ్చేటప్పటికి సమానత్వం చాలాదూరంలోనే ఉంది. అలాగే ఉద్యోగంలో వేతనాలు కూడా. ఐఎల్‌వో గ్లోబల్ రిపోర్ట్ 2020–21లో విడుదల చేసిన నివేదిక అతిపెద్ద ఆశనిపాతం. 1993–94లో మగవాళ్లకు ఆడవాళ్లకు మధ్య వేతన దూరం 48 శాతం ఉండేది. 2018–19 నాటికి ఆ దూరం తగ్గి 28 శాతానికి చేరింది. అయితే కరోనా కుదుపుతో మహిళల వేతనాల తగ్గుదల ఏడు శాతం పెరిగింది. ఇప్పుడు మగవాళ్లకు మహిళలకు మధ్య వేతన అసమానత 35 శాతం. వ్యవసాయరంగం, భవన నిర్మాణరంగం వంటి అవ్యవస్థీకృత రంగాల్లోనే ఈ అసమానత అనుకుంటాం. కానీ ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో కూడా తేడా ఉంటోందని లింక్‌డ్ ఇన్ చేసిన సర్వేలో వెల్లడైంది. వేతనంలో కనిపిస్తున్న జెండర్ గ్యాప్, జెండర్ డిస్క్రిమినేషన్‌తోపాటు హెరాస్‌మెంట్‌ను కూడా ప్రస్తావించింది లింక్‌డ్ ఇన్.

మెటర్నిటీ లీవులేవీ!

వేతనంలో జెండర్ డిస్క్రిమినేషన్‌కు గురికానిది ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే. కాంట్రాక్ట్ ఉద్యోగులు, ప్రైవేట్ సెక్టార్ ఉద్యోగులు ఈ వివక్షకు గురవుతూనే ఉన్నారు. మరో విషయం ఏమిటంటే, ఒకేసారి ఉద్యోగంలో చేరిన మగవాళ్లకు ఆడవాళ్లకు మధ్య ఏళ్లు గడిచేకొద్దీ వేతనంలో తేడా పెరుగుతూనే ఉంటోంది. ఇందుకు కారణం కుటుంబ బాధ్యతలు, తల్లి అయినప్పుడు తీసుకునే విరామం. చాలా కంపెనీలు మహిళలకు వేతనంతో కూడిన మెటర్నిటీ లీవు ఇవ్వడం లేదు. గర్భిణి అనగానే ఏదో ఓ కారణంతో ఉద్యోగం నుంచి తొలగించడంతోపాటు ఒకవేళ సెలవు ఇచ్చినా వేతనం ఇవ్వని కంపెనీలు కొల్లలు. ఇక కాంట్రాక్టు ఉద్యోగంలో ఉన్న మహిళలకు జరిగే అన్యాయం మీద దృష్టి పెట్టే సమయం ప్రభుత్వాలకు ఉండడం లేదు.

ఏడేళ్లే ఉంది!

యూఎన్‌ఓ సూచించిన లక్ష్యాల్లో 'సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్ నంబర్ 8' ఒకటి. దీని ప్రకారం 2030 నాటికి సమాన వేతన సాధన అనే లక్ష్యాన్ని సాధించాలి. ఆ గడువు ముగియడానికి ఏడేళ్లే ఉంది. లక్ష్య సాధనలో మనం మరింత దూరం జరుగుతున్నాం తప్ప దగ్గరకు చేరడం లేదు. నాకు తెలిసిన ఐఐటీ , ఐఐఎమ్‌లో చదివిన మహిళలు కూడా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ వరకు వెళ్ల గలుగుతున్నారు. ఆ తర్వాత స్థానాలకు వెళ్లడం లేదు, వెళ్లడం లేదు అనేకంటే వెళ్లనివ్వడం లేదు అనడమే కరెక్ట్. సంఖ్యాపరంగా మహిళా ఉద్యోగులు దాదాపు సమానంగా ఉన్న కంపెనీల్లో కూడా ప్రెసిడెంట్, డైరెక్టర్ స్థానాల్లో మహిళలను చూడలేం. ఆశావహంగా అనిపించే విషయం ఏమిటంటే... మునుపటి తరం కంటే ఈ తరం అమ్మాయిలు గట్టిగా నిలబడగలుగుతున్నారు. రాబోయే తరం ఇంకా గట్టి మనో నిబ్బరంతో ముందడుగు వేస్తారని నా ఆకాంక్ష" అన్నారామె.

– వాకా మంజులారెడ్డి

అవకాశాల్లోనే హంసపాదు



పబ్లిక్ సెక్టార్‌లోనూ, ప్రభుత్వ రంగంలోనూ అనేక ఆఫీసుల్లో వర్క్ ప్లేస్ హెరాస్‌మెంట్ కమిటీల్లో మెంబర్‌గా ఉన్నాను. మగ అధికారులు ఉద్యోగినులతో 'నీకు ఇవన్నీ రావు, పక్కన ఉండు' అంటారని తెలిసింది. ఐటీ రంగంలో అయితే కంపెనీ ప్రతినిధిగా బయటి నగరాలకు, విదేశాలకు వెళ్లి ప్రాజెక్టు నిర్వహించే అవకాశాలు మహిళలకు కాకుండా జూనియర్ అయిన మగవాళ్లకు దక్కుతున్న సందర్భాలే ఎక్కువ. చాలెంజింగ్ ప్రాజెక్టుల్లో తమను తాము నిరూపించుకునే అవకాశాల దగ్గరే వెనక్కు లాగుతుంటే... 'ఒకే సీనియారిటీ – ఒకే వేతనం' అనే సమానత్వం ఎక్కడ నుంచి వస్తుంది?

– మమతారఘువీర్ ఆచంట,
ఫౌండర్, తరుణి స్వచ్ఛంద సంస్థ,
టెక్నికల్ డైరెక్టర్, భరోసా, తెలంగాణ



న్యూస్‌మేకర్

ఇలాంటి కూతురు ఉండాలి!

'ఈ అమ్మాయిని చూస్తే చాలా సంతోషంగా ఉంది. ప్రతి తల్లిదండ్రులకు ఇలాంటి కూతురు ఉండాలి' అని సాక్షాత్తు కేరళ హైకోర్టు 17 ఏళ్ల దేవనంద గురించి అంది. ఎందుకో చదవండి!

కేరళలోని త్రిసూర్‌లో కాఫీ హోటల్ నడుపుకునే 48 ఏళ్ల ప్రతీష్‌కు నిన్న మొన్నటి దాకా జీవితం సాఫీగానే సాగింది. భార్య ధన్య, కూతురు దేవనంద, కొడుకు ఆదినాథ్... అందరిలాంటి ఒక మామూలు మధ్యతరగతి కుటుంబం. అయితే ఈ మధ్య కాలు వాపు తరచూ కనిపిస్తుండేసరికి డాక్టర్ దగ్గరకు వెళ్లాడు. పరీక్షలు చేశాక డాక్టర్లు పిడుగులాంటి వార్త చెప్పారు– లివర్ కేన్సర్. వైద్యం అంటూ లేదు... లివర్ ట్రాన్స్‌ప్లాంటేషనే శరణ్యం అని తేల్చి చెప్పారు. అది కూడా వెంటనే జరగాలని చెప్పారు.

ఆ మధ్యతరగతి కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. కొచ్చిలోని రాజగిరి హాస్పిటల్ వారు మీరు డోనర్‌ని తెస్తే మేము ట్రాన్స్‌ప్లాంట్ చేస్తాం అని భరోసా ఇచ్చారు. కాని లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు డోనర్ దొరకడం అంత సులభం కాదు. దొరికినా సూట్ కావాలి. సమయం లేదు...



తండ్రికే తల్లి అయిన కూతురు దేవనంద

మరి ఏం చెయ్యాలి? నేనే ఎందుకు ఇవ్వకూడదు అనుకుంది కూతురు. ఇంటర్ సెకండియర్ చదువుతున్న దేవనంద తండ్రిని కోల్పోవడానికి సిద్ధంగా లేదు.

మరో ఆలోచన చేయకుండా ఆస్పత్రి వర్గాల దగ్గరకు పోయి తనే లివర్‌లోని కొంత భాగం డొనేట్ చేయవచ్చా అని అడిగింది. చేయచ్చు గాని 'ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్ యాక్ట్ 1994' ప్రకారం మైనర్లకు అనుమతి లేదని చెప్పారు. దేవనంద ఇంటర్‌నెట్ జల్లెడ పట్టింది. గతంలో ఇలాంటి కేసులో ఒక మైనర్‌కు ఆర్గాన్ డొనేట్ చేయడానికి కోర్టు అనుమతి ఇచ్చినట్టుగా చదివింది. అయితే ఆ మైనర్ నుంచి ఆర్గాన్ డొనేషన్ జరగలేదు. ఆ తీర్పు ఆధారంగా తాను హైకోర్టుకు వెళ్లాలని నిశ్చయించుకుంది.

జడ్జి పూనుకొని

హైకోర్టులో జస్టిస్ వి.జి.అరుణ్ సమక్షానికి ఈ కేసు వచ్చింది. ప్రత్యేకమైన కమిటీని వేసి ఆర్గాన్ యాక్ట్‌లో ఏదైనా మినహాయింపుతో దేవనంద తన తండ్రికి లివర్ ఇవ్వొచ్చో కూడదో సూచించమని ఆదేశించాడాయన. కమిటీ అధ్యయనం చేసి చిన్న వయసులో ఇవ్వడానికి ఏ మాత్రం వీలు లేదని, దేవనందను ఇందుకు అనుమతించ వద్దని తేల్చి చెప్పింది. కాని దేవనంద కమిటీ రిపోర్టును మళ్లీ సవాలు చేసి తండ్రిని కాపాడుకునే హక్కు తనకు ఉందని కోర్టుకు చెప్పింది. 'నాన్నను కోల్పోతే మేము దిక్కులేని వాళ్లం అవుతాం' అని చెప్పింది. జస్టిస్ వి.జి.అరుణ్ దేవనంద పట్టుదలను, తండ్రి కోసం ఆమె పడుతున్న ఆరాటాన్ని ఎంతో ప్రశంసించారు. 'ఇలాంటి కూతురు అందరికీ ఉండాలి' అన్నారు. ఈసారి మరో కమిటీని వేశారు. ఆ కమిటీ దేవనందకు అనుకూలంగా రిపోర్టు ఇవ్వడంతో డిసెంబర్ 2022లో అనుమతి ఇస్తూ తీర్పు చెప్పారు.

అన్ని విధాలా సిద్ధమయ్యి

ఈ విషయం తెలిసి బంధువులు వారించినా దేవనంద వెనక్కు తగ్గలేదు. తండ్రికి ఆరోగ్యకరమైన లివర్ ఇవ్వడానికి జిమ్‌లో చేరింది. మంచి పోషకాహారం తీసుకుంది. తండ్రి కోసం ఫిబ్రవరి 9న ఆపరేషన్ బల్ల ఎక్కింది. పెద్ద వైద్యుల బృందం ఆధ్వర్యంలో తండ్రీకూతుళ్లకు సర్జరీ చేసి లివర్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతం చేశారు. ఆపరేషన్ జరిగిన రాజగిరి హాస్పిటల్ యాజమాన్యం, డాక్టర్ల బృందం దేవనందకు ఫ్యాన్స్ అయ్యా రు. తండ్రీ కూతుళ్ల డిశ్చార్జ్ అవుతుంటే అందరూ వచ్చి జ్ఞాపికతో వారిని సాగనంపారు. అంతేనా? దేవనంద పట్టుదల, ప్రేమను చూసి తండ్రి ఆపరేషన్ ఖర్చులను మాఫీ చేశారు. కూతురు ప్రేమ సాధించిన ఘన విజయంగా దీనిని అభివర్ణించవచ్చు.

ఫస్ట్ టైమ్

మేఘనత

భారతీయ మూలాలు ఉన్న ప్రొఫెసర్ మేఘనా పండిత్ బ్రిటన్‌లోని ప్రసిద్ధ ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ హాస్పిటల్స్ సీయివోగా నియమితురాలై ఈ బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా ప్రత్యేకత చాటుకుంది.

గత సంవత్సరం జులై నుంచి బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ హాస్పిటల్స్(వోయుహెచ్), నేషనల్ హెల్త్ సర్వీసెస్ ట్రస్ట్(ఎన్‌హెచ్‌ఎస్)కు తాత్కాలిక సీయివో గా బాధ్యతలు నిర్వహించిన మేఘన ఇప్పుడు శాశ్వత ప్రాతిపదికన ఆ బాధ్యత లు చేపట్టబోతోంది. 'సీయివోగా మేఘన నియామకం సంతోషం కలిగిస్తుంది. విషయం మీద ఆసక్తి, అనురక్తి మాత్రమే కాదు అంకిత భావం, క్రమశిక్షణ ఉంటే ఉన్నతస్థాయికి ఎదగవచ్చు అని చెప్పడానికి ఆమె ఉదాహరణ. ఉద్యోగులతో కలిసి పనిచేసే తీరు ఆమెలోని నాయకత్వ లక్షణాలకు అద్దం పడుతుంది. ట్రస్ట్‌కు సంబంధించిన విలువలు కాపాడడంలో, ట్రస్ట్ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆమె నాయకత్వ బలం ఉపయోగపడుతుంది' అంటున్నారు ట్రస్ట్ చైర్‌పర్సన్ జోనాథన్.



మేఘనా పండిట్

'ఎన్‌హెచ్‌ఎస్'కు బ్రిటన్‌లో ఎన్నో టీచింగ్ హాస్పిటల్స్ ఉన్నాయి. యూరప్‌లో అత్యధిక సంఖ్యలో హాస్పిటల్స్ ఉన్నాయి. ట్రస్ట్ ఆధ్వర్యంలో విలువైన పరిశోధనలు జరుగుతున్నాయి. గతంలో 'ఎన్‌హెచ్‌ఎస్'కు సంబంధించి చీఫ్ మెడికల్ ఆఫీసర్(సిఎంవో)గా విధులు నిర్వహించింది మేఘన. వార్‌విక్ యూనివర్శిటీ హానరరీ ప్రొఫెసర్‌గా నియామకం అయింది. ముంబైలో ఎంబీబీఎస్ చేసిన మేఘనా పండిత్ బోధన నుంచి నిర్వహణ వరకు తనదైన ప్రతిభతో ముందుకు దూసుకువెళుతుంది.

పుష్కరకాలంగా ప్రకృతి సేద్యం

సేంద్రియ కర్బనం 3%

● ఎకరానికి 45 బస్తాల వరకు ధాన్యం దిగుబడి ● తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికరాదాయం ● విదేశాలకు ఎగుమతి చేస్తున్న రైతు కృష్ణ

ప్రకృతి సేద్య పద్ధతుల్లో సాగవుతున్న వరి పొలంలో రైతు అరిమిల్లి కృష్ణ



● ధాన్యం చూపుతున్న కృష్ణ

ఈ రైతు పేరు అరిమిల్లి కృష్ణ. ఆయనది కర్నూలు జిల్లా పశ్చిమాన కరువు కేరాఫ్‌గా ఉన్న కోసిగి మండలం కోల్మాన్‌పేట గ్రామం. బీటెక్ మెకానికల్ ఇంజనీర్ చదివారు. అయినా, పాతికేళ్ల నుంచి మక్కువతో వ్యవసాయం చేస్తున్నారు. రసాయనిక వ్యవసాయం నష్టదాయకంగా పరిణమించటంతో పన్నెండేళ్ల క్రితం సాగు పద్ధతిని మార్చుకున్నారు. కృష్ణ వ్యవసాయ క్షేత్రంలో 40 కుపైగా ఆవులున్నాయి. 70 ఎకరాల్లో స్వచ్ఛమైన ప్రకృతి వ్యవసాయం కొనసాగిస్తూ ఇటు భూసారం, అటు దిగుబడుల పెంపుదల, నేరుగా వినియోగదారులకు బియ్యం విక్రయం వంటి అనేక విషయాల్లో అద్భుతాలు సాధించారు. 44 ఎకరాల్లో వరి, 6 ఎకరాల్లో మామిడి, 5 ఎకరాల్లో పప్పుధాన్యాలు, 8 ఎకరాల్లో మల్బరీతోట,4 ఎకరాల్లో జీలుగ, 3 ఎకరాల్లో నేపియర్ పశుగ్రాసం వేస్తున్నారు.

రసాయనిక సేద్యంలో నుంచి ప్రకృతి సేద్యంలోకి కృష్ణ మళ్లేనాటికి ఆయన పొలం మట్టిలో సేంద్రియ కర్బనం 0.6 శాతానికి పడిపోయి భూమి నిస్సారమైపోయింది. పేడ, ఘన జీవామృతం, ద్రవ జీవామృతంతో భూసారాన్ని కాపాడుకోగలమని ఆయన నిరూపించారు. ప్రస్తుతం ఆయన పొలంలో సేంద్రియ కర్బనం 3%కి పెరిగింది. రసాయనాలకు బదులుగా జీవామృతాలు, కషాయాలు సొంతంగా తయారు చేసుకుని పంట సంరక్షణ చేస్తున్నారు.

ఎకరానికి 35–45 బస్తాల ధాన్యం

ఆర్.ఎస్.ఆర్. 15048, ఎన్‌డిఎల్‌ఆర్7 వరి రకాలు ప్రకృతి వ్యవసాయానికి బాగా నప్పుతాయని కృష్ణ అనుభవపూర్వకంగా చెబుతున్నారు. ఎకరానికి ఖరీఫ్‌లో 35 బస్తాలు, రబీలో 40–45 బస్తాల మేరకు రసాయనిక సేద్యం చేసే రైతులతో సమానంగా దిగుబడి పొందుతున్నారు. తక్కువ పెట్టుబడితోనే రసాయన సాగుకు మించి లాభాలు తీస్తున్నానని కృష్ణ తెలిపారు. 2012 ఏటా నుంచి ఇదే పద్ధతుల్లోనే వ్యవసాయం చేస్తున్నారు. నంద్యాల వ్యవసాయ పరిశోధనా స్థానం, యాగంటిపల్లె, బనవాసి కేవీకేల శాస్త్రవేత్తలు ఆయన పొలంలో, పంట దిగుబడుల్లో వస్తున్న మార్పుల్ని గమనిస్తూ సూచనలిచ్చి ప్రోత్సహిస్తున్నారు. భారతీయ వైద్య పరిశోధనా మండలికి చెందిన జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్) కృష్ణ ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆర్‌ఎస్‌ఆర్ 15048 వరి బియ్యంపై అధ్యయనం చేసింది. ఈ బియ్యం షుగర్ రోగుల, హృద్రోగుల ఆరోగ్యం మెరుగుదలకు ఇవి ఉపయోగపడుతున్నాయని తేల్చింది. ఈ అధ్యయన వివరాలతో ఎన్‌ఐఎన్ శాస్త్రవేత్త డా. దమయంతి రాసిన వ్యాసం అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌లో అచ్చయ్యింది.

ఏటా 700 బస్తాలకుపైగా బియ్యాన్ని విక్రయిస్తున్నారు. టోకుగా కిలో రూ.60–62, రిటైల్‌గా రూ. 70లకు బియ్యాన్ని వారానికి రెండు సార్లు మరపట్టించి వినియోగదారులకు ట్రాన్స్‌పోర్ట్ ద్వారా పంపుతున్నారు. రసాయన ఎరువులతో సాగు చేసిన బియ్యం కంటే సేంద్రియ బియ్యాన్ని ఎక్కువ ధరకు ప్రజలు కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు. తాను పండించిన వరి బియ్యం దుబాయ్, ఖతర్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు వివిధ కంపెనీల ద్వారా ఎగుమతి చేశారు. దుబాయిలో కేజీ బియ్యం రూ.280 చొప్పున విక్రయిస్తున్నారని తెలిపారు. త్వరలో సొంతంగా బ్రాండ్‌పై విదేశాలకు ఎగుమతి చేయాలనుకుంటున్నానని కృష్ణ వివరించారు. భవిష్యత్తు దృష్ట్యా విషతుల్య సాగు పద్ధతులను విడనాడి ప్రకృతి సాగుపై దృష్టి సారించాలని రైతులకు ఆయన సూచిస్తున్నారు. తమ ఊర్లో 300 మంది రైతులు ఆవులను పెంచేలా అవగాహన తీసుకువచ్చానని, వరి సాగులో ఎవ్వరూ రసాయన పురుగు మందులు వాడటం లేదని కృష్ణ (95533 42667) గర్వంగా చెబుతున్నారు.

– కుమ్మరి పరశురాం,
సాక్షి, మంత్రాలయం, కర్నూలు జిల్లా

సాగుబడి
శతభిష కార్తె:
ఫిబ్రవరి 19
నుంచి

● సమీకృత సేంద్రియ సేద్యం

ఎకరంన్నరలో ఏటా రూ.4 లక్షలు

● ప్రతి రోజూ రూ. 1,500 ఆదాయాన్నందించే సమీకృత సేద్యం ● ఎకరంన్నరలో ఏకకాలంలో ఎన్నో పంటలు, మేకలు, కోళ్లు, ముత్యాలు, పుట్టగొడుగుల పెంపకం.. ఏడాదికి రూ. 4 లక్షలకు పైగా నికరాదాయం ● మార్గదర్శకంగా నిలుస్తున్న శేషు, లక్ష్మీప్రియ దంపతులు

ఏదో ఒక పంట సాగుపై ఆధారపడి జీవించే రైతు కుటుంబాలు ఆదాయపరంగా ఎన్నో ఇబ్బందులకు గురవుతుంటాయి. ముఖ్యంగా, ఎకరం, రెండెకరాల భూమి మాత్రమే కలిగి ఉన్న చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు ఏక పంటల సాగుతో తగినంత ఆదాయం పొందలేక అప్పుల పాలవుతున్న పరిస్థితులు చూస్తున్నాం. ఈ దుస్థితి నుంచి రైతులు బయటపడాలంటే సమీకృత సేంద్రియ వ్యవసాయం ఒక్కటే మార్గం. సమీకృత సేద్యం అంటే.. చిన్న కమతం నుంచి కూడా ఒకటికి నాలుగు విధాలుగా ఆదాయం వచ్చే విధంగా కృషి చెయ్యటం అన్నమాట. నిరంతర ఆదాయం వచ్చేలా సమీకృత సేంద్రియ సేద్యం చేపట్టి.. నిరంతరం ఆదాయం పొందే మార్గాలను ఆచరించి చూపుతున్నారు సూర్యాపేట జిల్లాకు చెందిన రైతు దంపతులు వాసికర్ల శేషుకుమార్, లక్ష్మీప్రియ.



రెక్కల కష్టాన్ని నమ్ముకునే చిన్న, సన్నకారు రైతు దంపతులకు ఏడాది పొడవునా అనుదినం ఆదాయాన్ని అందించే విధంగా సమీకృత సేంద్రియ సేద్య పద్ధతులను విజయవంతంగా ఆచరించి చూపిస్తున్నారు వాసికర్ల శేషుకుమార్(53), లక్ష్మీప్రియ దంపతులు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం సిరిపురం గ్రామానికి చెందిన శేషుకుమార్(53) ఎమ్మే చదువుకొని గత 30 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. అభ్యుదయ భావాలు కలిగిన ఆయన 25 ఎకరాల్లో డ్రమ్‌సీడర్, వెద పద్ధతుల్లో వరి పండిస్తున్నారు. నాగార్జునసాగర్ కాల్వ పక్కనే పొలం ఉండటంతో సాగు నీటికి దిగులు లేదు. వరి సాగు నష్టదాయకంగా పరిణమిస్తున్న నేపథ్యంలో వరికి బదులుగా.. కాయ కష్టం చేసే రైతు కుటుంబాలకు రోజూ ఆదాయాన్నిచ్చే సమీకృత సేంద్రియ వ్యవసాయ నమూనా వైపు ఏడాదిన్నర క్రితం దృష్టి సారించారు. ఎకరంన్నర విస్తీర్ణంలో సమీకృత సేంద్రియ సేద్యం చేపట్టారు. ఈ క్షేత్రం ప్రదర్శన క్షేత్రంగా, రైతులకు శిక్షణా కేంద్రంగా మారింది. శేషు అనుసరిస్తున్న సమీకృత సేంద్రియ సేద్య నమూనా రైతులను ఆకర్షిస్తోంది. కూరగాయలు, పశుగ్రాస పంటలతో పాటు దీర్ఘకాలిక పండ్ల చెట్లను పూర్తి సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. దీనితో పాటు.. మేకలు గొర్రెలు, నాటుకోళ్లు, పుట్టగొడుగులు, ముత్యాల పెంపకాన్ని చేపట్టి ఒకటికి నాలుగు రకాలుగా నిరంతరం ఆదాయం పొందటమే ఈ నమూనాలో ప్రత్యేకత. ఎకరంన్నరలో మొదట గొర్రెలు, మేకలు పెంచేందుకు ప్రత్యేకంగా ఎలివేటెడ్ షెడ్‌ను రూ. 5 లక్షల ఖర్చుతో నిర్మించారు. షెడ్ పైఅంతస్థులో మేకలు, గొర్రెలు పెరుగుతూ ఉంటే.. షెడ్ కింద కొంత భాగంలో నాటు కోళ్ళ పెంపకానికి శ్రీకారం చుట్టారు. షెడ్ కింద మిగతా భాగంలో ఒక డార్క్ రూమ్‌ను నిర్మించి పాల పుట్టగొడుగుల పెంపకానికి ఉపయోగిస్తున్నారు. 3 సిమెంటు ట్యాంకులు నిర్మించి స్థానికంగా సేకరించిన 5 వేల ఆల్‌చిప్పల్లో 3 నెలల క్రితం ముత్యాల సాగు ప్రారంభించారు.

ఈ సమీకృత వ్యవసాయం క్షేత్రం చుట్టూ ప్రత్యేకంగా కంచె ఏర్పాటు చేశారు. చుట్టూతా కొబ్బరి, డ్రాగన్‌ఫ్రూట్ తదితర దీర్ఘకాలిక పండ్ల మొక్కలు నాటారు. ప్లాస్టిక్ షీట్‌తో మల్చింగ్ చేసి.. బోడ కాకర, బీర, సొర, కాకర సాగు చేపట్టారు. వంగ, టమాటో, మిర్చి, బోడ కాకర, బీర, సొర, నేతి బీర, కాకర, పొట్ల, చిక్కుడు, మునగ, బంతి, గులాబీ తదితర రకాల పంటల సాగు చేపట్టారు. పశువుల కోసం నేపియర్, దశరథ గడ్డి, మొక్కజొన్న గడ్డిని పెంచుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఎక్కడా చోటు వృథా కాకుండా అధిక సాంద్రతలో అనేక పంటలు, పండ్ల మొక్కలు నాటారు. ఈ క్షేత్రంలో ఎలాంటి రసాయనాలను ఉపయోగించటం లేదు. ఒకటికి నాలుగు దారుల్లో ఆదాయం పొందే సాగు పద్ధతిపై చిన్న, సన్నకారు రైతులు, మహిళలకు స్ఫూర్తినిస్తున్న శేషుకుమార్ దంపతులు ధన్యులు.

– మొలుగూరి గోపి, సాక్షి, నడిగూడెం, సూర్యాపేట జిల్లా

చిన్న రైతులు నిత్యం ఆదాయం పొందాలి

వరి పంట సాగులో పెట్టుబడులు బాగా పెరిగాయి. కూలీల కొరత ఇబ్బందిగా మారింది. దీంతో నిత్యం ఆదాయం పొందే విధంగా ఈ సమీకృత వ్యవసాయంపై ఆసక్తి కలిగింది. తక్కువ భూమిలో విభిన్న రకాల పంటల సాగు చేపట్టాం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే విధంగా ప్రణాళికతో ముందుకువెళ్తున్నాం.

– **వాసికర్ల లక్ష్మీప్రియ,** సమీకృత సేంద్రియ మహిళా రైతు, సిరిపురం, సూర్యాపేట జిల్లా

సులువుగా సేంద్రియ పుట్టగొడుగుల పెంపకం

సమీకృత వ్యయసాయ క్షేత్రంలో షెడ్డులో సేంద్రియ పద్ధతుల్లో పాల పుట్టగొడుగుల పెంపకం చేపట్టారు. వరిగడ్డి ముక్కలను, మట్టిని ప్రత్యేక పద్ధతుల్లో శుద్ధి చేసి, పుట్టగొడుగుల పెంపకానికి పాలిథిన్ బ్యాగ్‌లను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియ అంతా పరిశుద్ధమైన 27 డిగ్రీల వాతావరణంలో గాలి, వెల్తురు తగలని చీకటి గదిలో జరుగుతుంది. బ్యాగ్‌లలో నింపిన గడ్డిపై మైసీలియం అనే శిలీంధ్రం అభివృద్ధి చెందిన తర్వాత బ్యాగ్‌లను మామూలు గదిలోకి మార్చుతారు. వారం తర్వాత నుంచి పుట్టగొడుగుల దిగుబడి వస్తుంది. వరిగడ్డి ముక్కలను స్టెయిన్‌లెస్ స్టీల్ డ్రమ్స్ సహాయంతో ఆవిరి ద్వారా శుద్ధి చేసే ప్రత్యేక పద్ధతిని శేషు అనుసరిస్తున్నారు. దీని వల్ల గడ్డి వెంటనే తడి ఆరిపోతుందన్నారు. ఈ విధంగా సేంద్రియ పద్ధతిలో పుట్టగొడుగుల పెంపకం సులభతరమైందని శేషు చెప్పారు.

ముత్యాల సాగును ఒక్క రోజులో నేర్చుకోవచ్చు

ఎకరంన్నరలో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్న శేమకుమార్ దంపతులు ప్రత్యేక షెడ్‌లో మూడు సిమెంటు ట్యాంకులను నిర్మించి ముత్యాల సాగు చేపట్టారు. దేవతా రూపాల్లో డిజైనర్ ముత్యాలైతే 14 నెలల్లో, ఎం.ఓ.పి. న్యూక్లియస్‌ల ద్వారా గుండ్రటి ముత్యాలైతే 18 నెలల్లో దిగుబడి వస్తుందన్నారు. ఒక ఆల్‌చిప్పకు రెండు ముత్యాలు వస్తాయి. నాణ్యతను బట్టి ధర ఉంటుంది. సగటున ధర రూ. 150–200 ఉంటుంది. ఒక రోజు శిక్షణతో మహిళలు కూడా ముత్యాల సాగును నేర్చుకోవచ్చు.

చిన్న రైతులకు దారి చూపాలని..

భూమి తక్కువగా ఉండే చిన్న, సన్నకారు రైతు దంపతులు ఏదో ఒకే పంట సాగుపై ఆధారపడితే తగినంత ఆదాయం రాదు. సమీకృత సేంద్రియ సాగు చేపడితే రోజువారీగా మంచి ఆదాయం పొందే అవకాశాలు ఎన్నో ఉన్నాయి. అందుకని, ఎకరంన్నర పొలంలో ఈ క్షేత్రాన్ని రూపొందించాం. ఎకరంన్నర భూమిలో భార్య, భర్త స్వయంకృషి చేస్తే అన్ని ఖర్చులూ పోను రూ. 4 లక్షలకు పైగా నికరాదాయం వస్తోంది. ఈ సందేశం రైతులందరికీ తెలియజెప్పాలనేదే మా తపన. రోజుకు రూ.1,500 ఆదాయం వస్తున్నది. రెండు వేలకు పెంచాలనేది లక్ష్యం. ప్రతి రైతూ ముందుకు రావాలి. ప్రభుత్వం అవగాహన కల్పించాలి.

– **వాసికర్ల శేషుకుమార్** (91824 06310),
సమీకృత సేంద్రియ రైతు, సిరిపురం, సూర్యాపేట జిల్లా

నిర్వహణ:
పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



టైటిల్‌తో అల్‌కరాజ్ పునరాగమనం

కుడి కాలి గాయం నుంచి కోలుకున్న ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్) ఈ ఏడాది బరిలోకి దిగిన తొలి టోర్నీలోనే టైటిల్ సాధించాడు. అర్జెంటీనా ఓపెన్ టోర్నీ ఫైనల్లో 19 ఏళ్ల అల్‌కరాజ్ 6-3, 7-5తో 12వ ర్యాంకర్ కామెరాన్ నోరీ (బ్రిటన్)పై గెలిచాడు. అల్‌కరాజ్‌కు 95,305 డాలర్ల (రూ. 78 లక్షల 83 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 250 పాయింట్లు లభించాయి. గతేడాది యూఎస్ ఓపెన్ గెలిచాక నంబర్‌వన్ అయిన అల్‌కరాజ్ ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు దూరం కావడంతో టాప్ ర్యాంక్ కోల్పోయాడు.

సానియా మ్యాచ్ నేటికి వాయిదా



దుబాయ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో భారత స్టార్ సానియా మీర్జా మహిళల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్ నేటికి వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం సోమవారమే సానియా మీర్జా-మాడిసన్ కీస్ (అమెరికా) జోడీ తొలి రౌండ్‌లో కుదెర్‌మెతోవా-సమ్‌సనోవా (రష్యా) ద్వయంతో ఆడాల్సింది. అయితే ఇతర మ్యాచ్‌లు సుదీర్ఘంగా సాగడంతో సానియా మ్యాచ్ అనుకున్న సమయానికి ప్రారంభమయ్యే అవకాశం లేకపోవడంతో నిర్వాహకులు నేటికి వాయిదా వేశారు. ఈ టోర్నీతో సానియా తన కెరీర్‌కు వీడ్కోలు పలకనుంది.

దర్జాగా సెమీస్‌కు...



స్మృతి మంధాన

- మహిళల టి20 ప్రపంచకప్‌లో నాకౌట్ దశకు టీమిండియా
- చివరి లీగ్ మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై విజయం
- స్మృతి మంధాన మెరుపులు



వికెట్ తీసిన ఆనందంలో రేణుక సింగ్

కెబెహ (దక్షిణాఫ్రికా): ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా, ఇతర జట్ల మ్యాచ్‌ల ఫలితాలపై ఆధారపడకుండా భారత మహిళల జట్టు టి20 ప్రపంచకప్‌లో నేరుగా సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఐర్లాండ్‌తో సోమవారం జరిగిన గ్రూప్-2 చివరి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా 'డక్‌వర్త్ లూయిస్' పద్ధతిలో ఐదు పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 155 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్మృతి మంధాన (56 బంతుల్లో 87; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడి టాప్ స్కోరర్‌గా నిలిచింది. టి20 కెరీర్‌లో స్మృతికిదే అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం విశేషం. స్మృతి మూడుసార్లు ఇచ్చిన క్యాచ్‌లను ఐర్లాండ్ ఫీల్డర్లు వదిలేయడం గమనార్హం. షఫాలీ వర్మ (29 బంతుల్లో 24; 3 ఫోర్లు)తో తొలి వికెట్‌కు 62 పరుగులు జోడించిన స్మృతి... హర్మన్‌ప్రీత్ (20 బంతుల్లో 13)తో రెండో వికెట్‌కు 52 పరుగులు జత చేసింది. 156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్ 8.2 ఓవర్లలో 2 వికెట్లకు 54 పరుగులు సాధించిన సమయంలో వర్షం రావడంతో ఆటకు అంతరాయం ఏర్పడింది. వర్షం తగ్గకపోవడంతో మిగతా ఓవర్ల ఆట సాధ్యపడలేదు. 'డక్‌వర్త్ లూయిస్' పద్ధతి ప్రకారం 8.2 ఓవర్లలో ఐర్లాండ్ విజయసమీకరణం 59 పరుగులుగా ఉంది. అయితే ఆ జట్టు ఐదు పరుగులు వెనుకపడి ఉండటంతో భారత విజయం ఖరారైంది. ఈ టోర్నీలో ఐర్లాండ్ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోవడం గమనార్హం. ఈ గెలుపుతో భారత్ ఆరు పాయింట్లతో గ్రూప్-2లో రెండో స్థానంతో సెమీఫైనల్ చేరింది. గురువారం జరిగే సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్, గ్రూప్-1 టాపర్ ఆస్ట్రేలియాతో భారత్ ఆడుతుంది.

పాకిస్తాన్‌తో నేడు తమ చివరి లీగ్ మ్యాచ్ ఆడనున్న ఇంగ్లండ్ ఆరు పాయింట్లతో ఇప్పటికే గ్రూప్-2 నుంచి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. రన్‌రేట్ పరంగా భారత్ (0.253) కంటే ఇంగ్లండ్ (1.776) మెరుగ్గా ఉంది. ఒకవేళ నేటి మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఓడిపోయినా గ్రూప్-2లో ఆ జట్టే 'టాప్'లో నిలుస్తుంది. గ్రూప్-2 టాపర్ హోదాలో ఇంగ్లండ్ శుక్రవారం జరిగే రెండో సెమీఫైనల్లో గ్రూప్-1లో రెండో స్థానంలో నిలిచే అవకాశమున్న న్యూజిలాండ్ లేదా దక్షిణాఫ్రికాతో ఆడుతుంది. గ్రూప్-1లో న్యూజిలాండ్ నాలుగు మ్యాచ్‌లు పూర్తి చేసుకొని 4 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. నేడు బంగ్లాదేశ్‌తో చివరి మ్యాచ్ ఆడనున్న దక్షిణాఫ్రికా సెమీస్ చేరాలంటే తప్పనిసరిగా గెలవాలి. అలా జరిగితే దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక 4 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలుస్తాయి. ఈ దశలో న్యూజిలాండ్, శ్రీలంకకంటే మెరుగైన రన్‌రేట్ ఉన్న దక్షిణాఫ్రికా సెమీస్ చేరుకుంటుంది.

1 ఐర్లాండ్ మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో 150 మ్యాచ్‌లు ఆడిన తొలి క్రికెటర్‌గా భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ రికార్డు నెలకొల్పింది. 2009 తొలి టి20 ప్రపంచకప్‌లో మొదటి మ్యాచ్ ఆడిన హర్మన్ 2023లో టి20 ప్రపంచకప్‌లోనే తన 150వ మ్యాచ్ ఆడటం విశేషం.



4 అంతర్జాతీయ మహిళల టి20ల్లో 3,000 పరుగులు పూర్తి చేసుకున్న నాలుగో క్రికెటర్‌గా, భారత్ నుంచి ఈ ఘనత సాధించిన తొలి క్రికెటర్‌గా హర్మన్‌ప్రీత్ గుర్తింపు పొందింది. టాప్-3లో సుజీ బేట్స్ (3,820-న్యూజిలాండ్), మెగ్ లానింగ్ (3,346-ఆస్ట్రేలియా), స్టెఫానీ టేలర్ (3,166-వెస్టిండీస్) ఉన్నారు.

5 టి20 ప్రపంచకప్ టోర్నీలో భారత మహిళల జట్టు సెమీఫైనల్ చేరుకోవడం ఇది ఐదోసారి. 2009, 2010, 2018లలో సెమీఫైనల్లో ఓడిన భారత్ 2020లో రన్నరప్‌గా నిలిచింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (సి) అమీ హంటర్ (బి) లౌరా డెలానీ 24; స్మృతి మంధాన (సి) గ్యాబీ లూయిస్ (బి) ఒర్లా ప్రెండర్‌గాస్ట్ 87; హర్మన్‌ప్రీత్ కౌర్ (సి) ప్రెండర్‌గాస్ట్ (బి) లౌరా డెలానీ 13; రిచా ఘోష్ (సి) గ్యాబీ లూయిస్ (బి) లౌరా డెలానీ 0; జెమీమా రోడ్రిగ్స్ (స్టంప్డ్) వాల్డ్రోన్ (బి) కెల్లీ 19; దీప్తి శర్మ (సి) డెంప్సీ (బి) ప్రెండర్‌గాస్ట్ 0; పూజా వస్త్రకర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 155. వికెట్ల పతనం:** 1-62, 2-114, 3-115, 4-143, 5-143, 6-155.

బౌలింగ్: ఒర్లా ప్రెండర్‌గాస్ట్ 4-0-22-2, డెంప్సీ 3-0-27-0, కెల్లీ 4-0-28-1, లెహ్ పాల్ 3-0-27-0, కారా ముర్రే 2-0-16-0, లౌరా డెలానీ 4-0-33-3.

ఐర్లాండ్ ఇన్నింగ్స్: అమీ హంటర్ (రనౌట్) 1; గ్యాబీ లూయిస్ (నాటౌట్) 32; ప్రెండర్‌గాస్ట్ (బి) రేణుక సింగ్ 0; లౌరా డెలానీ (నాటౌట్) 17; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (8.2 ఓవర్లలో 2 వికెట్లకు) 54. వికెట్ల పతనం:** 1-1, 2-1. **బౌలింగ్:** రేణుక 2-0-10-1, శిఖా పాండే 2.2-0 -14-0, దీప్తి 1-0-11-0, రాజేశ్వరి 1-0-5-0.

గ్రూప్-2 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	ర.రే.
ఇంగ్లండ్	3	3	0	6	1.776
భారత్	4	3	1	6	0.253
వెస్టిండీస్	4	2	2	4	-0.601
పాకిస్తాన్	3	1	2	2	0.981
ఐర్లాండ్	4	0	4	0	-1.814

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

'మిక్స్‌డ్'లో పసిడి కాంతులు

ఎయిర్ రైఫిల్, పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు రెండు స్వర్ణ పతకాలు





బంగారు పతకాలతో భారత షూటర్లు నర్మద, రుద్రాంక్ష్ పాటిల్, వరుణ్ తోమర్, రిథమ్ సాంగ్వాన్

కైరో (ఈజిప్ట్): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో వరుసగా రెండో రోజు భారత్ ఖాతాలో పతకాలు చేరాయి. సోమవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్, ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్స్‌లో భారత జోడీలు స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నాయి. ఎయిర్ రైఫిల్ విభాగంలో నర్మద నితిన్ రాజు-రుద్రాంక్ష్ బాలాసాహెబ్ పాటిల్ జోడీ... ఎయిర్ పిస్టల్ విభాగంలో వరుణ్ తోమర్-రిథమ్ సాంగ్వాన్ జోడీ విజేతగా నిలిచాయి. ఎయిర్ రైఫిల్ టీమ్ మిక్స్‌డ్ ఫైనల్లో తమిళనాడుకు చెందిన నర్మద, మహారాష్ట్రకు చెందిన రుద్రాంక్ష్ జోడీ 16-6తో ఎస్టెర్ డెనిస్-ఇస్త్వాన్ పెని (హంగేరి) ద్వయంపై గెలిచింది. క్వాలిఫయింగ్ రౌండ్‌లో నర్మద-రుద్రాంక్ష్ 635.8 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచి ఫైనల్‌కు చేరారు. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఫైనల్లో వరుణ్-రిథమ్ ద్వయం 16-10తో జొరానా అరునోవిచ్-దామిర్ మికెచ్ (సెర్బియా) జోడీని ఓడించింది. క్వాలిఫయింగ్ రౌండ్‌లో వరుణ్-రిథమ్ ద్వయం 583 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచి ఫైనల్ చేరింది. ఆదివారం జరిగిన ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో వరుణ్ కాంస్య పతకాన్ని సాధించాడు. ప్రస్తుతం భారత్ రెండు స్వర్ణాలు, ఒక కాంస్యంతో కలిపి మూడు పతకాలతో అగ్రస్థానంలో ఉంది.

ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీలకు సురేఖ, ధీరజ్





సోనీపత్ (హరియాణా): ఈ ఏడాది జరిగే మూడు ప్రపంచకప్ టోర్నీలు... ప్రపంచ చాంపియన్‌షిప్... అనంతరం ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత పురుషుల, మహిళల రికర్వ్, కాంపౌండ్ జట్లను భారత ఆర్చరీ సంఘం సోమవారం ప్రకటించింది. పురుషుల రికర్వ్ జట్టులో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు తరఫున పోటీపడ్డ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్... మహిళల కాంపౌండ్ జట్టులో ఆంధ్రప్రదేశ్ మేటి క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ, తెలంగాణ అమ్మాయి తనిపర్తి చికిత చోటు సంపాదించారు. సోనీపత్‌లోని భారత స్పోర్ట్స్ అథారిటీ కేంద్రంలో నిర్వహించిన ట్రయల్స్ ఆధారంగా జట్లను ఎంపిక చేశారు. పురుషుల, మహిళల రికర్వ్ విభాగాల్లో ఎనిమిది మంది చొప్పున... పురుషుల, మహిళల కాంపౌండ్ విభాగాల్లో ఎనిమిది మంది చొప్పున ఎంపిక చేశారు. ఇందులో టాప్-4లో నిలిచిన వారికి తొలి ప్రాధాన్యత లభిస్తుంది. రెండు ప్రపంచకప్ టోర్నీ లు ముగిశాక టాప్-4లో నిలిచిన వారు విఫలమైతే తదుపరి టోర్నీకి 5 నుంచి 8 స్థానాల్లో నిలిచిన వారికి చాన్స్ ఇస్తారు. మూడు ప్రపంచకప్ టోర్నీలు అంటాల్యాలో (ఏప్రిల్ 18-23)... షాంఘైలో (మే 16-21)... కొలంబియాలో (జూన్ 13-18) జరుగుతాయి. ప్రపంచ చాంపియన్‌షిప్ జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు జర్మనీలో... ఆసియా క్రీడలు సెప్టెంబర్‌లో చైనాలో జరుగుతాయి. ట్రయల్స్‌లో విఫలమైన 'ట్రిపుల్ ఒలింపియన్' దీపిక కుమారి మహిళల రికర్వ్ జట్టులో చోటు సంపాదించలేకపోయింది.

మార్చి 18న ఐఎస్‌ఎల్ ఫైనల్



ముంబై: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నీ ఫైనల్ మార్చి 18న గోవాలోని ఫటోర్డా పట్టణంలో జరుగుతుంది. ప్లే ఆఫ్ మ్యాచ్‌లు మార్చి 3న మొదలవుతాయి. ఇప్పటికే టాప్-2లో నిలిచిన ముంబై సిటీ, డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ ఎఫ్‌సీ నేరుగా సెమీఫైనల్ చేరాయి.

సినిమా

కథ రమ్మంటే కాదంటారా!

కథ ఎవర్నైనా ఎక్కడికైనా తీసుకెళ్లగలదు. అలా ఈ మధ్య కొన్ని కథలు కొందరు బాలీవుడ్ యాక్టర్స్‌ను సౌత్‌కు రమ్మన్నాయి. ఆల్రెడీ హిందీ హీరోయిన్లు కొన్నేళ్లుగా సౌత్‌లో రాణిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు నటులు కూడా సౌత్‌లో స్టెప్ఇన్ అవుతున్నారు. మంచి కథలు పిలుస్తుండటంతో కాదనకుండా వచ్చేస్తున్నాం అంటూ కొందరు నార్త్ స్టార్స్ సౌత్ బాట పట్టారు. ఆ నటులు కమిట్ అయిన సౌత్ సినిమాల గురించి తెలుసుకుందాం.



అమితాబ్



సంజయ్ దత్



సైఫ్ అలీఖాన్



బాబీ డియోల్



నవాజుద్దీన్



అభిషేక్

నాగార్జున 'మనం' సినిమాలో అతిథిగా కనిపించిన బిగ్ బి అమితాబ్ బచ్చన్ ఆ తర్వాత చిరంజీవి 'సైరా: నరసింహారెడ్డి' చిత్రంలో నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. ప్రస్తుతం అమితాబ్ బచ్చన్ 'ప్రాజెక్ట్ కె' సినిమా చేస్తున్నారు. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్‌ది కీలక పాత్ర. ఈ చిత్రంతోనే తెలుగుకు పరిచయం అవుతున్నారు దీపికా పదుకోన్. 'ప్రాజెక్ట్ కె' వచ్చే ఏడాది జనవరి 12న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఇక బాలీవుడ్ స్క్రీన్‌పై హీరోగా ఓ వెలుగు వెలిగారు సంజయ్ దత్. ఇప్పటి తరానికి తెలిసి ఉండకపోవచ్చు కానీ 1998లో వచ్చిన 'చంద్రలేఖ' సినిమాతో తెలుగు తెరపైనా కనిపించారు సంజయ్. నాగార్జున హీరోగా నటించిన ఆ చిత్రంలో సంజయ్ దత్ ఓ అతిథి పాత్ర చేశారు. అలా ఈ బాలీవుడ్ స్టార్ సౌత్ ఎంట్రీ 25 ఏళ్ల క్రితమే జరిగింది. మళ్లీ ఆయన 2022లో కన్నడ 'కేజీఎఫ్: ఛాప్టర్ 2' ద్వారా దక్షిణాది తెరపై కనిపించారు. కన్నడంలో సంజయ్ దత్ చేసిన తొలి చిత్రం ఇదే. తాజాగా తమిళ చిత్రం 'లియో'కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు సంజయ్ దత్. విజయ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి లోకేష్ కనగరాజ్ దర్శకుడు. సంజయ్‌కు తమిళంలో 'లియో' తొలి సినిమా కావడం విశేషం. అలాగే తెలుగులోనూ ఆయన ఓ ఫుల్ లెంగ్త్ రోల్ చేయనున్నారనే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో 'రాజా డీలక్స్' (అధికారిక ప్రకటన రావాల్సి ఉంది) అనే చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమాలో సంజయ్ దత్‌ను ఓ కీ రోల్‌కు సంప్రదించారనే టాక్ గతంలో వినిపించింది. అదే నిజమైతే పాతికేళ్లకు సంజయ్ తెలుగులో సినిమా కమిట్ అయినట్లు అవుతుంది. మరో బీటౌన్ స్టార్ సైఫ్ అలీఖాన్ సైతం సౌత్‌పై ఫోకస్ పెట్టారని చెప్పొచ్చు. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన మైథలాజికల్ ఫిల్మ్ 'ఆదిపురుష్'లో నటించారు సైఫ్ అలీఖాన్. ప్రభాస్ టైటిల్ రోల్ చేసిన ఈ చిత్రానికి ఓం రౌత్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం జూన్ 16న రిలీజ్ కానుంది. కాగా ఎన్టీఆర్ హీరోగా నటించనున్న తాజా చిత్రంలో సైఫ్ అలీఖాన్ ఓ కీ రోల్ చేయనున్నారనే ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల కానుంది. మరోవైపు హిందీలో రెండు దశాబ్దాలుగా మంచి పాత్రలు చేస్తూ, నటుడిగా ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నవాజుద్దీన్ సిద్దిఖీ ఇప్పుడు మళ్లీ ఓ సౌత్ సినిమాకి 'సై' అన్నారు. రజనీకాంత్ హీరోగా 2019లో విడుదలైన తమిళ చిత్రం 'పేట్టా' (తెలుగులో 'పేట')లో ప్రతినాయకుడి పాత్ర చేశారు నవాజుద్దీన్. ఇప్పుడు ఐదు సంవత్సరాల తర్వాత మరో సౌత్ సినిమా 'సైంధవ్'కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వెంకటేశ్ హీరోగా 'హిట్' ఫ్రాంచైజీ ఫేమ్ దర్శకుడు శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమే 'సైంధవ్'. విడుదలైన గ్లింప్స్‌ని బట్టి ఈ చిత్రం మెడికల్ మాఫియా నేపథ్యంలో సాగుతుందని తెలుస్తోంది. నవాజుద్దీన్‌కు తెలుగులో ఇది తొలి చిత్రం. వెంకటేశ్ కెరీర్‌లో 75వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుంది. ఇక ఇంకో బాలీవుడ్ హీరో బాబీ డియోల్ సైతం తెలుగు డైలాగ్స్ చెబుతున్నారు. ఎందుకంటే 'హరి హర వీర మల్లు' చిత్రం కోసం. క్రిష్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ ఫిల్మ్ ఇది. ఆల్రెడీ ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు బాబీ డియోల్. ఈ చిత్రంలో ఔరంగజేబు పాత్రలో కనిపిస్తారాయన. ఈ సినిమాను ఈ ఏడాది రిలీజ్ చేయాలనుకుంటున్నారు. మరోవైపు దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ ఓ పీరియాడికల్ క్రైమ్ థ్రిల్లర్‌ను తెరకెక్కించడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. రెండు ప్రధాన పాత్రలతో సాగే ఈ చిత్రంలో ఓ హీరోగా విజయ్ సేతుపతిని, మరో హీరోగా అభిషేక్ బచ్చన్‌ను అనుకున్నారట గౌతమ్ మీనన్. అభిషేక్ బచ్చన్‌కు ఆల్రెడీ కథ కూడా వినిపించారట. మరి.. అభిషేక్ ఓకే చెబుతారా? వేచి చూడాలి. ఇదే కోవలో మరి కొందరు హిందీ తారలు దక్షిణాది చిత్రాలకు డేట్స్ ఇచ్చారు.

మా అన్నయ్య బంగారం



''మా అన్నయ్య మనసు బంగారం. అందుకే ఆయనపై బంగారాన్ని కురిపించడం నా అదృష్టంగా భావిస్తున్నాను'' అని రజనీకాంత్ అన్నారు. సోదరుడు సత్యనారాయణ రావు గైక్వాడ్ పుట్టినరోజుని రజనీకాంత్ అట్టహాసంగా జరిపారు. సతీమణి లతతో కలిసి బంగారు నాణేలతో తన అన్నయ్యకు అభిషేకం చేశారు రజనీ. ''ఈరోజు నేను ఈ స్థాయిలో ఉండటానికి కారణం మా అన్నయ్య. ఆయన 80వ పుట్టినరోజుని, అదే రోజు అన్నయ్య కుమారుడు రామకృష్ణ 60వ పుట్టినరోజుని జరపటం చాలా ఆనందంగా అనిపించింది. ఆ దేవుడికి ధన్యవాదాలు'' అని ఈ సందర్భంగా రజనీ ట్వీట్ చేశారు.

రజనీ, లత, సత్యనారాయణ

ఎన్టీఆర్ 30 వాయిదా



ఎన్టీఆర్

'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్- డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. 'ఎన్టీఆర్ 30' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ సినిమాకి ఈ నెల 24న కొబ్బరికాయ కొట్టాల్సింది. అయితే హీరో తారకరత్న మృతితో నందమూరి ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఈ కారణంగా ఎన్టీఆర్-కొరటాల శివ తాజా చిత్రం ప్రారంభోత్సవం వాయిదా పడింది. నందమూరి కల్యాణ్‌రామ్, సుధాకర్ మిక్కిలినేని నిర్మించనున్న ఈ చిత్రం ఎన్టీఆర్ కెరీర్‌లో 30వ మూవీ. ఈ నెలలో షూటింగ్ ప్రారంభించి, మార్చిలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టి, 2024 ఏప్రిల్ 5న ఈ సినిమాని రిలీజ్ చేయనున్నట్లు 'అమిగోస్' ప్రీ రిలీజ్ వేడుకలో ఎన్టీఆర్ స్వయంగా ప్రకటించారు. కాగా తాజాగా తారకరత్న మృతితో ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటిస్తూ ట్వీట్ చేసింది. ఇక 'ఎన్టీఆర్ 30'తో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా టాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వనున్నారని టాక్.

మహేశ్ సినిమాలో?



భూమి

'టాయ్‌లెట్ ఏక్ ప్రేమ్ కథ, బాలా, బధాయి దో' వంటి చిత్రాలతో బాలీవుడ్ ఆడియన్స్‌ని అలరించిన హీరోయిన్ భూమి ఫెడ్నేకర్ తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇవ్వనున్నారని సమాచారం. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం ద్వారానే భూమి టాలీవుడ్‌లోకి అడుగు పెట్టనున్నారని టాక్. ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమాలో పూజా హెగ్డే, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ చిత్రం ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. కాగా ఈ చిత్రంలో ఒక కీలక పాత్ర కోసం భూమి ఫెడ్నేకర్‌ని సంప్రదించారట. ఇది కానిస్టేబుల్ పాత్ర అని, సెకండాఫ్‌లో ఈ పాత్ర వస్తుందని వినికిడి. మరి.. ఈ చిత్రంలో ఈ పాత్ర ఉందా? ఉంటే.. భూమి ఫెడ్నేకర్‌నే చేస్తారా? లేక వేరే తార సీన్లోకి వస్తారా? వెయిట్ అండ్ సీ..

ప్రవేశం లేదు



ఆండ్రియా

ఆండ్రియా జెర్మియా లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'నో ఎంట్రీ' (ప్రవేశం లేదు). ఆర్. అళగు కార్తీక్ దర్శకత్వంలో శ్రీధర్ అరుణాచలం నిర్మించిన ఈ చిత్రం తెలుగు-తమిళ భాషల్లో త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా 'నో ఎంట్రీ' ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. అళగు కార్తీక్, శ్రీధర్ అరుణాచలం మాట్లాడుతూ- ''అటవీ నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రమిది. అటవీ ప్రాంతానికి విహారయాత్రకు వెళ్లిన కొందరు ఫ్రెండ్స్ కొండ శిఖరంలోని ఓ విల్లాలో బస చేస్తారు. ఆ విల్లాని అడవి కుక్కలు చుట్టుముడతాయి. వాటి బారి నుంచి వారు ఏ విధంగా తప్పించుకున్నారు? అన్నదే ఈ చిత్రకథ. ఈ చిత్రంలో ఆండ్రియా సాహసంతో కూడిన యాక్షన్ సన్నివేశాల్లో నటించారు'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
311	100
60,691	17,845

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్	11,787	▽	69
డోజోన్స్	33,827	△	130
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,014	△	10
డాక్స్	15,478	▽	4
షాంఘై	3,290	△	66
నికాయ్	27,532	△	19

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)	56,601
బంగారం (22 క్యారెట్)	56,374
వెండి (కేజీ)	65,760

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	81.95	83.62
£	బ్రిటన్ పౌండ్	[illegible]	86.90	90.00
€	యూరో	[illegible]	97.92	101.20
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	60.66	62.63
AUS$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	55.88	58.26
S$	సింగపూర్ డాలర్	[illegible]	60.94	62.93
SAR	సౌదీ రియాల్	[illegible]	21.06	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.63	23.42
¥	చైనా యువాన్	[illegible]	10.94	13.01

నీతి ఆయోగ్ సీఈఓగా సుబ్రహ్మణ్యం

ప్రపంచ బ్యాంక్ ఈడీగా అయ్యర్



న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ కొత్త సీఈఓగా మాజీ ఐఏఎస్ అధికారి బీవీఆర్ సుబ్రహ్మణ్యం నియమితుల య్యారు. ఇప్పటివరకు నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా బాధ్యతలు నిర్వహిస్తున్న పరమేశ్వరన్ అయ్యర్ ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వెళుతున్నారు. కేబినెట్ నియామకాల కమిటీ ఈ నియామకాలకు ఆమోదముద్ర వేసింది. అయ్యర్ మూడేళ్ల పాటు వాషింగ్టన్‌లోని ప్రపంచ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తారు. ఇక సుబ్రహ్మణ్యం రెండేళ్లపాటు ఈ బాధ్యతల్లో ఉంటారు. కాగా, 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి రాజేష్ కుల్లార్ స్థానంలో అయ్యర్ నియామకం జరిగింది.

అదానీ పోర్ట్స్ రుణ చెల్లింపు

తాజాగా రూ. 1,500 కోట్లు



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ తాజాగా రూ. 1,500 కోట్ల రుణాన్ని తిరిగి చెల్లించింది. మరిన్ని రుణాల చెల్లింపులను చేపట్టనున్నట్లు తెలియజేసింది. తాజా మొత్తం ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్‌కు చేరగా.. మార్చిలో గడువు తీరనున్న మరో రూ. 1,000 కోట్ల కమర్షియల్ పేపర్స్‌కు సైతం చెల్లింపులు చేపట్టనున్నట్లు వెల్లడించింది. నగదు బ్యాలన్స్ నుంచి ప్రీపేమెంట్ చేసినట్లు కంపెనీ ప్రతినిధి ఒకరు తెలియజేశారు. కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 5,000 కోట్ల రుణాలను తిరిగి చెల్లించనున్నట్లు ఈ నెల 8న కంపెనీ స్పష్టం చేసింది. వచ్చే నెలలో 50 కోట్ల డాలర్ల బ్రిడ్జి రుణాన్ని సైతం తిరిగి చెల్లించనున్నట్లు పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-2-2023	
విశాఖ	420-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	409-00
విజయవాడ	409-00
రిటైల్ ధర (డజను)	66.00
20-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	395-00
వరంగల్	397-00
రిటైల్ ధర	4.55

టాటా మోటార్స్-ఉబర్ భారీ డీల్

25,000 ఎక్స్‌ప్రెస్-టి ఈవీల సరఫరా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వెహికిల్స్ రంగంలో భారీ డీల్‌కు వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్, రైడ్ షేరింగ్ యాప్ ఉబర్ తెర లేపాయి. ఇరు సంస్థల మధ్య సోమవారం ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా 25,000 యూనిట్ల ఎక్స్‌ప్రెస్-టి ఎలక్ట్రిక్ సెడాన్ వాహనాలను ఉబర్‌కు టాటా మోటార్స్ సరఫరా చేయనుంది. ఎక్స్‌ప్రెస్-టి ఈవీలను ప్రీమియం సేవల కింద ఉపయోగించనున్నట్టు ఉబర్ వెల్లడించింది. హైదరాబాద్‌సహా ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై, కోల్‌కత, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్ నగరాల్లో ఈ నెల నుంచే వీటిని నడుపుతామని తెలిపింది.

దశలవారీగా డెలివరీలు..

'ఎలక్ట్రిక్ వెహికల్స్ సరఫరా విషయంలో వాహన తయారీ కంపెనీ, రైడ్ షేరింగ్ సంస్థ మధ్య దేశంలో ఈ స్థాయి డీల్ కుదరడం ఇదే తొలిసారి. ఫిబ్రవరి నుంచే దశలవారీగా ఉబర్ ఫ్లీట్ పార్ట్‌నర్స్‌కు డెలివరీలను టాటా మోటార్స్ ప్రారంభించనుంది. దేశంలో పర్యావరణ, స్వచ్ఛ వాహనాల వినియోగం పెరిగేందుకు ఈ డీల్ దోహదం చేస్తుందని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్, టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ఎండీ శైలేశ్ చంద్ర అన్నారు. ట్యాక్సీల కోసం ప్రత్యేకంగా ఎక్స్‌ప్రెస్ బ్రాండ్‌ను టాటా మోటార్స్ 2021 జూలైలో తెచ్చింది. ఈ బ్రాండ్ కింద ఎక్స్‌ప్రెస్-టి తొలి ఉత్పాదన. ఫేమ్ సబ్సిడీ పోను హైదరాబాద్ ఎక్స్‌షోరూం ధర.. ఎక్స్‌ప్రెస్-టి ఎక్స్‌ఎమ్ ప్లస్ రూ.13.04 లక్షలు, ఎక్స్‌టీ ప్లస్ రూ.13.54 లక్షలు ఉంది.

నిర్మాణ ప్లాన్స్‌లో డిజిటల్ ఇన్‌ఫ్రాను చేర్చాల్సిందే!

- రెరా చట్టంలో నిబంధనలు చేర్చాలి
- ప్రభుత్వానికి ట్రాయ్ సిఫార్సులు



న్యూఢిల్లీ: భవంతుల నిర్మాణ ప్రణాళికల్లో నీరు, విద్యుత్, గ్యాస్ మొదలైన వాటికి సదుపాయాలు కల్పించినట్లుగానే డిజిటల్ కనెక్టివిటీ ఇన్‌ఫ్రా (డీసీఐ)కి కూడా చోటు కల్పించాలని ప్రభుత్వానికి టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ సూచించింది. డీసీఐ కల్పన, నిర్వహణ, అప్‌గ్రేడేషన్ తదితర అంశాలను కూడా తప్పనిసరిగా పొందుపర్చేలా చూడాలని సూచించింది. ఇందుకోసం రియల్ ఎస్టేట్ చట్టం రెరాలో తగు నిబంధనలను చేర్చాలని పేర్కొంది. 'డిజిటల్ కనెక్టివిటీకి సంబంధించి భవంతులకు రేటింగ్ అంశంపై ప్రభుత్వానికి ఈ మేరకు ట్రాయ్ సిఫార్సులు చేసింది. అపార్ట్‌మెంట్లు లేదా రియల్టీ ప్రాజెక్టుల్లో ఏదో ఒక నిర్దిష్ట టెల్కో గుత్తాధిపత్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. వైర్‌లెస్ పరికరాలను ఇన్‌స్టాల్ చేయడం టెలికం లేదా ఇంటర్నెట్ సర్వీస్ లైసెన్సు హోల్డర్ బాధ్యతగా ఉంటుందని ట్రాయ్ తెలిపింది. బిల్డింగ్‌ల్లో డీసీఐ ప్రస్తుత ప్రమాణాలు, ప్రక్రియలను సమీక్షించే బాధ్యతను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్)కు అప్పగించాలని పేర్కొంది.

డిజిటల్ సేవల పటిష్టంపై త్వరలో చర్చాపత్రం

దేశీయంగా డిజిటల్ సేవలను మరింత పటిష్టం చేసేందుకు, అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు తీసుకోదగిన చర్యలపై కూడా ట్రాయ్ దృష్టి సారిస్తోంది. డివైజ్‌లు, కనెక్టివిటీ, డిజిటల్ అక్షరాస్యతపై ప్రధానంగా దృష్టి పెట్టనుంది. ఇందుకు సంబంధించిన చర్చాపత్రాన్ని రాబోయే నెలల్లో విడుదల చేయనున్నట్లు ఇండియా డిజిటల్ సదస్సు 2023లో పాల్గొన్న సందర్భంగా ట్రాయ్ చైర్మన్ పీడీ వాఘేలా తెలిపారు. దేశవ్యాప్తంగా టెల్కోలు 5జీ సేవలను వేగంగా విస్తరిస్తున్నప్పటికీ డివైజ్‌ల రేట్లు అధికంగా ఉన్నాయని సామాన్య ప్రజానీకం భావిస్తున్న నేపథ్యంలో వాఘేలా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వచ్చే 25 ఏళ్లలో దేశీయంగా డిజిటల్ వినియోగాన్ని వేగవంతం చేయాలంటే డిజిటల్ గవర్నెన్స్ మౌలిక సదుపాయాల కల్పన, టెక్నాలజీపై విధానాల రూపకల్పన వంటి ఎనిమిది కీలక సవాళ్లను అధిగమించాల్సి ఉంటుందని వాఘేలా చెప్పారు. ప్రజోపయోగకరమైన ఆధార్, యూపీఐ, డిజిలాకర్ వంటి డిజిటల్ వ్యవస్థలతో ప్రపంచానికి భారత్ ఆదర్శంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సామాజిక ఆర్థిక సవాళ్లను పరిష్కరించేందుకు మన దేశ పరిస్థితులకు ఉపయోగపడేలా వినూత్న డిజిటల్ ఆవిష్కరణలను రూపొందించాల్సిన అవసరం ఉందని వాఘేలా తెలిపారు.

మార్కెట్‌కు వడ్డీరేట్ల భయాలు

- ఇంధన, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు
- సూచీలు రెండోరోజూ డీలా
- నిఫ్టీ నష్టం 100 పాయింట్లు
- 61 వేల దిగువకు సెన్సెక్స్



ముంబై: అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు ఆందోళనలతో దేశీయ స్టాక్ సూచీలు రెండోరోజూ డీలాపడ్డాయి. ఇంధన, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఫలితంగా సోమవారం సూచీలు అరశాతం నష్టపోయాయి. తొలి సెషన్‌లో సానుకూలంగా ట్రేడయ్యాయి. మిడ్ సెషన్ నుంచి తలెత్తిన అమ్మకాలతో ఆరంభ నష్టాలను కోల్పోయాయి. మార్కెట్ ముగిసే వరకు విక్రయాలు కొనసాగడంతో సూచీలు ఏ దశలో కోలుకోలేకపోయాయి. ఉదయం సెన్సెక్స్ 61,003 పాయింట్ల వద్ద మొదలైంది. ప్రథమార్ధంలో 290 పాయింట్లు బలపడి 61,290 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 311 పాయింట్లు నష్టపోయి 60,691 వద్ద నిలిచింది. నిఫ్టీ 17,966 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 17,818 - 18,004 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 100 పాయింట్లు నష్టపోయి 17,845 వద్ద నిలిచింది. ఆటో, ఐటీ షేర్లకు మాత్రమే కొనుగోళ్ల మద్దతు లభించింది. సూచీల అరశాతం నష్టంతో ఇన్వెస్టర్లకు రూ.95,756 కోట్ల నష్టం వాటిల్లింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.159 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.86 కోట్ల షేర్లను కొన్నారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ తొమ్మిది పైసలు బలపడి 82.73 స్థాయి వద్ద స్థిరపడింది. ఆసియా, యూరప్ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి. యూఎస్ ప్రెసిడెంట్ డే సందర్భంగా అమెరికా మార్కెట్లకు సోమవారం సెలవు.

''ఆర్‌బీఐ, ఫెడ్ రిజర్వ్ మినిట్స్ వెల్లడి (బుధవారం)కి ముందు దేశీయ మార్కెట్ అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ద్రవ్యోల్బణ కట్టడి లక్ష్యంగా ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధానంపై కఠిన వైఖరితో ఉండొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. ఉత్తర కొరియా మరోసారి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఈ అంశాలు ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. నిరంతర వడ్డీరేట్ల పెంపుతో డిమాండ్, ఆదాయాలు మందగిస్తాయి. దేశీయంగా అదానీ గ్రూప్ షేర్లలో విక్రయాలు కొనసాగడం ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది. స్వల్పకాలం పాటు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించాలి'' జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

ఎన్‌ఎండీసీ స్టీల్ లిస్టింగ్ సూపర్ సక్సెస్

మైనింగ్ దిగ్గజం ఎన్‌ఎండీసీ నుండి విడిపోయి ఎక్స్ఛేంజీలో లిస్టయిన ఎన్‌ఎండీసీ స్టీల్ షేరు తొలి రోజే ఇన్వెస్టర్లకు లాభాలను పంచింది. బీఎస్‌ఈలో రూ.30.25 వద్ద లిస్టయ్యింది. ప్రారంభంలోనే భారీ డిమాండ్ లభించడంతో క్షణాల్లో షేరు ఐదుశాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకి రూ.31.75 వద్ద లాకైంది. ఎక్స్ఛేంజీలో మొత్తం 87.65 లక్షల షేర్లు చేతులు మారాయి. మార్కెట్ విలువ రూ.9,304.67 కోట్లుగా నమోదైంది.

■ సూచీల్లో అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ 1.33%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.18%, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ఒకశాతం చొప్పున నష్టపోయి సూచీల పతనానికి ప్రధానమైన కారణమయ్యాయి.

■ పీతంపూర్ ప్లాంట్‌లో 8 లోపాలు గుర్తించి యూఎస్‌ఎఫ్‌డీఏ ఫామ్ 483 అబ్జర్వేషన్ జారీ చేయడంతో సిప్లా కంపెనీ షేరు 6% నష్టపోయి రూ.964 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 7% పతనమై రూ.956 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.

వేదాంతా - హిందుస్తాన్ జింక్ డీల్‌కు బ్రేక్!

- ప్రతిపాదనను వ్యతిరేకించిన కేంద్రం
- విలువల్లో వ్యత్యాసాలపై ఆందోళన
- దీంతో నిలిచిపోనున్న 2.98 బిలియన్ డాలర్ల డీల్
- వేదాంతా రుణ భారం తగ్గింపు ప్రయత్నానికి విఘాతం



న్యూఢిల్లీ: రుణ భారాలను తగ్గించుకోవాలని భావిస్తున్న బిలియనీర్ అనిల్ అగర్వాల్ మైనింగ్ గ్రూప్‌కు ఎదురుదెబ్బ తగిలింది. అగర్వాల్ నియంత్రణలోని వేదాంతా తన అంతర్జాతీయ జింక్ వ్యాపారాన్ని (అసెట్స్) హిందుస్తాన్ జింక్ (హెచ్‌జెడ్‌ఎల్)కు 2.98 బిలియన్ డాలర్లకు విక్రయించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం వ్యతిరేకించింది. విలువలకు సంబంధించి తలెత్తిన ఆందోళనలే దీనికి కారణం కావడం గమనార్హం. ఈ డీల్ ద్వారా తన దాదాపు 10 బిలియన్ డాలర్ల రుణ భారంలో కొంత తగ్గించుకోవాలన్న వేదాంతా ప్రయత్నానికి తాజా పరిణామం విఘాతంగా నిలుస్తోంది.

చట్టపరమైన చర్యలకూ ప్రభుత్వం సిద్ధం

ఆఫ్రికా ఆధారిత వ్యాపారాన్ని హిందుస్తాన్ జింక్‌కు విక్రయించడాన్ని నిలువరించడానికి అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామనీ ప్రభుత్వం హెచ్చరించింది. ఈ మేరకు హిందుస్తాన్ జింక్ లిమిటెడ్‌కు గనుల మంత్రిత్వశాఖ ఒక లేఖ రాస్తూ, ''ఈ లావాదేవీకి సంబంధించి ప్రభుత్వం తన అసమ్మతిని పునరుద్ఘాటించాలనుకుంటోంది'' అని పేర్కొంది. హిందుస్తాన్ జింక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన డాక్యుమెంట్లలో ఈ విషయాన్ని తెలిపింది. హిందుస్తాన్ జింక్‌లో కేంద్రానికి 29.54 శాతం వాటా ఉన్న సంగతి తెలిసిందే. మాతృ సంస్థ వేదాంతా నుంచి టీహెచ్‌ఎల్ జింక్ లిమిటెడ్ మారిషస్‌ను 2.98 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేయాలని హిందుస్తాన్ జింక్ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ప్రతిపాదన ప్రకారం 18 నెలల్లో దశలవారీగా ఈ కొనుగోలు ప్రక్రియ జరగాల్సి ఉంది. జింక్, సీసం, వెండి సమీకృత ఉత్పత్తిదారు.. హిందుస్తాన్ జింక్‌లో వేదాంతాకు 64.92 శాతం వాటా ఉంది. కాగా.. మైనింగ్ శాఖ లేఖను బోర్డు ముందు ఉంచనున్నట్లు హిందుస్తాన్ జింక్ తాజాగా వెల్లడించింది. వేదాంతా గ్రూప్‌లోకెల్లా భారీ డివిడెండ్ల ద్వారా హెచ్‌జెడ్‌ఎల్ సంపన్న సంస్థగా నిలుస్తూ వస్తోంది.

హిందుస్తాన్ జింక్ షేర్ ధర సోమవారం 1% తగ్గి, రూ.321 వద్ద స్థిరపడగా, వేదాంతా షేర్ ధర కూడా అంతే శాతం తగ్గి, రూ.311 వద్ద ముగిసింది.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, న్యూఢిల్లీలో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

న్యూఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» మాస్టర్స్ ప్రోగ్రామ్: రెండేళ్ల వ్యవధి (ఫుల్ టైం)
» మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (ఆర్కిటెక్చరల్ కన్జర్వేషన్) » మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(అర్బన్ డిజైన్)
» మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ » మాస్టర్ ఆఫ్ డిజైన్(ఇండస్ట్రియల్ డిజైన్)
» మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ (ఇన్విరాన్‌మెంటల్ ప్లానింగ్) » మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ (హౌసింగ్)
» మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ (రీజినల్ ప్లానింగ్)
» మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ (ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్)
» మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ (అర్బన్ ప్లానింగ్)
» **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్/సీడ్/యూజీసీ నెట్ వ్యాలిడ్ స్కోరు ఉండాలి.
» **పీహెచ్‌డీ ప్రోగ్రామ్ (ఫుల్ టైం, పార్ట్‌టైం):** ఏడాదికి రెండు సార్లు ప్రవేశాలు ఉంటాయి.
» **బ్యాచిలర్స్ ప్రోగ్రామ్ (బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్):** ఎన్‌టీఏ నిర్వహించే జేఈఈ(మెయిన్) 2023 ద్వారా ప్రవేశాలు ఉంటాయి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.02.2023.
» **ఇంటర్వ్యూ తేదీలు:** 27.03.2023 నుంచి 31.03.2023 వరకు
» **ఎంపిక జాబితా వెల్లడి తేది:** 14.04.2023
» **వెబ్‌సైట్:** spa.ac.in

ఏఎన్‌యూ దూరవిద్యలో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్.. దూర విద్య విధానంలో క్యాలెండర్ ఇయర్ 2023 కింద యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» **పీజీ ఆర్ట్స్ ప్రోగ్రామ్:** రెండేళ్లు(4 సెమిస్టర్లు) ఎంఏ: ఇంగ్లిష్, తెలుగు, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్, చరిత్ర, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, జర్నలిజం-మాస్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్.
» **పీజీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్:** రెండేళ్లు (4 సెమిస్టర్లు)
ఎంకాం: అకౌంటెన్సీ, బ్యాంకింగ్.
» **యూజీ ఆర్ట్స్ ప్రోగ్రామ్:** మూడేళ్లు(6 సెమిస్టర్లు) బీఏ: ఎకనామిక్స్, హిస్టరీ, పాలిటిక్స్/ఎకనామిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పాలిటిక్స్/ఎకనామిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ/ఎకనామిక్స్,హిస్టరీ,సోషియాలజీ/ఎకనామిక్స్, పాలిటిక్స్, సోషియాలజీ/హిస్టరీ, పాలిటిక్స్, సోషియాలజీ/పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పాలిటిక్స్, హిస్టరీ/స్పెషల్ ఇంగ్లిష్, హిస్టరీ, స్పెషల్ తెలుగు/ఎకనామిక్స్, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్.
» **యూజీ కామర్స్, మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్:** మూడేళ్లు (6 సెమిస్టర్లు)
» **బీకాం:** జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్.
» **బీబీఏ:** బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్
» **లైబ్రరీ ప్రోగ్రామ్:** ఏడాది (2 సెమిస్టర్లు)
» బీఎల్‌ఐఎస్సీ (బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్) » ఎంఎల్‌ఐఎస్సీ (మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్)
» **సర్టిఫికేట్/డిప్లొమా ప్రోగ్రామ్:** ఏడాది.
» సర్టిఫికేట్ కోర్సు ఇన్ హెచ్‌ఐవీ ఎయిడ్స్ కౌన్సిలింగ్ » సర్టిఫికేట్ కోర్సు ఇన్ హోటల్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ » డిప్లొమా (ఫుడ్ ప్రొడక్షన్) » డిప్లొమా (సైకలాజికల్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్) » **అర్హత:** కోర్సును బట్టి పదో తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.02.2023.
» **వెబ్‌సైట్:** www.anucde.info

బెల్, ఘజియాబాద్‌లో 50 పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఘజియాబాద్ యూనిట్ తాత్కాలిక ప్రాతిపదికన ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 50
» **పోస్టుల వివరాలు:** ట్రైనీ ఇంజనీర్1-14, ప్రాజెక్ట్ ఇంజనీర్1-36.
» **అర్హత:**55% మార్కులతో బీఎస్సీ (ఇంజనీరింగ్)/బీఈ, బీటెక్ (ఎలక్ట్రానిక్స్/మెకానికల్)తో పాటు సంబంధిత విభాగంలో పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.02.2023 నాటికి టీఈ పోస్టులకు 28ఏళ్లు,పీఈ పోస్టులకు 32ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.02.2023.
» **రాతపరీక్ష తేది:** 2023 మార్చిలో.
» **వెబ్‌సైట్:** www.bel-india.in

ఈ కోర్సులతో.. వెండితెర కెరీర్!

సినిమా ప్రపంచం.. అందరూ ఆసక్తి చూపే రంగం! చలన చిత్రాలపై యువతకు ఎంతో క్రేజ్!! రీల్ లైఫ్‌లో సత్తా చాటి.. రియల్‌లైఫ్‌లో కెరీర్ వెలుగులు సొంతం చేసుకోవాలని ఎంతో మంది కలలు కంటుంటారు. కాని ఎంతటి సృజనాత్మకత ఉన్నా.. దానికి మెరుగులు దిద్దుకుంటేనే.. వెండితెరపై వెలుగులీనే అవకాశం దక్కుతుంది! అలాంటి చలన చిత్ర రంగంలో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలు అందించే ఎఫ్‌టీటీఐ, సత్యజిత్‌రే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశానికి చక్కటి మార్గం.. జెట్!! ఇటీవల జాయింట్ ఎంట్రన్స్ టెస్ట్(జెట్) 2022-23 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. జెట్ ద్వారా ప్రవేశం కల్పిస్తున్న కోర్సులు, అడ్మిషన్ విధానం, ప్రవేశ పరీక్ష, భవిష్యత్తు అవకాశాలపై ప్రత్యేక కథనం..



- ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సంక్షిప్తంగా.. ఎఫ్‌టీటీఐ.
- సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్.. ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐగా సుపరిచితం.

గత కొన్ని దశాబ్దాలుగా సినీ రంగంలోని 24 క్రాఫ్ట్స్‌కు సంబంధించి దాదాపు అన్ని విభాగాల్లోనూ అకడమిక్ కోర్సుల ద్వారా శిక్షణ ఇస్తూ.. ఈ రంగానికి ఎందరో ప్రముఖులను పరిచయం చేసిన ఇన్‌స్టిట్యూట్‌లు. వీటిల్లో చేరి తమకు ఆసక్తి ఉన్న విభాగంలోని కోర్సులు పూర్తి చేసుకుంటే.. సినీ, టీవీ రంగాల్లో ఆన్-స్క్రీన్, ఆఫ్-స్క్రీన్ అవకాశాలు స్వాగతం పలుకుతాయనడంలో సందేహం లేదు.

16 ప్రోగ్రామ్‌లు

ఎఫ్‌టీటీఐ నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ టెస్ట్‌లో మెరిట్ ఆధారంగా.. ఎఫ్‌టీటీఐ, ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐలలో.. పీజీ సర్టిఫికెట్, పీజీ డిప్లొమా, యూజీ సర్టిఫికెట్ పేరుతో 16 ప్రోగ్రామ్‌లో సీట్లు భర్తీ చేస్తారు. వీటిని గ్రూప్-ఎ, బి, సిలుగా వర్గీకరించారు.

గ్రూప్-ఎ కోర్సులు

- పీజీ డిప్లొమా ఇన్ ఆర్ట్ డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్ డిజైన్;వ్యవధి మూడేళ్లు;ఇన్‌స్టిట్యూట్-ఎఫ్‌టీటీఐ
- పీజీ డిప్లొమా ఇన్ స్క్రీన్ యాక్టింగ్; వ్యవధి-రెండేళ్లు; ఇన్‌స్టిట్యూట్-ఎఫ్‌టీటీఐ. •పీజీ డిప్లొమా ఇన్ స్క్రీన్ రైటింగ్(ఫిలిం, టీవీ, వెబ్ సిరీస్); వ్యవధి-రెండేళ్లు; ఇన్‌స్టిట్యూట్-ఎఫ్‌టీటీఐ.
- యూజీ సర్టిఫికెట్ ఇన్ యానిమేషన్ అండ్ విజువల్ ఎఫెక్ట్స్ డిజైన్; వ్యవధి-మూడేళ్లు, ఇన్‌స్టిట్యూట్-ఎఫ్‌టీటీఐ.
- పీజీ డిప్లొమా ఇన్ యానిమేషన్ సినిమా; వ్యవధి-మూడేళ్లు, ఇన్‌స్టిట్యూట్- ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ.
- పీజీ డిప్లొమా ఇన్ ప్రొడ్యూసింగ్ ఫర్ ఫిల్మ్ అండ్ టెలివిజన్; వ్యవధి-మూడేళ్లు, ఇన్‌స్టిట్యూట్-ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ. •పీజీ డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా మేనేజ్‌మెంట్; వ్యవధి-రెండేళ్లు, ఇన్‌స్టిట్యూట్-ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ.

గ్రూప్-బి కోర్సులు

- పీజీ డిప్లొమా ఇన్ డైరెక్షన్ అండ్ స్క్రీన్ ప్లే రైటింగ్, వ్యవధి-మూడేళ్లు, ఇన్‌స్టిట్యూట్- ఎఫ్‌టీటీఐ, ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ.
- పీజీ డిప్లొమా ఇన్ సినిమాటోగ్రఫీ,వ్యవధి-మూడేళ్లు, ఇన్‌స్టిట్యూట్-ఎఫ్‌టీటీఐ,ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ.
- పీజీ డిప్లొమా ఇన్ ఎడిటింగ్, వ్యవధి-మూడేళ్లు, ఇన్‌స్టిట్యూట్-ఎఫ్‌టీటీఐ, ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ.
- పీజీ డిప్లొమా ఇన్ సౌండ్ రికార్డింగ్ అండ్ సౌండ్ డిజైన్, వ్యవధి-మూడేళ్లు, ఇన్‌స్టిట్యూట్-ఎఫ్‌టీటీఐ, ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ.

గ్రూప్-సి కోర్సులు

- **పీజీ సర్టిఫికెట్ కోర్సులు:** డైరెక్షన్; ఎలక్ట్రానిక్ సినిమాటోగ్రఫీ; వీడియో ఎడిటింగ్; సౌండ్ రికార్డింగ్ అండ్ టెలివిజన్ ఇంజనీరింగ్;
- **పీజీ డిప్లొమా కోర్సులు:** డైరెక్షన్ అండ్ ప్రొడ్యూసింగ్ ఫర్ ఈడీఎం; సినిమాటోగ్రఫీ ఫర్ ఈడీఎం; ఎడిటింగ్ ఫర్ ఈడీఎం; సౌండ్ ఫర్ ఈడీఎం; రైటింగ్ ఫర్ ఈడీఎం.

అర్హతలు

- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. మూడేళ్ల వ్యవధిలోని పీజీ డిప్లొమా ఇన్ ఆర్ట్ డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్ డిజైన్,యూజీ సర్టిఫికెట్ ఇన్ యానిమేషన్ అండ్ విజువల్ ఎఫెక్ట్స్ డిజైన్ కోర్సులకు మాత్రం ప్రత్యేక అర్హత ప్రమాణాలను నిర్దేశించారు. • **పీజీ డిప్లొమా ఇన్ ఆర్ట్ డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్ డిజైన్:** అప్లైడ్ ఆర్ట్స్, ఆర్కిటెక్చర్, పెయింటింగ్, స్కల్ప్చర్, ఇంటీరియర్ డిజైన్ లేదా సంబంధిత విభాగాల్లో ఫైన్ ఆర్ట్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **యూజీ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యానిమేషన్ అండ్ విజువల్ ఎఫెక్ట్స్ డిజైన్:** ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి.
- పీజీ డిప్లొమా, పీజీ సర్టిఫికెట్ కోర్సులకు బ్యాచిలర్ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

రెండు పేపర్లు..100 మార్కులు

- ఎఫ్‌టీటీఐ, ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐలలోని పైన పేర్కొన్న కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న జాయింట్ ఎంట్రన్స్ టెస్ట్ రెండు పేపర్లుగా, 100 మార్కులకు ఉంటుంది. వివరాలు..
- **పేపర్-1:** ఈ పేపర్‌ను పార్ట్-ఎ, పార్ట్-బిలుగా మొత్తం 50 మార్కులకు నిర్వహిస్తారు.
- పార్ట్-ఎలో.. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ టీవీ, అల్లయిడ్ ఆర్ట్స్, లిటరేచర్, జనరల్ అవేర్‌నెస్, ఎన్విరాన్‌మెంటల్ అవేర్‌నెస్, ఆర్ట్, కల్చర్, మీడియా విభాగాలకు సంబంధించి జనరల్ నాలెడ్జ్ అంశాలుంటాయి. పార్ట్-ఎలో మొత్తం 20 ప్రశ్నలు (20 మార్కులు) అడుగుతారు.
- పార్ట్-బిలో అభ్యర్థులు పేర్కొన్న సబ్జెక్ట్ సంబంధిత అంశాలుంటాయి. ఈ విభాగంలో మొత్తం 15 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున 30 మార్కులకు పార్ట్-బి నిర్వహిస్తారు.

పేపర్-2 ఇలా

- జెట్‌లో కీలకమైన పేపర్-2లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విభాగంలో డిస్క్రిప్టివ్ విధానంలో ప్రశ్నలు అడుగుతారు. ఒక సుదీర్ఘ వివరణాత్మక సమాధానం ఇవ్వాల్సిన విధంగా ప్రశ్న అడుగుతారు. దీనికి 20 మార్కులు కేటాయించారు. • రెండో విభాగంలో.. స్కెచెస్, ఫొటోగ్రాఫ్స్‌కు సంబంధించిన డిస్క్రిప్టివ్ ప్రశ్నలు, షార్ట్ నోట్స్ ప్రశ్నలు ఉంటాయి. మొత్తం ఆరు ప్రశ్నలు ఇచ్చి..అందులో మూడు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వమని అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు 10 మార్కులు చొప్పున మూడు ప్రశ్నలకు 30 మార్కులు ఉంటాయి.
- ఇలా మొత్తం రెండు పేపర్లు కలిపి 100 మార్కులు(పేపర్-1- 50 మార్కులు; పేపర్-2-50 మార్కులు)కు పరీక్ష నిర్వహిస్తారు.
- పేపర్-1ను ఒక గంట వ్యవధిలో, పేపర్-2 రెండు గంటల వ్యవధిలో మొత్తం మూడు గంటల వ్యవధిలో పరీక్ష ఉంటుంది.

మలిదశ ఎంపిక ప్రక్రియ

- జెట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా.. మలిదశలో ఎఫ్‌టీటీఐ, ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐలు ఆడిషన్, ఓరియెంటేషన్, ఇంటర్వ్యూ ప్రక్రియ నిర్వహిస్తాయి.
- మలిదశ ప్రక్రియకు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో.. జెట్ పేపర్-2 మార్కులనే పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యర్థులు పేపర్-1లో తప్పనిసరిగా నిర్దిష్ట అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.

తుది జాబితా ఇలా

రాత పరీక్షలో పొందిన మార్కులు, మలి దశలో సాధించిన మార్కులను క్రోడీకరించి.. ఫైనల్ మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల నుంచి ప్రాథమ్యాలను సేకరించి.. అందుబాటులోని సీట్లు, అభ్యర్థులు పొందిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

ప్రతి గ్రూప్ నుంచి ఒక కోర్సుకు

ఎఫ్‌టీటీఐ,ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐలలోని కోర్సులను మూడు గ్రూప్‌లుగా విభజించిన నేపథ్యంలో..అభ్యర్థులు తమ ఆసక్తి మేరకు ప్రతి గ్రూప్ నుంచి ఒక కోర్సుకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

ఉజ్వల అవకాశాలు

• ఎఫ్‌టీటీఐ, ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐలలోని కోర్సులు పూర్తి చేసుకుంటే.. సంబంధిత విభాగాల్లో విస్తృత అవకాశాలు సొంతం చేసుకునే నైపుణ్యం లభిస్తుంది. యాక్టింగ్, డైరెక్షన్, ఎడిటింగ్, మ్యూజిక్, ఫొటోగ్రఫీ, స్క్రీన్ ప్లే, సౌండ్ టెక్నాలజీ తదితర విభాగాల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు.

• కేవలం సినీ రంగంలోనే కాకుండా..టెలివిజన్ విభాగంలోనూ కొలువులు లభిస్తున్నాయి. అదే విధంగా ఇటీవల కాలంలో ఓటీటీ కల్చర్ విస్తరిస్తూ.. పలు వెబ్ సిరీస్‌లు విడుదలవుతున్న నేపథ్యంలో.. వాటిలోనూ అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు.

ప్రతిభ ప్రధానం

సినీ రంగంలో గుర్తింపు పొందాలంటే.. వ్యక్తిగత ప్రతిభ ఎంతో ముఖ్యం. సన్నివేశానికి తగినట్లుగా యాక్టింగ్, డైరెక్షన్, ఎడిటింగ్, స్క్రీన్ ప్లే, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ వంటి వాటిని ఆకట్టుకునేలా తీర్చిదిద్దేందుకు పర్సనల్ టాలెంట్ అవసరం. ప్రతిభ, ప్రొడక్షన్ హౌస్‌ని బట్టి ఆయా విభాగాల్లో నెలకు రూ.50 వేల వరకూ అందుకునే అవకాశం ఉంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** మార్చి 4, 2023
- **జెట్ పరీక్ష తేదీలు:** మార్చి 18 - 19(మార్చి 18న గ్రూప్-ఎ కోర్సులకు, మార్చి 19 ఉదయం 9 నుంచి 12 వరకు గ్రూప్-బి కోర్సులకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు గ్రూప్-సి కోర్సులకు పరీక్ష).
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://applyadmission.net/jet-2022_23

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

ప్రథమ వర్ధంతి నివాళులు



కీ॥శే॥ మేకపాటి గౌతమ్ రెడ్డి గారు

దివంగత మంత్రివర్యులు - ఆంధ్రప్రదేశ్

జననం: 02.11.1971

మరణం: 21.02.2022

ప్రతి ఒక్కరినీ ప్రేమగా పలకరించి...
పెద్దలను ఎంతగానో గౌరవించి...
ప్రజా సమస్యలను పరిష్కరించి...
మంచితనం మూర్తీభవించి...
మానవత్వం మేళవించి...
అందరి మన్ననలను పొంది, అందరి వాడివైన
మనసున్న మారాజుకు
ప్రథమ వర్ధంతి నివాళి...

మేకపాటి కుటుంబ సభ్యులు

బంధు మిత్రులు మరియు అభిమానులు